పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344
Shop online through our website navachethanabooks.in

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడిగా దగ్గుబాటి సురేశ్‌బాబు ఎన్నిక
- ఉపాధ్యక్షులుగా సూర్యదేవర నాగవంశీ, భరత్

12

సంపుటి 09, సంచిక: 32 | సోమవారం | 29-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## దేశంలో పేదరికం రెట్టింపు

- సంపద కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు మోదీ సర్కార్ తహతహ
- మతోన్మాదాన్ని పెంచుతూ యుద్ధోన్మాదానికి తెరలేపింది
- ఈ రెండూ దేశానికి ప్రమాదకరమే
- ప్రజాస్వామ్యం పేరుతో రాజ్యమేలుతున్న ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం



### భూపాలపల్లిలో సిపిఐ వందేళ్ళ పైలాన్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/భూపాలపల్లి

దేశ ఖనిజ సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే అందుకే తహతహలాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యిందని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగిపోయారని విమర్శించారు. ప్రధాని మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమం కుంటుపడిందని మండిపడ్డారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ 100 సంవత్సరాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా కేంద్రం లోని రావి నారాయణరెడ్డి భవనం నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణంలో సిపిఐ 100 సంవత్సరాల జ్ఞాపకార్థం శతాబ్ది ఉత్సవాల్లో

తరువాయి 12లో

## నేడు అసెంబ్లీ

### జనవరి మొదటివారం వరకు జరిగే అవకాశం



- కృష్ణా, గోదావరి జలాల కేటాయింపు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చ?
- ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత, జిహెచ్ఎంసిలో వార్డుల పెంపు బిల్లులు పెట్టే అవకాశం
- సమావేశాలు సజావుగా జరిగేలా అధికారులు పనిచేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభంకానున్నాయి. ప్రధానంగా కృష్ణా, గోదావరి జలాల కేటాయింపులు, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ అంశంపైన సభలో చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. జనవరి మొదటి వారం వరకు సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అలాగే పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు పిల్ల నిబంధన ఎత్తివేస్తూ గతంలో జారీ చేసిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లును, హైదరాబాద్‌లో వార్డుల సంఖ్యను పెంచుతూ జిహెచ్ఎంసి, పురపాలక బిల్లుతో పాటు రెండు కొత్త ప్రైవేటు యూనివర్సిటీలను ఏర్పాటుకు సంబంధించిన బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. పురపాలిక, జిహెచ్ఎంసికి సంబంధించిన బిల్లులు ప్రవేశపెట్టే సమయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. భారత్ గ్లోబల్ సమ్మిట్ తదితర అంశాలు కూడా సమావేశంలో చర్చకు రానున్నాయి. సమావేశంలో నీటి కేటాయింపులు, ప్రాజెక్ట్‌ల అంశంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలని పాలక వర్గం, ప్రభుత్వ ఆరోపణలకు సమాధానం చెప్పాలని ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ సిద్ధమైంది. ప్రధానప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు కూడా సమావేశాలకు హాజరుకానున్నారు. కానీ

తరువాయి 2లో

### సమావేశాలు 15 రోజులు నిర్వహించాలి

- కృష్ణా జలాలపై కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానాలు చెబుతాం
- మాజీమంత్రి హరీశ్‌రావు



శాసనసభ సమావేశాలను 15 రోజుల పాటు నిర్వహించాలని, సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్చపెట్టినా మాట్లాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చేస్తున్న ఆరోపణలకు తాము సభలో సమాధానం చెబుతామన్నారు. సమావేశాలను నిర్వహించేంది ప్రజా సమస్యలపై చర్చించేందుకు కాదని, ప్రతిపక్షంపైన బురద జల్లడానికేనని, అసెంబ్లీ సమావేశాలను నిర్వహించేందుకు ప్రభుత్వం భయపడుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో

తరువాయి 2లో



### జలాంతర్గామిలో రాష్ట్రపతి

- ఐఎన్ఎస్ వాఘ్షీర్‌లో ముర్ము ప్రయాణం
- సబ్‌మెరిన్ ప్రయాణాన్ని చేపట్టిన రెండవ రాష్ట్రపతి

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం పశ్చిమ సముద్ర తీరంలో భారత నావికాదళానికి చెందిన ఫ్రంట్‌లైన్ జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్షీర్‌లో ప్రయాణించారు. ద్రౌపదిముర్ము జలాంతర్గామి ప్రయాణాన్ని చేపట్టిన రెండవ రాష్ట్రపతి అయ్యారు. 2006 ఫిబ్రవరిలో అప్పటి రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ జలాంతర్గామి ప్రయాణాన్ని చేపట్టిన మొదటి రాష్ట్రపతి. కర్ణాటకలోని కార్వార్ నావికా స్థావరం నుండి కల్వరి తరగతి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్షీర్‌లో రాష్ట్రపతి ముర్ముతోపాటు నౌకా దళాధిపతి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. రాష్ట్రపతి సైన్యానికి సుప్రీం కమాండర్‌గా కూడా వ్యవహరిస్తారు. 'భారత నావికాదళం స్వదేశీ కల్వరి తరగతి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్షీర్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కార్వార్ నావికా స్థావరంలో ఎక్కారు' అని రాష్ట్రపతి సచివాలయం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. జలాంతర్గామిలోకి ప్రవేశించే ముందు నావికాదళం యూనిఫామ్ ధరించిన రాష్ట్రపతి నావికాదళం సిబ్బంది వైపు చేయి ఊపి అభివాదం చేస్తూ బయల్దేరారు. పి75 స్కార్పీన్ ప్రాజెక్ట్‌లోని ఆరవ, చివరి

తరువాయి 2లో

### సిగాచీ పరిశ్రమ సిఇఒ అరెస్ట్

రిమాండ్‌కు తరలింపు





ప్రజాపక్షం /సంగారెడ్డి

రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ఘోరమైన పారిశ్రామిక ప్రమాదాలలో ఒకడిగా నిలిచిన సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమ పేలుడు ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. పరిశ్రమ సిఇఒ అమిత్‌రాజ్ సిన్హాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూన్ 30న పాశమైలారం ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 54 మంది కార్మికులు దుర్మణం చెందిన సంగతి తెలిసిందే. కార్మికుల మృతితో సిగాచీ పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు అయింది. దాదాపు ఆరు నెలలుగా దర్యాప్తు జరుగుతున్న కేసులో ఎట్టకేలకు యాజమాన్యంపై చర్యలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే శనివారం రాత్రి గుట్టు చప్పుడు కాకుండా సిగాచి సిఇఒను అరెస్టు చేసినట్లు సమాచారం. కాగా

తరువాయి 2లో

### జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడుతున్నాం

- డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు
- బస్ పాస్‌లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపచేయిస్తాం
- మీడియా అకాడమీ చైర్మన్‌పై విమర్శలు తగదు
- తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



03

### మావోయిస్టు నేత హనుమంతుకు అరుణాంజలి

నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో ముగిసిన అంత్యక్రియలు

పాల్గొన్న పౌర హక్కుల సంఘం, విరసం, అమరుల బంధు మిత్రుల సంఘం నేతలు



### భారత్‌లోనే ప్రజాస్వామ్యం సజీవం

- కాంగ్రెస్ గొప్ప నాయకుల వల్లే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరణ
- కాంగ్రెస్ ఒక సిద్ధాంతం.. అవి ఎప్పటికీ నశించవు
- 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ :** 'ప్రజాస్వామ్యం సజీవంగా ఉన్న ఏకైక దేశం భారతదేశం మాత్రమే. కాంగ్రెస్ గొప్ప నాయకుల వల్లే భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరించింది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ ఒక సిద్ధాంతమని, సిద్ధాంతాలు ఎప్పటికీ నశించవని ఆయన ఉద్ఘాటించారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఘనంగా పార్ట ఆవిర్భావ వేడుకలు జరిగాయి. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి ఖర్గే మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ ఎల్లప్పుడూ భారతదేశ ప్రజల సంక్షేమం, సాధికారత, సమ్మిళిత అభివృద్ధి కోసం పనిచేసిందన్నారు. భారత రాజ్యాంగం హామీ ఇచ్చినట్లుగా, రాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులలో సమాన అవకాశాలను తాము గట్టిగా విశ్వసిస్తామని చెప్పారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 'కాంగ్రెస్ అంతమైపోయింది' అని చెప్పేవారికి కొ విషయం స్పష్టంగా

తరువాయి 2లో

### రాజకీయాలకతీతంగా మధిర అభివృద్ధి

- విద్య, టూరిజం హబ్‌గా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ
- మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ మధిర



స్వాతంత్ర పోరాటం నుంచి నేటి వరకు గొప్ప చరిత్ర కలిగిన పట్టణం మధిర అని, రాజకీయాలకతీతంగా మధిర పట్టణాభివృద్ధి చేసి చూపిస్తానని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆదివారం మధిరలో పర్యటించిన భట్టి ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు రూ.3కోట్లతో మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో జరిగిన సభలో వారు మాట్లాడుతూ మధిర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మధిర పట్టణం శరవేగంగా అభివృద్ధి జరుగుతోందని, పట్టణాభివృద్ధికి అనుగుణంగా రోడ్ల విస్తరణ పనులతో పాటు డ్రైనేజి నీరు బయటకు రాకుండా అండర్ డ్రైనేజి నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోతే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. అండర్ డ్రైనేజి పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో పనులు పూర్తి చేసేందుకు ఆదేశించామన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లే మధిర పట్టణంలోని పేదలు నివసించడానికి జిప్లస్ టు టవర్స్‌తో హౌసింగ్ కాలనీ నిర్మించనున్నట్లు, త్వరలోనే

తరువాయి 12లో

### వెల్‌నెస్ సెంటర్లలో ఏదీ వైద్యం?



- సిబ్బంది అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యం
- అందుబాటులో లేని మందులు
- ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్లలో వైద్య సేవలు అందని పరిస్థితి. సిబ్బంది అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో అవి కాస్తా కునారిల్లుతున్నాయి. ఇన్‌చార్జిలుగా ఉన్న డాక్టర్లే స్వయంగా విధులకు హాజరు కాని పరిస్థితులు ఉండడంతో సిబ్బంది ఆడిందే ఆటగా పాడిందే పాటగా అన్నట్లు సాగుతోంది.. మరోవైపు మందులు సైతం అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది.. చివరికి సర్వ సాధారణమైన బిపి, షుగర్ మందులు కూడ ఉండడం లేదు.. బిపి, షుగర్ మందులకు సంబంధించి ఒకటి ఉంటే మరొకటి ఉండడం లేదు..దీంతో వైద్యం కోసం కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ఉద్యోగులు, మరీ ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు ఉసూరుమంటూ తిరిగి వెళుతున్నారు.. ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప మందులు అవసరమున్న వారే రావాల్సిన పరిస్థితి ఉండడంతో వయోభారంతో వారు పలుమార్లు తిరగలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా వైద్యం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నా సిబ్బంది తీరు... అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ లక్ష్యం అసలు నెరవేరడం లేదు.

**సమయ పాలన పాటించని సిబ్బంది**

పలు వెల్‌నెస్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అసలు సమయ పాలన

తరువాయి 2లో

### అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం

ప్రజాపక్షం /హైదరాబాద్




హైదరాబాద్‌లోని ఓ అపార్టుమెంట్‌లో సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం సంభవించింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధి సోమాజీగూడలో ఆదివారం రాత్రి ఆల్ పైన్ హైట్స్ అపార్టుమెంట్ ఐదవ అంతస్తులో సిలిండర్ పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన అపార్టుమెంట్ వాసులు భయంతో బయటకు పరుగులు తీసి, ప్రాణాలు రక్షించుకున్నారు. సమాచారం మేరకు ఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు బాగా ఎగిసిపడుతుండటంతో అగ్నిమాపక సిబ్బంది చుట్టుపక్కల వారిని ఖాళీ చేయించారు.

### 1 నుంచి నుమాయిష్

- రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 వరకు నిర్వహణ
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఫిబ్రవరి 15 వరకు..
- ఏర్పాట్లు పూర్తయినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు వెల్లడి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగర ప్రతిష్ఠాత్మక వార్షిక కార్యక్రమంగా పేరుగాంచిన 85వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (నుమాయిష్)–2026 జనవరి 1న ప్రారంభం కానుంది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ ప్రదర్శన జరగనుంది. ఈ మేరకు సోమవారం ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఈ నుమాయిష్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రారంభిస్తారని, రాష్ట్ర రోడ్లు–భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఎగ్జిబిషన్ సమయం సాధారణ రోజుల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, శని, ఆదివారాలు, సెలవు దినాల్లో రాత్రి 11 గంటల వరకు

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## లోయలో పడిన బస్సు : 15 మంది మృతి

**గ్వాటిమాల సిటీ :** సెంట్రల్ అమెరికా గ్వాటెమాలలో ఒక బస్సు బాగా లోతైన లోయలో పడిపోవడంతో 15 మంది మరణించారు. మరో 15 మంది గాయపడ్డారు. దీంతో ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను రద్దుచేశారు.
దేశంలో విషాద ఛాయలు అలముకున్నాయి. "ఈ పెను విషాదంపట్ల నేను తీవ్రంగా చింతిస్తున్నాను, ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను" అని దేశాధ్యక్షుడు బెర్నార్డో అరెవాలో సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ చేశారు. రెండు మున్సిపల్ నగరాలమధ్య రాకపోకలు సాగించే టోటోని కాపన్ పట్టణం వెలుపల ఇంటర్ అమెరికన్ రోడ్ అని పిలిచే ప్రయాణ మార్గం పక్కనే ఆనుకుని ఉన్న లోతైన లోయలోకి ఈ బస్సు శుక్రవారం రాత్రి పొద్దు పోయిన తర్వాత అదుపు తప్పి పడిపోయింది.
సహాయ బృందాలు ఆ ప్రాంతానికి చేరుకుని దాదాపు రెండు గంటలపాటు కష్టపడి మృతదేహాలను వెలికితీశాయని అధికారులు చెప్పారు. గ్వాటిమాలలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇక్కడ అన్నీ కొండ ప్రాంతాలే. రహదారులన్నీ చాలా ఇరుకుగా ఉంటాయి. పైగా రహదారుల నిర్వహణ కూడా సరిగ్గా ఉండదు.

## మయన్మార్‌లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం

### ఎన్నికల్లో న్యాయబద్ధత లేదు : ఐక్యరాజ్య సమితి

**యాంగాన్ :** మయన్మార్‌లో మూడు దశలుగా జరిగే ఎన్నికల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఆ దేశంలో జుంటా సైనిక పాలకులు అధికారం స్వాధీనం చేసుకున్న ఐదు సంవత్సరాల తర్వాత 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' పేరుతో దేశంలో ఎన్నికల తంతు ప్రారంభమైంది. మొదటి విడత 330 టౌన్ షిప్‌లలో 102 స్థానాలకు పోలింగ్ జరిగింది. రెండో విడత ఎన్నికలు జనవరి 11వ తేదీన జరుగుతాయి. మూడో విడత ఎన్నికలు జనవరి 25వ తేదీన జరుగుతాయి. ఎన్నికల తుది ఫలితాలు ఫిబ్రవరిలో ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఎన్నికల్లో 57 రాజకీయపార్టీలకు చెందిన 4,800 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. జాతీయ పార్లమెంటులో, స్థానిక చట్టసభలకు వారు పోటీ చేస్తున్నారు. ఐతే దేశవ్యాప్తంగా ఆరు పార్టీలు మాత్రమే పోటీలో ఉన్నాయి. ఐతే ఈ ఎన్నికల ప్రక్రియలో న్యాయబద్ధత లేదని ఐక్యరాజ్యసమితి విమర్శించింది. ఎన్నికలు నిజాయతీగా, న్యాయబద్ధంగా ఉండాలని కోరింది. సైనిక పాలకులు తమ అధికారాన్ని స్థిరీకరించుకోవడంకోసమే ఈ ఎన్నికల తంతు ప్రారంభించారని ప్రజాస్వామ్య, హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి. మయన్మార్ పార్లమెంటుకు 2020లో జరిగిన ఎన్నికలను సైనిక పాలకులు రద్దు చేశారు. ప్రమాణ స్వీకారానికి సిద్ధపడుతున్న ఆంగ్‌సాన్ సూకీ పాలక బృంద సభ్యులను, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను జైళ్ళల్లో కుక్కి దేశాధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు.
2021లో ఆంగ్‌సాన్‌సూకీ మోసపూరితంగా ఎన్నికల్లో గెలిచారని జుంటా సైనికపార్టీ విమర్శించింది. ఆనాటి ఎన్నికల్లో సైన్యం మద్దతుగలపార్టీ పోటీ చేసి చిత్తుగా పోటీచేసి ఓడిపోయింది. దీంతో సైన్యం అధికారం చేజిక్కించుకుని ఎన్నికల తీర్పును రద్దుచేసింది. ఇక అప్పటి నుండీ మయన్మార్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. లక్షల మంది ఈ యుద్ధం వల్ల నిరాశ్రయులయ్యారు. వేలాదిమంది మరణించారు.

## థాయిలాండ్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ

### ప్రధానమంత్రుల నామినేషన్లు ప్రారంభం





**బ్యాంకాక్ :** ఆగ్నేయ ఆసియా దేశం థాయిలాండ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన జరిగే ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. వివిధ పార్టీలు తమ తమ పార్టీల తరపున పోటీ చేసే ప్రధానమంత్రి అభ్యర్థుల పేర్లు ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ చేయడం ప్రారంభించాయి. పరోక్ష ఎన్నికల ప్రచారం కూడా ఇప్పటికే ప్రారంభమైంది. ఈసారి థాయ్‌లాండ్ ఎన్నికల్లో ప్రధానమంత్రి పదవికి త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉంది. పురాతన ఫూ థాయ్ పార్టీకి అంత్యంత సంపన్నవంతుడు, మాజీ ప్రధానమంత్రి థకసిన్ షినవత్ర మద్దతు ఉంది. ఆ పార్టీ తరపున ఈసారి యోచనన్ వాంగ్సావత్ (46) పోటీలో ఉన్నారు. పీపుల్స్ పవర్ పార్టీ (పిపిపి)తరపున నత్తఫాంగ్ రుయోంగ్పన్యావుట్(38), ఇక భూమి జాతా పార్టీ తరపున ప్రస్తుత ప్రధానమంత్రి అనుతిన్ ఛర్న్ విరాకుల్ పోటీలో ఉన్నారు. ఆయన కేవలం మూడునెలలుగా మాత్రమే ప్రధానమంత్రిగా కొనసాగుతున్నారు. ఆయనకు ముందు పెటోంగ్ టర్న్ షినవత్ర పొరుగు శత్రుదేశం కాంబోడియా నేతతో ఫోన్‌లో మాట్లాడి, ఆయనను అంకుల్ అని సంబోధించి వివాదంలో చిక్కుకుని పదవీ చ్యుతురాలయ్యారు. అనుతిన్ కూడా ఇటీవల వరదలు, ప్రకృతి విలయాల సమయంలో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విమర్శలు ఎదుర్కొన్నారు. దేశ రాజ్యాంగంలోని 151 నిబంధన ప్రకారం ఉభయ చట్ట సభలు ప్రధానమంత్రిని ఎన్నుకుంటాయి.
ప్రజాప్రతినిధుల సభలో ఉన్న 500 స్థానాల్లో 350 మందిని నాలుగేళ్ళ కాలానికిగాను ప్రజలు నేరుగా ఎన్నుకుంటారు. మరో 150 మందిని పార్టీల జాబితా ప్రకారం ప్రాతినిధ్య ప్రాతిపదికపై ఎనున్నకుంటారు. వివిధ జీవనరంగాలకు చెందిన ప్రముఖులను మరో 250 మంది సెనేట్ సభ్యులుగా ఐదేళ్ళ కాలానికిగాను ఎన్నుకుంటారు. పొరుగున కాంబోడియాతో గడచిన జులై నెల నుండీ సరిహద్దు ఘర్షణలు చెలరేగిన తర్వాత రాజు ఆదేశంతో ప్రధానమంత్రి అనుతిన్ ఛర్న్విరాకుల్ పార్లమెంటును రద్దుచేయాల్సి వచ్చింది. థాయిలాండ్ దేశ ఐక్యత, గుర్తింపులకు రాజు దేశాధినేతగా కొనసాగుతారు. భూమిజాతా పార్టీ తరపున ఆయన ప్రస్తుతం తాత్కాలిక ప్రధానమంత్రిగా బాధ్యతల్లో ఉన్నారు. ప్రధాన రాజకీయపార్టీ చట్టసభలో రాజ్యాంగ మార్పులపై ప్రశ్నిస్తూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సన్నద్ధమతుతున్న తరుణంలో పైన పేర్కొన్న పరిణామాలు సంభవించాయి. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో తన సంఖ్యాబలం పెంచుకోవడానికి ఈ ఎన్నికలు చాలా బాగా ఉపయోగపడతాయని ప్రధానమంత్రి అనుతిన్ విశ్వసిస్తున్నారు. ఈసారి మరింత ప్రజాబలంతో అధికారం చేజిక్కించుకోవచ్చునని ఆయన ఆశపడుతున్నారు. ఐతే ప్రజలుమాత్రం ప్రభుత్వం కోరిన రిఫరెండం ప్రకారం ఈసారి తమకు కొత్త రాజ్యాగం వద్దా? కావాలా? అనే విషయంపై తీర్పు చెప్పనున్నారు.

## సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో పోలింగ్

**బాంగీ :** సెంట్రల్ ఆఫ్రికాలో భూబంధిత దేశం "సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్' లో అధ్యక్షుణ్ణి ఎన్నిక సహా సార్వత్రి ఎన్నికలకు ఆదివారం పోలింగ్ జరిగింది. భారత కాలమానం ప్రకారం తెల్లారుజామున ఐదు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. స్థానిక ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు, దేశాధ్యక్ష పదవికి ఎన్నికలు ఒకేసారి జరిగాయి. దేశంలో మొత్తం 55 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. అధ్యక్ష ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలతోపాటు చాలా దశాబ్దాల తర్వాత గ్రామీణ ప్రాంతాలలో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ కూడా జరిగింది. దేశంలో 2016 నుండి అధ్యక్ష పదవిలో కొనసాగుతున్న ఫాస్టిన్ ఆర్చేంజ్ టౌడెరా (67) ఈసారి కూడా మొదటి రౌండు ఎన్నికల్లో విజయం సాధిస్తారని అంతా భావిస్తున్నారు. ఏ అభ్యర్థికీ 50 శాతం పైగా ఓట్లు రాకపోతే రెండోసారి రన్ ఆఫ్ పోలింగ్ నిర్వహిస్తారు. ఆయన గతంలో 2008–2013 వరకూ దేశ ప్రధానమంత్రిగా కూడా పనిచేశారు. ఆయన రాజకీయవేత్త, గణితశాస్త్రజ్ఞుడు. మళ్ళీ మళ్ళీ పోటీ చేసి గెలిచేందుకు వీలుగా 2023లో వివాదాస్పద ప్రజాభిప్రాయ సేకరణ చేయడంతో ఆయన తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. 2020 ఎన్నికల్లో విజయం సాధించిన టౌడెరా మోసంతో గెలిచారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీంతో ఆరు తిరుగుబాటు గ్రూపులు ఆయన ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నం చేశాయి. 2013 నుండి దేశంలో అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఈ దశలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. రష్యా, రువాండా దేశ సైన్యాలు సహా అంతర్జాతీయ శాంతి దళాలు దేశంలో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు సహకరిస్తున్నాయి. ప్రతిపక్ష నాయకులు రాజకీయ ప్రచారం చేయకుండా ఆటంకాలు ఎదురయ్యాయి. దేశంలో పలుచోట్ల బహిరంగ సభలు నిర్వహించకుండా ప్రతిపక్ష నాయకులకు ఆటంకాలు సృష్టించారు. దేశంలో వీధి వీధినా సైన్యం, పోలీసులను భారీగా మోహరించారు.

## సంక్షోభ పరిస్థితులమధ్య కొసావోలో రెండోసారి ఎన్నికలు



**ప్రిస్టినా :** సెర్బియా నుండి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ఆగ్నేయ ఐరోపాదేశం కొసావోలో ఈ ఏడాది మరోసారి సార్వత్రిక ఎన్నికల ప్రయత్నంలో భాగంగా ఆదివారం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. దాదాపు ఏడాదికాలంగా దేశంలో ఏర్పడిన రాజకీయ ప్రతిష్ఠంభన తొలగించేందుకు ప్రజలు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. 2025 ఫిబ్రవరి 9వ తేదీన జరిగిన ఎన్నికల్లో ప్రధానమంత్రి అల్బిన్ కుర్తి నాయకత్వాన గల వెంటె వెండోస్జే పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విఫలమైంది. 2021లో అధికారంలోకి వచ్చినప్పటినుండీ కుర్తి ప్రభుత్వం నిరంకుశ విధానాల ద్వారా మిత్రదేశాలైన అమెరికా, యూరోపియన్ యూనియన్‌లను దూరం చేసే పరిస్థితులు సృష్టిస్తోందని కొసావోలో కీలక ప్రతిపక్షాలు డెమోక్రటిక్ లీగ్ ఆఫ్ కొసావో, డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ కొసావో నాయకులు విమర్శిస్తున్నారు. బెల్గ్రేడ్‌తో సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు యూరోపియన్ యూనియన్ మధ్యవర్తిత్వం చేసినప్పుడు కుర్తి ప్రభుత్వం చాలా కఠినమైన వైఖరి అనుసరించింది. దీంతో ఇ.యు, అమెరికా దేశాలు కొసావోపట్ల శిక్షాత్మక చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ ఏడాది మొదట్లో జరిగిన ఎన్నికల్లో ఆధిక్యం వచ్చినప్పటికీ ఏ పార్టీ కూడా ఆయనకు మద్దతు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో రెండోసారి మళ్ళీ దేశంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఐరోసా–ఆండ్రియాటిక్–నల్ల సముద్రాల మధ్య కీలకమైన భూబంధిత ప్రాంతం కొసావో. ప్రధాన స్రవంతి పార్టీలతో కలిసి అల్బిన్‌కుర్తి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక పోయారు. ఆయన పార్టీతో పొత్తు పెట్టుకునేందుకు ప్రధాన స్రవంతి పార్టీలన్నీ తిరస్కరించాయి. ఈసారి కూడా 120 మంది సభ్యులుండే పార్లమెంటులో అదే పరిస్థితి ఎదురవుతుందని అంచనావేస్తున్నారు. కొసావో రాజ్యాంగం ప్రకారం 20 శాతం పార్లమెంటు స్థానాలను సెర్బులు, ఇతర మైనారిటీలకు కేటాయించారు. రెండు మిలియన్ల మంది జనాభా ఉన్న కొసావోలో ఆర్థిక పరిస్థితులు బాగోలేదు. అనిశ్చితి ఆ దేశాన్ని వెంటాడుతోంది.

## ఉక్రేన్‌లో శాంతికి "వార్ పార్టీ"యే అతిపెద్ద ఆటంకం

### రష్యా విదేశాంగమంత్రి లోవరోవ్
### యూరప్‌పై దాడి ఉద్దేశం లేదని వెల్లడి



**మాస్కో:** ఉక్రేన్‌లో శాంతికి "వార్ పార్టీ" (యుద్ధ పక్షం) అతిపెద్ద ఆటంకంగా ఉందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లోవరోవ్ విమర్శించారు. యూరోపియన్ యూనియన్‌ను ఆయన "ఒక యుద్ధ పక్షం" (వార్ పార్టీ)గా అభివర్ణించారు. యుద్ధాన్ని రెచ్చగొట్టేందుకు దాదాపు అన్ని యూరప్ దేశాలూ ఉక్రేన్‌కు ధనాన్ని, ఆయుధాలను వరదలా ప్రవహింపజేస్తున్నాయన్నారు. తమ ఆంక్షల వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందని యూరప్ కూటమి కలలు కంటోందని అన్నారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ఫ్లోరిడాలో ఆదివారం పొద్దుపోయాక జెలెన్స్కీ చర్చలకు సన్నద్ధమవుతున్న తరుణంలో లోవరోవ్ ఇంటర్వ్యూను 'టాస్ వార్తా సంస్థ" ప్రచురించింది. యూరప్‌పై దాడి చేసే ఉద్దేశం రష్యాకు లేదని, ఒకవేళ దాడిచేస్తే అది మహా వినాశకరంగా ఉంటుందని హెచ్చరించారు. ఆ ఇంటర్వ్యూలో లోవరోవ్ మాట్లాడుతూ, ఉక్రేన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న కృషిపై ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికా నవీకరించిన జాతీయ భద్రతా వ్యూహం రష్యాతో జరుగుతున్న చర్చలకు ఏ మాత్రం భిన్నంగా లేదని, కానీ అమెరికా తీసుకునే చర్యలను ఫలితాల ఆధారంగా తమ దేశం అంచనావేస్తుందని చెప్పారు. కానీ ట్రంప్ చేస్తున్న కృషికి యూరప్ దేశాలు అడ్డుపడుతున్నాయని మండిపడ్డారు. అమెరికాతో కలిసి తాము పనిచేస్తామని అన్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్ దురాక్రమణ చర్యలను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. పశ్చిమ ఆసియాలో యూరప్‌దేశాలు ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తున్నాయని విమర్శించారు.
"ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారానికి అమెరికా అనేక ప్రయత్నాలు చేస్తోంది, కానీ ఇప్పటివరకూ శాంతికి చేరువయ్యే మార్గం రాలేదు, ఆ అడ్డంకులకు కారణం ఎవరు? అనేక అవినీతి కుంభకోణాల్లో చిక్కుకున్న జెలెన్స్కీ తన ధనాన్ని ఎలా ఉపయోగిస్తున్నారో చివరకు పశ్చిమ దేశాలు అర్థం చేసుకుంటాయా?" అని ఆయన ప్రశ్నించారు.



## అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా తట్టెడు మట్టి తీయలేదు

### టిఆర్ఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టెడు మట్టికూడా తీయలేదని, అనవసర శపథాలు మాని ఆరుగ్యారంటీల అమలుపై శ్రద్ధ పెట్టాలని టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని జిల్లా టిఆర్ఎస్‌భవన్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నాగర్‌కర్నూల్ అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గాలనుంచి గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులకు నిర్వహించిన సన్మాన సభకు కెటిఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతబిడ్డ అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన గత ప్రభుత్వంలో 90శాతం పనులు పూర్తి చేసిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయలేదని, కనీసం రెండేళ్లలో తట్టెడు మట్టి కూడా తీయలేదని ఆరోపించారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి మున్సిపాలిటి ఎన్నికలలో ఇలాగే పని చేసి అధికస్థానాలు సాధించాలన్నారు. 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కెసిఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.
**పార్టీని కించపరిస్తే అడ్రస్‌లేని బ్రతుకులే :**
పదవులు అనుభవించి పార్టీనుంచి బయటకు వెళ్లి పార్టీ అధినేతను పార్టీని కించపరిస్తే అడ్రస్‌లేని బతుకులే అవుతాయని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యేగువ్వలబాల్‌రాజును ఉద్దేశించి కెటిఆర్ ఆరోపణ చేశారు. గత సర్పంచ్ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఆయన గెలిపించుకున్న సర్పంచులు ఎంతమంది అంటే ఇద్దరే అని స్థానికులు తెలిపారన్నారు. మొదటగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ఆయా నియోజకవర్గాల నుండి గులాబీశ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు.

## విద్యతో పాటు శారీరక వికాసానికి సమ ప్రాధాన్యత

### శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శ్రీచైతన్య విద్యా సంస్థ విద్యతో పాటు శారీరక వికాసానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన అన్నారు. ఆదివారం మియాపూర్ శ్రీచైతన్య క్యాంపస్, కళ్యాణ్ గార్డెన్స్‌లో శ్రీచైతన్య ఉద్యోగుల స్పోర్ట్స్ ఉత్సవ్ – 2025 ముగింపు వేడుకలుఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సుష్మ బొప్పన, డైరెక్టర్లు శ్రీధర్, టి.నాగేంద్ర కుమార్ హాజరై విజేతలను అభినందిస్తూ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సుష్మ బొప్పన మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, ఓర్పు జీవితంలో అత్యవసరమైన విలువలను విద్యార్థులు నేర్చుకుంటారన్నారు, ఇందుకు స్ఫూర్తిగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఈ క్రీడా పోటీలను నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల మానసిక, శారీరకాభివృద్ధికి అత్యుత్తమ వాతావరణాన్ని అందించేందుకు శ్రీచైతన్య ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆమె వివరించారు. విద్యార్థులు విద్యలోనూ, క్రీడల్లోనూ, జీవితంలోనూ విజేతలుగా ఎదగాలనే ప్రేరణతో ముందుకు సాగాలని ఆమె కోరారు.

## ఏదీ వైద్యం? (మొదటి పేజీ తరువాయి)

పాటించడం లేదని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.... మరీ ముఖ్యంగా వనస్థలిపురం వెల్‌నెస్ సెంటర్‌లో పరిస్థితి దారుణంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సేవల నిమిత్తం ఈ సెంటర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు నగర శివారు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వస్తుంటారు. పరీక్షలు నిమిత్తం ఉదయం 7 గంటల లోపే వెల్‌నెస్ సెంటర్లకు పరుగు పరుగున వస్తున్నారు. పరీక్షలు నిర్వహించే సిబ్బంది అటు ఇటుగా సకాలంలోనే అందుబాటులో ఉంటున్నప్పటికీ మందులు ఇతర సేవలకు సంబంధించి 9 గంటల వరకే విధుల్లో ఉండాల్సిన సిబ్బంది మాత్రం సకాలంలో రావడం లేదు. 9 గంటలకు వైద్యులు మందులు రాసినా ఒక్కోకసారి 10.30 గంటలు దాటినా మందులు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన సిబ్బంది సైతం రోగులను పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఈ పరిస్థితిని సెంటర్ ఇన్‌చార్జికైనా విన్నవించుకుందామని ఫోన్ చేసినా స్పందించని పరిస్థితి ఉందని బాధను వ్యక్తం చేస్తున్నారు.
**అధికారులు దృష్టి సారించాలి :**
వెల్‌నెస్ సెంటర్ల పనితీరుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా మందులన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు వచ్చే ఈ సెంటర్ల పనితీరు ఈ విధంగా ఉంటే, మిగిలిన ఆసుపత్రుల్లో పరిస్థితి ఏమిటాని ప్రశ్నిస్తున్నారు. వెంటనే వైద్యాధికారులు కాని ఆరోగ్య శాఖ మంత్రి గాని దృష్టి సారించకపోతే ప్రభుత్వం చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

## ప్రజాస్వామ్యం సజీవం
(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలనుకుంటున్నానన్నారు. మా బలం తక్కువగా ఉండవచ్చు, కానీ వెన్నెముక ఇంకా నిటారుగానే ఉందని, తాము రాజ్యాంగంతో, లౌకికవాదంతో, పేదల హక్కులతో ఎప్పుడూ రాజీపడలేదని స్పష్టం చేశారు. తాము అధికారంలో లేకపోవచ్చు, కానీ ఎప్పుడూ బేరసారాలు చేయమన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ మతం పేరుతో ఓట్లు అడగలేదని, ఆలయాలు, మసీదుల పేరుతో పార్టీ ఎప్పుడూ విద్వేషాన్ని వ్యాపింపజేయలేదని ఖర్గే ఉద్ఘాటించారు. 'కాంగ్రెస్ ఏకం చేస్తుంది. బిజెపి విభజిస్తుంది. కాంగ్రెస్ మతాన్ని కేవలం విశ్వాసంగా మాత్రమే ఉంచింది. కానీ కొందరు మతాన్ని రాజకీయంగా మార్చారు. ఈ రోజు బిజెపికి అధికారం ఉంది, కానీ వారి వద్ద సత్యం లేదు. అందుకే, కొన్నిసార్లు డేటాను దాచిపెడతారు, కొన్నిసార్లు జనాభా లెక్కలను ఆపేస్తారు, కొన్నిసార్లు రాజ్యాంగాన్ని మార్చాలనే చర్చలు జరుగుతాయి' అని ఖర్గే మండిపడ్డారు. ఈ రోజు చరిత్ర గురించి ప్రసంగాలు చేస్తున్న వారి పూర్వీకులు చరిత్ర నుండి పారిపోయారని ఆరోపించారు. మహాత్మా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడైన శతాబ్ది సంవత్సరం, రాజ్యాంగాన్ని ఆమోదించిన 75వ సంవత్సరం, వందేమాతరం 150వ వార్షికోత్సవం 2025వ సంవత్సరమని ఖర్గే అన్నారు. 2026వ సంవత్సరం దాదా భాయ్ నౌరోజీ 200వ వార్షికోత్సవం, సరోజినీ నాయుడు కాంగ్రెస్ అధ్యక్షురాలైన శతాబ్ది సంవత్సరం, డిసెంబర్ 1925లో కాన్పూర్ కాంగ్రెస్ సమావేశంలో మొదటిసారిగా పాడిన 'ఝండా ఊంచా రహే హమారా' గీతం శతాబ్ది సంవత్సరం అని ఆయన అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం సమయంలో అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందాయని పేర్కొంటూ, కొన్ని దేశాలు విఫలమయ్యాయని, మరికొన్నింటిలో నియంతృత్వం ప్రబలిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎత్తి చూపారు. 'భారత జాతీయ కాంగ్రెస్‌ది 140 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర సత్యం, అహింస, త్యాగం, పోరాటం, దేశభక్తి గొప్ప గాథను వివరిస్తుంది' అని కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతి భారతీయుడికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్, అజయ్ మాకెన్‌తో సహా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు శశి థరూర్, దిగ్విజయ్ సింగ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు, అయితే ప్రియాంక గాంధీ వాద్రా ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.
**కాంగ్రెస్ రాజకీయ పార్టీయే కాదు...**
**భారత ఆత్మస్వరం : రాహుల్**
రాహుల్ గాంధీ మాట్లాడుతూ, కాంగ్రెస్ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, ప్రతి బలహీనమైన, అణగారిన, కష్టపడి పనిచేసే వ్యక్తికి అండగా నిలిచిన భారతదేశ ఆత్మ స్వరమని అన్నారు. 'సత్యం, ధైర్యం కోసం పోరాటంలో మరింత బలంగా పోరాడటం, ద్వేషం, అన్యాయం, నియంతృత్వానికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని రక్షించడం అనేది సంకల్పం' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. 'భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతి కాంగ్రెస్ సభ్యునికి హృదయపూర్వక శుభాకాంక్షలు. ఆ చారిత్రక వారసత్వానికి, భారతదేశానికి స్వేచ్ఛను గెలుచుకున్న, రాజ్యాంగానికి పునాది వేసిన, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వ విలువలను బలోపేతం చేసిన ఆ గొప్ప త్యాగాలకు నివాళులర్పిస్తున్నాము' అని ఆయన అన్నారు.

## 15 రోజులు నిర్వహించాలి
(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తాము అన్ని అంశాలపై చర్చించేందుకు సమాయత్తమయ్యామని, కానీ తాము ప్రస్తావించే ప్రజా సమస్యలపైన కూడా సభలో చర్చకు అవకాశాన్ని కల్పించాలన్నారు. రెండేళ్లవుతున్నప్పటిటీ అసెంబ్లీ హౌస్ కమిటీలను ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని, ఇందుకు స్పీకర్ వద్ద లోపం ఉందా ? లేదా శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు వద్ద లోపం ఉందా అని ప్రశ్నించారు. ఎస్టిమేట్ కమిటీ చైర్మన్‌గా ఉత్తమ్ పద్మావతి రెడ్డిని నియమిస్తే ఆమె వెంటనే రాజీనామా చేశారన్నారు. అన్ని వ్యవస్థలతో పాటు శాసనసభను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, రూ.5లక్షల కోట్ల హిల్ట్ పాలసీ కుంభకోణం, జాబ్ క్యాలెండర్, గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ తదితర అంశాలపైన కూడా సభలో చర్చించాలని సూచించారు. నీటి పారుదల ప్రాజెక్ట్ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు అవకాశం కల్పిస్తే, ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు కూడా అవకాశాన్ని కల్పించాలని హరీశ్ రావు కోరారు. తమ పదేళ్ల పాలనలో ఏడాదికి సగటున 45 రోజుల చొప్పున శాసనసభ సమావేశాలను నిర్వహిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఏడాదికి 20 రోజులకు కుదించిందని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ ఇచ్చిన ఒక్క అంశంపైన కూడా చర్చ పెట్టకపోతే ఇక అసెంబ్లీ సమావేశాలను నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు టిఎంసిలను 90 నుంచి 45 టిఎంసిలకు కుదించారని, కేంద్రం నుంచి డిపిఆర్ వెనక్కి వచ్చి ఏడాది పూర్తవుతున్నప్పటికీ, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని, దీనిపైన మంత్రి ఉత్తమ్ కమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## నేడు అసెంబ్లీ
(మొదటి పేజీ తరువాయి)

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ అంశంపై జరిగే చర్చలో మాత్రం బిఆర్ఎస్ తరపున మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాత్రమే పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. కెసిఆర్ కేవలం సమావేశాలకు హాజరవుతారనే ప్రచారం జరుగుతోంది.
**అడిగిన సమాచారాన్ని అందించండి**
శాసన మండలి,శాసనసభ సమావేశాలు సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. సభ్యులు(ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలు) అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్న సమయంలో సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో ఉండి, సభ్యులకు తగిన సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభ కానున్న నేపథ్యంలో సభ నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,శాసనమండలి కార్యదర్శి వి. నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఆయన తరపున ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, అదనపు డిజిపి విజయకుమార్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు విసి సజ్జనార్, అవినాష్ మహంతి, సుధీర్ బాబు, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, శాసనసభ చీఫ్ మార్షల్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని, అవసరమైన నోడల్ అధికారులను , లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలన్నారు. పెండింగ్ లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలని ఆదేశించారు. సమావేశాలు జరుగుతున్న సమయంలో చలో అసెంబ్లీ కార్యక్రమాలు నిర్వహించకుండా చూడాలని, సమావేశాలకు హాజరయ్యే మంత్రులు, ఎంఎల్‌ఎలు,ఎంఎల్‌సిలకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ శాసనసభ, శాసనమండలి సమావేశాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు లేకుండా ముందస్తుగానే అడ్డుకుంటే, సమావేశాలు సజావుగా జరుగుతాయని సూచించారు.

## జలాంతర్గామిలో రాష్ట్రపతి
(మొదటి పేజీ తరువాయి)

జలాంతర్గామి అయిన ఐఎన్ఎస్ వాఘ్షీర్ జనవరిలో నేవీలోకి ప్రవేశించింది. నేవీ అధికారుల ప్రకారం.. ఇది ప్రపంచంలోనే అత్యంత నిశ్శబ్ధ, బహుముఖ డీజిల్ ఎలక్ట్రిక్ జలాంతర్గాములలో ఒకటి. ఇది ఉపరితల వ్యతిరేక యుద్ధం, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధం, నిఘా సేకరణ, నిఘా, ప్రత్యేక కార్యకలాపాలు సహా విస్తృత శ్రేణి మిషన్లను చేపట్టడానికి రూపొందించబడింది. వైర్ గైడెడ్ టార్పెడోలు, యాంటీషిష్ మిస్సైల్స్, అధునాతన సోనార్ వ్యవస్థలతో కూడిన ఈ జలాంతర్గామి, ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ (ఎఐపి) టెక్నాలజీని ఏకీకృతం చేయడం వంటి భవిష్యత్ అప్‌గ్రేడ్‌లకు అనుమతించే మాడ్యులరర్ నిర్మాణాన్ని కూడా కలిగి ఉంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో దీర్ఘకాలిక భద్రతా ప్రయోజనాలను పరిగణనలోనికి తీసుకుని భారత నావికాదళం కార్వార్ స్థావరాన్ని అభివృద్ధి చేస్తోంది.

## సిఇఒ అరెస్ట్ (మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించిందని నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ ఇటీవల నివేదికలో పేర్కొన్నది. ఈ కేసులో బాధ్యులను గుర్తించికపోవడం పట్ల గత నెలలో హైకోర్టు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బస్సు డ్రైవర్‌పై అక్రమ కేసు ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆసిఫాబాద్ డిపో లహరి బస్సు డ్రైవర్ రామరావుపై నాన్ బెయిలబుల్ సెక్షన్లతో అక్రమ కేసు పెట్టి రిమాండ్‌కు పంపిన రెబ్బెన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి జెఎసి డిమాండ్ చేసింది. డ్రైవర్‌ది తప్పు లేకపోయినా అన్యాయంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం దుర్మార్గమని పేర్కొంది. లహరి బస్సు హైదరాబాద్ నుండి ఆసిఫాబాద్ వెళ్లుతున్న క్రమంలో రెబ్బెన పోలీస్‌స్టేషన్ సమీపంలో డ్రైవర్ బస్సును ఎడమ వైపు రోడ్డు ప్రక్కన పూర్తి సైడ్‌లో ఇండికేటర్ లైట్స్ వేసి నిలిపి ఉంచారన్నారు. అయితే వేగంగా వచ్చిన ఓ బొలెరో వాహనం బస్సు వెనుక ఎడమ భాగంలో ఢీ కొట్టడం, డ్రైవర్ తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించాడన్నారు. అయితే ఈ ఘటనలో డ్రైవర్‌ది ఎలాంటి తప్పు లేదని ఫోటోలో స్పష్టంగా కనిపిస్తున్నప్పటికి, పోలీసులు అక్రమంగా నాన్ బెయిల్‌బుల్ కేసు పెట్టి రిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం గాంధీ భవన్‌లో ఘనంగా జరిగాయి. టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా



మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ పతాకాన్ని ఎగురవేసి భారత ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లబాయ్ పటేల్, ఇందిరాగాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అనేక మంది మహనీయుల సంకల్పంతో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ నిర్మాణంలో ఎనలేని పాత్రను పోషించిందని తెలిపారు. నెహ్రూ ప్రధాని కాకుండా ఉంది ఉంటే ఈ దేశం ఏమయ్యేదో ఊహించలేమన్నారు. గుండు సూది తయారు చెయ్యలేని స్థితి నుంచి రాకెట్ ప్రయోగాల వరకు ఎదిగింది అంటే నాడు నెహ్రూ వేసిన పునాదులు కారణమని తెలిపారు. ఇందిరాగాంధీ దేశం సామాన్యుల చేతికి రావాలని బ్యాంకుల జాతీయాకరణ చేయగా, రాజీవ్ గాంధీ సాంకేతికను దేశానికి పరిచయం చేశారని, పివి నరసింహారావు తన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని మరోస్థాయికి తీసుకెళ్లారని కొనియడారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సరైన ఫలాలు అందాలన్న ఉద్దేశ్యంతోనే కుల సర్వే చేపట్టామని, తద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చెయ్యాలని చూస్తే బిజెపి అడ్డం పడగా బిఆర్ఎస్ వంత పడుతోందని అన్నారు. మాజీ మంత్రి పి.జనార్ధన్‌రెడ్డి వర్థంతి సందర్భంగా గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు.

## ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప ప్రజానేత పిజెఆర్

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.జనార్ధన్ రెడ్డి (పిజెఆర్) 18వ వర్ధంతి సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ చౌరస్తాలోని పిజె



ఆర్ విగ్రహానికి టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేశ్‌కుమార్ గౌడ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, మహ్మద్ అజారుద్దీన్, కార్పొరేటర్ విజయరెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పిజెఆర్ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప ప్రజానేత అని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన పిజెఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చుతూ కృష్ణ, గోదావరి జలాలు తరలించడంలో పిజెఆర్ కృషి ఎనలేనిదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కార్మిక నాయకుడిగా పిజెఆర్ ఎనలేని సేవ చేశారని కొనియడారు. మహమ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ తాను అనేక నియోజకవర్గాల్లో పని చేసినప్పటికీ, జూబ్లీహిల్స్‌లో పిజెఆర్‌కు లభించిన గౌరవం, అభిమానం, ప్రజల ఆదరణ విశేషమైనదని అన్నారు. ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న అంకితభావం, విలువల ద్వారా పిజెఆర్ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ జీవిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాస్వామికవాది యోధుడు కామ్రేడ్ వి.ఎల్.నర్సింహారెడ్డి

సంస్మరణ సభలో కొనియాడిన పశ్య పద్మ

**కామారెడ్డి :** సిపిఐ నాయకులు, ప్రజాస్వామికవాది, కార్మిక, కర్షక, పీడిత ప్రజల హక్కుల యోధుడు కామ్రేడ్ వి.ఎల్.నర్సింహారెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య




పద్మ అన్నారు. నర్సింహారెడ్డి సంస్మరణ సభ ఆదివారం మధ్యాహ్నం కామారెడ్డిలోని గవర్నమెంట్ హైస్కూల్ రోడ్‌లో పాత జిఎస్ఆర్ కాలేజీ జరిగింది. కార్యక్రమంలో అన్ని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై అతనితో వారికి ఉన్న అనుబంధం, ప్రజల, కార్మికుల పట్ల ఉన్న అంకితభావాన్ని మననం చేసుకొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంస్మరణ సభకు పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వి.ఎల్. నర్సింహారెడ్డి కామారెడ్డి లో మున్సిపల్, ఆర్‌టిసి, హమాలీ, హాస్పిటల్ తదితర కార్మిక పోరాటాలు నడిపి ఎన్నో హక్కులు సాధించడానికి నిరంతరం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఉద్యమకాలంలో అనేక మందికి బెయిల్ ఇప్పించి పేదల వకీల్‌గా పేరు ప్రఖ్యాతులు పొందిన వ్యక్తి అని అన్నారు. ఈ సభకు న్యాయవాదులు వేణుగోపాల్, సిద్దిరాములు, వెంకట్రాంరెడ్డి, నవీన్, మున్సిపల్ సంఘ నాయకులు లక్ష్మణ్, నర్సింగరావు, సిపిఐ జిల్లా నాయకులు దశరథ్, బాలరాజ్, బిఎల్ఎఫ్ నాయకులు సిద్దిరాములు, లెక్చరర్ శంకర్, ఆర్టీసీ నాయకులు వెంకటి గౌడ్, వి. డి దాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు న్యాయం జరగాలి

టిజిపిడబ్ల్యుయు స్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డెలివరీ కార్మికులు ఈ నెల 25న దేశవ్యాప్తంగా చేసిన ఫ్లాష్ స్ట్రైక్‌తో గణనీయంగా డెలివరీలు నిలిచిపోయాయని, డిసెంబరు 31న చేపట్టే స్ట్రైక్ మరింత భారీ ప్రభావం చూపనుందని తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) స్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోని ప్లాట్‌ఫాం కంపెనీలను నియంత్రించడంతో పాటు న్యాయమైన వేతనాలు, భద్రత, సామాజిక రక్షణను అమలు చేసేలా చూడాలని కోరారు. స్ట్రైక్ తరువాత స్విగ్గి షేర్ ధర 2 శాతం వరకు పడిపోయిందని తెలిపారు.

## పుస్తక ప్రియుల కోసం సొసైటీ కృషి అభినందనీయం






బుక్ ఫెయిర్‌లో పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్‌టిఆర్ స్టేడియం(కళాభారతి)లో ఏర్పాటు చేసిన 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను నవ చేతన విజ్ఞాన సమితి ఛైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఆదివారం సందర్శించారు. బుక్ ఫెయిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు సందర్శించి, పలువురు యువ రచయితలతో కాసేపు సంభాషించారు. అనంతరం బుక్ ఫెయిర్ లోని నవచేతన పబ్లిషింగ్ హౌస్(విశాలాంధ్ర) స్టాల్‌ను పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం సందర్శించారు. ఈ సందర్భంగా పుస్తకాల ప్రదర్శన, ప్రజల ఆసక్తి, యువ తరం స్పందన తదితర వివరాలను హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోశాధికారి, నవచేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ నారాయణరెడ్డి, భరత్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. పుస్తక ప్రియులకు కోసం హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమని పల్లా వెంకటరెడ్డి ప్రశంసించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి, నెల్లికంటి సత్యంను సొసైటీ అధ్యక్షులు కవి యాకూబ్, కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి సత్కరించారు.

## టెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపు లోపభూయిష్టం :ఎ.వి.సుధాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నిర్వహించనున్న టెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపు లోపభూయిష్టంగా ఉందని ఎస్‌టియుటియస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎ.వి.సుధాకర్ అన్నారు. పరీక్ష కేంద్రాలను సుదూర ప్రాంతాల్లో కేటాయించడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదరుకానున్నాయని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మెజారిటీ ఉపాధ్యాయులకు ఖమ్మం, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించడం వల్ల వారు వ్యయప్రయాసలకు గురవుతారని అన్నారు. జనవరి 3 నుంచి 20 వరకు కంప్యూటర్ బేస్ట్ విధానంలో రోజుకు రెండు సెషన్లలో జరగనున్న టెట్ పరీక్షలకు ఈసారి 70వేలకు పైగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు హాజరవుతున్నారని అన్నారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని తక్షణమే సమీప జిల్లాల్లోనే పరీక్ష కేంద్రాలు కేటాయించేలా పాఠశాల విద్యాశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా పరీక్షలు రాసే ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని సుధాకర్ డిమాండ్ చేశారు.

## పథకాలు బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం

మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు, పథకాలు తీసుకువస్తే వాటిని బిజెపి ప్రభుత్వం నీరు గార్చుతూ పేదలకు అన్యాయం చేస్తోందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి, అజారుద్దీన్‌లు విమర్శించారు. ఆదివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ తీర్మానం చేయాలి కొత్త సర్పంచ్‌లు మొదటి గ్రామ సభలో తీర్మానం చేయాలని కోరారు. 2004లో సోనియా గాంధీ నేతృత్వంలో యుపిఎ ప్రభుత్వం ఆనాడు అనేక మంది మేధావులతో సంప్రదించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ పెంచడానికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిరన్నారు. తద్వారా పనిలేని రోజుల నుండి పని కల్పించి ప్రజల ఆర్థిక వ్యవస్థ రూపు మారిందని చెప్పారు. 2014 ఎన్నికల ఎజెండాలో బిజెపి గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా పట్టణ ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పిన పార్టీ ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపాధి హామీ పథకం బిల్లు మార్పులను ఉపసంహారించుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి ఉన్న మహాత్మా గాంధీ పేరు తొలగించడం కుట్ర పూరితమైన నిర్ణయమని అన్నారు. రాష్ట్రాన్ని చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి కేంద్రం మన రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదని ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని పెంచడం లేదని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి 90 శాతం నిధులు కేంద్రమే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ ప్రపంచం అంత గాంధీ సేవలను కొనియాడుతుంటే బిజెపికి మాత్రం ఆయన పేరే నచ్చడం లేదన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు రోహిన్ రెడ్డి, సంగిశెట్టి జగదీష్, చరణ్ కౌశిక్, నిజముద్దీన్ పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడుతున్నాం

- డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు
- బస్ పాస్‌లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికీ వర్తింపచేయిస్తాం
- మీడియా అకాడమీ ఛైర్మన్‌పై విమర్శలు తగదు
- తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 70 ఏళ్లుగా పాటుపడుతున్న తమ సంఘం డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బస్ పాస్‌లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేందుకు తాము ప్రభుత్వంతో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షుడు



విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టులను తాము వేరుగా చూడడం లేదని, వారికి కూడా బస్ పాస్‌లతో సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని తప్పకుండా వర్తింప చేయిస్తామని అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని యూనియన్ కార్యాలయంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర ముఖ్యుల సమావేశం జరిగింది. అనంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, రాష్ట్ర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విరాహత్ అలీ మాట్లాడారు.

**డెస్క్ జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు..**

గత 10 ఏళ్ల కాలంలో డెస్క్ జర్నలిస్టులకు కొంతమందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారని, కానీ ఇప్పుడు తాము డెస్క్‌లో పనిచేసే జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామని విరాహత్ అలీ అన్నారు. ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తామన్నారు. నానాటికీ జర్నలిజంలో అడుగంటుతున్న విలువలను పెంపొందించేందుకే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 252 జి.ఓను తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఉనికి చాటుకోవడానికి కొన్ని సంఘాలు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెట్టడంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. అబద్దాలు, కల్పితాలతో వాళ్ళు చేస్తున్న అపోహలు నమ్మవద్దని ఆయన జర్నలిస్టులను కోరారు.

**ఎవరు చెప్పారు? కార్డులు తగ్గుతున్నాయని..**

252 జి.ఓతో 13వేల అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతున్నట్లు ఆందోళన చేస్తున్న సంఘానికి ఎవరు చెప్పారని ఆయన ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా చేయడమే టియుడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం అన్నారు. 1996 సంవత్సరానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 3 వేల అక్రిడిటేషన్ కార్డులు మాత్రమే ఉండేవని, అప్పటి తమ సంఘం ప్రభుత్వంతో కొట్లాడి గ్రామీణ విలేకరులందరికీ మండలాల వారీగా అక్రిడిటేషన్లు ఇప్పించిన ఘనమైన చరిత్ర తమదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 3వేల అక్రిడిటేషన్‌లను 12 వేలకు పెంచిన ఘనత తమ సంఘానిదేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 23 వేల అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చామని గొప్పలు చెబుకుంటున్న మిత్రులు, పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అదే సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారన్న విషయాన్ని మర్చిపోతున్నారని గుర్తు చేశారు.

**మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదు..**

252 జి.ఓ తెచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ ఆధ్వర్యంలో ఏడుగురు ప్రముఖులైన పాత్రికేయులతో కమిటీ ఏర్పాటై, ఐదారుసార్లు సమావేశమై మార్గదర్శకాలు రూపొందించిన విషయం గగ్గోలు చేస్తున్న మిత్రులకు తెలియదా? అని విరాహత్ ప్రశ్నించారు. సమాచార శాఖ కమిషనర్‌తో పాటు ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కె.శ్రీనివాస్, ది హిందూ పత్రిక పొలిటికల్ ఎడిటర్ రవికాంత్ రెడ్డి, వి6 వెలుగు పత్రిక సిఈఓ అంకం రవి, సియాసత్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నాయకుడు కె.ఎన్.హరి తదితరులతో వేసిన కమిటీ రూపొందించిన నిబంధనల మేరకే 252 జి.ఓ వచ్చిందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ సూచనల మేరకు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నియమ నిబంధనలు రూపొందించేందుకు సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సూచించిన సిఫార్సులను అప్పటి మీడియా అకాడమీ చైర్మన్ ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రామచంద్ర మూర్తి కమిటీ సిఫార్సులకు భిన్నంగా తీసుకువచ్చిన 239 జి.ఓతో జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే అప్పటి మీడియా అకాడమీ చైర్మన్, ఆయన సంఘం ఎందుకు నోరెత్తలేదన్నారు. ఆ జి.ఓతో చిన్న మధ్య తరహా పత్రికలకు, ఉర్దూ పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దాదాపు 4500 అక్రిడిటేషన్ కార్డులు తొగించబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో, తెలంగాణకు చెందిన యాజమాన్యాలు స్థాపించిన రెండు ప్రధాన పత్రికలకు అక్రిడిటేషన్‌లను అడ్డుకున్నది ప్రస్తుతం ఆందోళన చేస్తున్న సంఘమేనని విరాహత్ ఆరోపించారు. ఆ విషయంలో ప్రెస్ కౌన్సిల్‌ను ఆశ్రయించి, ఆ పత్రికలకు న్యాయం చేసిన ఘనత తమ సంఘానిదే అని ఆయన గుర్తు చేశారు.

**జర్నలిస్టులందరికీ ప్రయోజనాలు చేకూర్చేందుకు కార్యాచరణ..**

అక్రిడిటేషన్ కార్డులతో రిపోర్టర్‌లకు, డెస్క్ జర్నలిస్టులకు ఇంతకాలం ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, కనీసం ఇప్పుడైనా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, అక్రిడిటేషన్, మీడియా కార్డులు పొందే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రయోజనాలు చేకూర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 252 జిఓలో ఉన్న కొన్ని లోటుపాట్లను తాము గుర్తించామని, వాటిని సవరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఏది ఏమైనా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, మీడియా కార్డులు అందించేందుకు తమ సంఘం తీవ్రంగా కృషి చేస్తుందన్నారు.

**జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారి చేతుల్లో 3 వేల కార్డులు !**

గతంలో రాష్ట్రంలో జారీచేసిన దాదాపు 3 వేల అక్రిడిటేషన్ కార్డులు జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారి చేతుల్లో ఉన్నట్లు తమ సంఘానికి అందిన ఫిర్యాదుల్లో తేలిందన్నారు. అడ్డదారుల్లో అక్రిడిటేషన్‌లు పొందిన వారే జర్నలిస్టులుగా చలామణి అవుతూ, ఇసుక వ్యాపారులను, రైస్ మిల్లర్లను, బిల్డర్లను, ఇతర వ్యాపారులను బెదిరిస్తూ పోలీసులకు చిక్కారని, వారిపై కేసులు నమోదు కావడం జర్నలిజం విలువలను మంటగలిపిందన్నారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందంటూ ఆందోళనకు దిగిన ఆ సంఘం రాష్ట్ర కీలక నాయకుని కుటుంబ సభ్యులు నలుగురు మీడియా ఏజెన్సీ పేరుతో అక్రిడిటేషన్ కార్డులు పొందారని, అదే సంఘానికి చెందిన మరో రాష్ట్ర నాయకుని కుమారుడు యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఓ గ్రామ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ, అతనికి జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డు ఇవ్వడంపై తమ సంఘం ఆందోళన చేసి ఆ కార్డును రద్దు చేయించిన విషయాన్ని విరాహత్ అలీ గుర్తు చేశారు.

**ఆస్తిత్వం కోసం దుష్ప్రచారం : రాంనారాయణ**

యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ సంఘం సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు రెండు వేల మంది జర్నలిస్టులతో నిర్వహించిన మహా ధర్నాతో ప్రభుత్వం దిగివచ్చి యుద్ధప్రాతిపదికన జి.ఓ జారీ చేసిందన్నారు. అయితే ఆస్తిత్వం కోసం, ఉనికిని చాటుకోవడానికి ఒక సంఘం తమ సంఘ జాతీయ నాయకుడిపై దుష్ప్రచారం చేస్తూ అలజడి సృష్టించడం సహించరానిదన్నారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు, ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, కార్యదర్శులు కె.శ్రీకాంత్ రెడ్డి, వరకాల యాదగిరి, జి.మధు గౌడ్, కోశాధికారి ఎం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రాజేష్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతుకు అరుణాంజలి



పుల్లెంల గ్రామంలో ముగిసిన మావోయిస్టు నేత అంత్యక్రియలు
పాల్గొన్న పౌర హక్కుల సంఘం, విరసం, అమరుల బంధు మిత్రుల సంఘం నేతలు



**ప్రజాపక్షం/చండూరు :** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి పాక హనుమంతు అలియాస్ ఉయితే గణేష్ అంత్యక్రియలు నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో ఆదివారం ముగిశాయి. ఆదివారం ఉదయం 11 గంటలకు పుల్లెంల గ్రామానికి చేరుకున్న పాక హనుమంతు పార్థీవదేహాన్ని గ్రామ ప్రజలు, అభిమానులు, మావోయిస్టు మాజీ నేతలు వామ పక్ష పార్టీల నేతలతో భారీ ర్యాలీతో హనుమంతు తల్లిదండ్రులు నివాసం ఉన్న ఇంటికి తీసుకెళ్లారు. విప్లవ యోధుడికి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుండి ఖననం చేసే వరకు భారీగా తరలివచ్చిన జనసంద్రోహం మధ్య పాక హనుమంతు అంత్యక్రియలు జరిగాయి. పాక హనుమంతు అంత్యక్రియలకు పుల్లెంల గ్రామం మొత్తం జనాలతో కిక్కిరిసిపోయింది. పాక హనుమంతు అంత్యక్రియల్లో పాల్గొనుటకు పౌర హక్కుల సంఘం నేతలు, విరసం నేతలు, అమర వీరుల బంధు మిత్రులు సంఘం నేతలు, మాజీ మావోయిస్టు నేతలు, వామపక్ష నేతలు భారీగా తరలివచ్చి హనుమంతు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ చేపడుతున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లపై న్యాయ విచారణ చేయాలని, కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు మఫ్టిలో ఉంటూ అడుగడుగునా నిఘా ఉంచారు. అంత్యక్రియలు ముగిసే వరకు జననాట్యమండలి, ప్రజా సంఘాల ఆటలు ఆటలు, దప్పుచప్పులతో మారుమోగింది. పార్థీవదేహానికి నిప్పు అంటించే వరకు ప్రజలు అక్కడే ఉండి అరుణాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, టిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్, శాంతి సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లా యాదయ్య, హైదరాబాద్ సిపిఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తిర్పారి వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య, భారత న్యాయవ్యాదుల సంఘం నాయకులు గుర్రం వెంకట్ రెడ్డి, చెరుకు సుధాకర్ గౌడ్, అనురాధ, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ రావు, కార్యదర్శి నారాయణ, అమరుల బంధు మిత్రుల సంఘం నాయకులు పద్మ కుమారి, భవాని, అంజమ్మ, విరసం నేతలు పాణి, రివేరా, జననాట్య మండలి సంధ్య, వేముల పుష్మా, పుల్లెంల సర్పంచ్ ముక్కాముల వెంకన్న, పాక హనుమంతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు మృతి



ప్రజాపక్షం/అర్వపల్లి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాయ యోధుడు సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు నల్లు శేఖర్ రెడ్డి మృతి చెందారు. ఆయన మల్లు స్వరాజ్యంతో కలిసి ఉద్యమంలో పనిచేశారు. కాసర్లపాడు గ్రామ సర్పంచ్‌గా పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు. సిపిఎం నాయకులు మల్లు నాగార్జున్ రెడ్డి, కొలిశెట్టి యాదగిరిరావులు హైదరాబాదులో ఆయన మృతదేహంపై అరుణ పథకం కప్పి పూలమాలతో జోహార్లు అర్పించారు. శేఖర్ రెడ్డి మృతదేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధన నిమిత్తం బీబీనగర్ ఎమ్స్ కళాశాలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ఉప్పు సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ముసబ్ అహ్మద్ గారికి గ్రేడ్1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. నల్లగొండ మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేస్తూ పట్టణాభివృద్ధి,పారిశుధ్యం,మౌలిక వసతుల మెరుగుదల,ప్రజలకు మెరుగైన సేవల అందజేతలో ఆయన విశేష సేవలు అందించారు.అయన పనితీరు,పరిపాలనా సామర్థ్యం,నిబద్ధతను గుర్తించి ప్రభుత్వం ఈ పదోన్నతిని కల్పించడం అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు,అధికారులు,మున్సిపల్ సిబ్బంది ప్రశంసించారు.ఈ సందర్భంగా సయ్యద్ ముసబ్ అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు.



## మౌలిక వసతుల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

### ఆర్ అండ్ బి రోడ్డును ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం కేంద్రంలో వలిగొండ నుండి సుంకిశాల మీదగా కాటేపల్లి వరకు 49.50 కోట్ల రూపాయలతో నిర్మించనున్న నూతన డబుల్ రోడ్డు పనులను రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం ప్రారంభించారు. భువనగిరి, చిట్యాల రోడ్డు 180 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోలేదు ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రజలకు అన్ని విధాలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ రహదారి ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఆ దిశగా ఈ రహదారి కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. నాణ్యమైన రహదారులు సమగ్ర అభివృద్ధి అనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని, ప్రతి గ్రామం అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎన్నారై పైళ్ళ మల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యతనిస్తాం : వేణారెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : స్థానిక సంస్థల ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ జిల్లా కమిటితోపాటు నియోజక వర్గ, మండల కమిటిలను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచనల మేరకు శక్తి వంచన లేకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తామన్నారు. అనంతరం ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచులుగా, ఉపసర్పంచులుగా, వార్డు సభ్యులుగా విజయం సాధించిన యూత్ కాంగ్రెస్ నాయకులను సమావేశానికి ముఖ్యఅతిధులుగా హాజరైన యూత్ కాంగ్రెస్ జిల్లా ఇంచార్జిలు వెలిమినేటి సురేష్, రమ్యకృష్ణ, సునీల్‌లతో కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము జవహర్, శ్రావ్య సుధీర్‌రెడ్డి, కందుకూరి అంబేద్కర్, రామడుగు నవీన్‌చారి, విజయ భాస్కర్, అబ్దుల్ అజీమ్, జావీద్, బొడ్డు సాయి, వినయ్, పవన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## మన గ్రోమోర్ సెంటర్ ఫర్టిలైజర్ లైసెన్స్ రద్దు



ప్రజాపక్షం/మర్రిగూడ: నిబంధనలకు విరుద్ధంగా యూరియా విక్రయాలు జరిపినందుకు మర్రిగూడలోని మన గ్రోమోర్ సెంటర్ ఫర్టిలైజర్ లైసెన్సు సస్పెండ్ చేస్తూ మునుగోడు డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చెయ్యని రైతులకు నిబంధనలకు విరుద్ధంగా యూరియా విక్రయంచినట్లు తనిఖీల్లో తేలిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న రైతులకు యూరియా విక్రయించకుండా,స్లాట్ బుక్ చేసుకోని రైతులకు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపినట్లు గుర్తించినట్లు ఏడీఏ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఈ నెల 24న మర్రిగూడ మన గ్రోమోర్ డీలర్‌కు మొత్తం 19.98 మెట్రిక్ టన్నులు (444 బస్తాలు) యూరియా సరఫరా కాగా,వాటిని ఈ నెల 25,26 తేదీల్లో అనధికారికంగా స్లాట్ బుక్ చేసుకోని రైతులకు విక్రయించినట్లు విచారణలో తేలిందని తెలిపారు.యూరియా కోసం ముందుగానే స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ఈ నెల 27న ఎరువుల దుకాణానికి చేరుకోగా,అక్కడ స్టాక్ లేకపోవడంతో మండల కేంద్రంలో తీవ్ర గందరగోళం నెలకొందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్1985 లోని క్లాజ్31 ప్రకారం సదరు డీలర్ లైసెన్సును తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఏడీఏ స్పష్టం చేశారు.ఎరువుల విక్రయాల్లో నిబంధనలు అతిక్రమించే ఏ డీలర్ అయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## అంబులెన్స్‌లోనే ప్రసవం...



ప్రజాపక్షం/చివ్వెంల : మండలంలోని కోమటికుంటకు చెందిన పి సమ్మక్కకు ఆదివారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో నొప్పులు తీవ్రమవ్వడంతో ఈఎంటి ప్రవళిక, పైలట్ శంకర్ సమయస్ఫూర్తితో అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. సమ్మక్క ఆడ శిశువుకు జన్మనివ్వగా, ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

# ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవ చేస్తా

### సోనియా గాంధీది త్యాగాల కుటుంబం
### ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర
### అసెంబ్లీకి వస్తే కెసిఆర్‌ను ఉతికి ఆరేసేందుకు రె‘డీ’
### కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే అభివృద్ధి: యువ చైతన్య ర్యాలీ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ :పదవి ఉన్నా లేకున్నా తన ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తానని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ 140 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎన్‌జి కళాశాల నుంచి శివాజీ నగర్, రామగిరి, బస్టాండ్, ప్రకాశం బజార్ మీదుగా క్లాక్ టవర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగాలన్న కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యపడుతుందని అన్నారు.తనను 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నల్గొండ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.రాష్ట్రంలో మట్టి రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేయిస్తానని పేర్కొన్నారు.నల్లగొండలో ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా బయట ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడని విమర్శించారు.కెసిఆర్‌కు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సవాల్ చేశారు.అసెంబ్లీకి వస్తే కేసీఆర్‌ను ఉతికి ఆరేవేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. 24 నెలలుగా కేసీఆర్ అసెంబ్లీకి రాకుండానే నెలకు 5 లక్షల చొప్పున ఇప్పటివరకు కోటి 20 లక్షల జీతం తీసుకున్నాడని అన్నారు.పదవిలో ఉన్నన్ని రోజులు కేసీఆర్ అల్లుడు,కొడుకు ప్రజల సొమ్మును దోచుకు తిన్నారని విమర్శించారు.అవినీతిని ప్రశ్నించిన సొంత కూతురిని బయటకు వెళ్ళగొట్టారని అన్నారు. కల్వకుంట్ల కవిత అడిగిన దోచుకున్న వేలకోట్లకు లెక్క కెసిఆర్ లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ ది త్యాగాల కుటుంబమని అన్నారు.రాజీవ్ గాంధీ చనిపోయిన సమయంలో మరో రెండు సార్లు ప్రధానిగా అవకాశం వచ్చిన తీసుకోలేదని అన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల కోసం సోనియా గాంధీ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకు వచ్చిందని ఉన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ దేశంలో బిజెపి మతతత్వ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు.వచ్చే ఎన్నికలలో రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని అన్నారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో నల్లగొండ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోనడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,మాజీ జడ్‌టిసిలు వంగూరి లక్ష్మయ్య,పాశం రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్,కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనుప రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరబోయిన బిక్షం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతకు పెద్దపీట

### ఐజి అరోమాసింగ్‌ఠాకూర్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాకూర్ తెలిపారు. స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన రైల్వే రక్షణ దళ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఆదివారం స్టేషన్‌కు వచ్చిన ఆమెకు రైల్వే పోలీసులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైలు ప్రయాణీకులు సురక్షితగా గమ్య స్థానాలకు చేర్చేందుకు ఆధునీక రక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్యాసింజర్ల వస్తు సామాగ్రి భద్రతతోపాటు ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ నియంత్రణకై ఆధునీక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. 24గంటల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని, స్టేషన్లలో అత్యాధునీక సీసీ , బాడీవేర్ కెమెరాలు అందుబాటులో ఉంచామన్నారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలోని స్టేషన్లు, రైళ్లలో విధులు నిర్వహించే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల శాశ్వత ఐడీలను సేకరిస్తున్నామని, భద్రత బృందాలను పెంచి సెల్‌ఫోన్, చైన్ స్నాచింగ్‌లు అరికట్టే చర్యలకు ఉపక్రమిస్తున్నామన్నారు. వారంతపు భద్రత సమీక్షలు నిర్వహిస్తూ ఉద్యోగుల మధ్య సమన్వయం పెంచుతున్నామన్నారు. భారతీయ రైల్వేలో భద్రతను పటిష్టం చేసేందుకు సురక్ష సమ్మేళన్, మేరీ సహేలి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ చరిత్రలో మదనాచారి ఒక అధ్యాయం

### శాసనమండలిమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ చరిత్రలో అన్నభీమోజు మదనాచారి ఒక అధ్యాయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కళాభారతిలో నిర్వహించిన జన హృదయేతన అన్నభీమోజు ఆచారి పుస్తకాన్ని ఆయన మాజీ శాసనమండలి చైర్మన్ సిరికొండ మధుసుధనాచారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్నేహితున్ని రక్షించడానికి వెళ్లి ప్రాణత్యాగం చేసిన త్యాగశీలి ఆచారి అన్నారు. ప్రతి ఉద్యమంలో కార్యకర్తలు ఎన్నో త్యాగాలను చేస్తేనే ఉద్యమాలు విజయాలు సాధిస్తున్నాయని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో ఆచారి ఎంతో పోరాడారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పలు నిర్మాణ, సేవారంగాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు 20లక్షల మంది వరకు ఉన్నారని, తెలంగాణీయులు అలసత్వం వదిలి మన నేల మీద పనులు మనమే చేయాలన్నారు. కాలమే కొందరిని ఇష్టంగా కంటుందని అలాంటి వాళ్లే చరిత్రకు కొత్త చరిత్రను అందిస్తారని అన్నారు. ఆచారి జీవించింది తక్కువ కాలమే అయిన ఎక్కువ చరిత్ర సృష్టించారని అన్నారు. ఇలాంటి వాళ్లు సమాజంలో అరుదుగా ఉంటారని అన్నారు. తాను 1984లో తొలి విశ్వకర్మ శాసనసభ్యుడిగా గెలిచి అసెంబ్లీకి వచ్చానని సిరికొండ మధుసుధనాచారి అన్నారు. విశ్వకర్మ జాతీయుడిగా పుట్టినందుకు తాను గర్విస్తున్నానని అన్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో జరిగిన వీర తెలంగాణ పోరాటానికి అన్ని రకాల ఆయుధాలను అందించింది విశ్వకర్మీయులేనన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు కెతావత్ శంకర్‌నాయక్, ఎంసీ.కోటిరెడ్డిలు మాట్లాడుతూ మిర్యాలగూడ అభివృద్ధికి అన్నభీమోజు ఆచారి చేసిన సేవకు గుర్తుగా మిర్యాలగూడలో ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, నల్లమోతు సిద్దార్థ, పుస్తక రచయిత తాటికొండ రమేష్, జితేంద్రచారి, అన్నభీమోజు నాగార్జునచారి, గడగోజు చంద్రశేఖర్, మారం శ్రీనివాస్, ధనావత్ చిట్టిబాబునాయక్, మండలోజు సైదాచారి, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఎండి.షోయబ్ పాల్గొన్నారు.

## 29 బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రానున్న మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మిర్యాలగూడలోని బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయంలో జిల్లా స్థాయి ముఖ్య నేతల సమావేశంలో ముఖ్య అతిధిగా ఆయన హాజరై మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ రెండు పార్టీలు కూడా తీవ్రంగా బీసీలను మోసం చేశాయని, అయినప్పటికీ బీసీలు స్థానిక సంస్థల్లో 50శాతం సీట్లు గెలిచి బీసీ సత్తాచాటారని, అయినప్పటికి చట్టసభల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ ఇంకా సజీవంగానే ఉందని, రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి కాంగ్రెస్ పార్టీ తన నిబద్ధతను చాటుకోవాలన్నారు. సమావేశానికి సంఘం నాయకులు చిలకరాజు శ్రీను,సైదాఖాసీం, మాడుగుల శ్రీనివాస్, నరేందర్‌నాయుడు, కొమ్రరాజు వెంకట్ తదితరులు ఉన్నారు.



## కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల పక్షం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల పక్షం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం భువనగిరి పట్టణంలోని జగదేవ్ పూర్ చౌరస్తాలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్రజెండాను భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దాసరి లక్ష్మయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ మాట్లాడుతూ భూస్వాములు, జమీందారులు, జాగిర్దారులకు వ్యతిరేకంగా పేద ప్రజలకు భూములు పంచాలని దున్నేవాడికి భూమి కావాలనే నినాదంలో సిపిఐ చేపట్టిన పోరాటాల ఫలితంగానే భూసంస్కరణల చట్టం అమలులోకి వచ్చిందని అన్నారు. 100 సంవత్సరాలలో సిపిఐ కార్మికులు, కర్షకులు పేదల హక్కుల కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిందని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం ఉప ప్రధాన కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, సిపిఐ నాయకులు చింతల పెంటయ్య, చొప్పరి సత్తయ్య, భవన నిర్మాణ కార్మికులు ఎల్లంల సతీష్, దాసరి వెంకటేష్, బండారి కుమార్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిజం అజేయం..

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : కమ్యూనిజం అజేయం అని సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం భువనగిరి మండలంలోని కూనూరు గ్రామంలో ఎర్రజెండాను దాసరి లక్ష్మయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భూస్వామ్య శృంకలాలను తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కూనూరు గ్రామ శాఖ కార్యదర్శి మరిపెల్లి రాములు, నాయకులు మరిపెల్లి ఎల్లయ్య, వాడి శ్రీను, పాశం యాదగిరి పాల్గొన్నారు.



# దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్సే

### ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్



ప్రజాపక్షం/దేవరకొండ : దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఎంఎల్ఏ బాలు నాయక్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పురాతన పార్టీ కాంగ్రెస్ అని, అనేక మంది మహనీయుల సంకల్పంతో ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో, దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఎనలేనిదని అన్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నడం పనికిమాలిన చర్యగా భావించారు. ఈకార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు యూనుస్, వెంకటేశ్వర్లు, నాయకులు వేణుధర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, నజీర్, సురేష్‌గౌడ్, రహత్‌అలి, రైస్, సైదులు, హరికృష్ణ, రాంసింగ్ పాల్గొన్నారు.

**నేడు రాష్ట్ర సాధనకు కాంగ్రెస్సే కారణం : ఎమ్మెల్యే వేముల వీరేశం**

ప్రజాపక్షం/నకిరేకల్ : దేశ స్వాతంత్ర్య సాధన నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు చరిత్రాత్మక బాధ్యతలను భుజాన వేసుకుని ప్రజల పక్షాన నిలిచిన పార్టీ కాంగ్రెస్ అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం స్పష్టం చేశారు.ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకుని నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒంటేపాక ఏసురత్నం,సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి,కౌన్సిలర్ గాజుల సుకన్య, యాసారపు వెంకన్న,నాయకులు లింగాల వెంకన్న,కొండ వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : భారత జాతీయ కాంగ్రెస్ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని డిసిసి అధ్యక్షుడు గుటిపాటి నర్సయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే ప్రజల కోసం పోరాటం, కాంగ్రెస్ అంటే అభివృద్ధి, సంక్షేమం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజద్‌అలీ, ఎలిమినేటి అభినయ్, వెలిమినేటి సురేష్, రమ్యకృష్ణ, సునీల్, కొమ్ము జవహర్, శ్రావ్య సుధీర్‌రెడ్డి, కందుకూరి అంబేద్కర్, రామడుగు నవీన్‌చారి పాల్గొన్నారు.

### మహాత్మా గాంధీ పేరు తొలగింపు దుర్మార్గపు చర్య

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంకు తూట్లు పొడుస్తూ మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నారని డిసిసి జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత అన్నారు.ఆదివారం నాడు జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ నుండి రామగిరిలోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీ చిత్ర పటాలతో మోదీ, బీజేపీ లకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తెచ్చిన జాతిపిత మహాత్మా సిద్ధాంతాలను తుంగలో తొక్కి గాడ్సే వాదాన్ని బలపరుస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు కన్నారావు, ఎండి ముంతాజ్ అలీ,బోడ స్వామి,నూనె కోటి,జిల్లపల్లి పరమేష్,సుధాకర్ ముదిరాజ్,పుట్టవెంకన్న, రాంబాబు నాయుడు రవితేజ బాలకృష్ణ నేత, రఫీ,శివ, బ్రహ్మాచారి, టి యాదగిరి ,మహేష్ కురుమ ,కోటేష్ ,సంతోష్ ,సాయి సాయితేజ, దశరథ,శరత్, సాయి,లక్ష్మణ్, ఉమేష్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.







# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బిజెపి పాలన శాశ్వతం కాదు

మణిపూర్ కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ఓక్రమ్ ఇబోబి సింగ్

**ఇంఫాల్:** దేశంలో, రాష్ట్రంలో బిజెపి పాలన శాశ్వతం కాదని మణిపూర్ కాంగ్రెస్ శాసనసభాపక్ష (సిఎల్‌పి) నాయకుడు ఓక్రమ్ ఇబోబి సింగ్ ఆదివారం అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమైనప్పుడే శాంతి, సహజీవనం వర్ధిల్లుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ 140వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, 'బిజెపి శాశ్వతం కాదు. వారు ఎంతకాలం పాలిస్తారు? వారు ఎంతకాలం పెత్తనం చేస్తారో చూద్దాం. ఎన్నికల కోసం వేచి చూద్దాం' అని సింగ్ అన్నారు. మూడుసార్లు మణిపూర్ ముఖ్యమంత్రిగా పనిచేసిన సింగ్.. గత మూడేళ్లలో అనేక విభాగాలు పనికిరాకుండా పోయాయని, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దాదాపుగా కుప్పకూలిందని ఆరోపించారు. 'కేంద్రంలో, ఇక్కడ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే ప్రజలు సామరస్యంగా జీవించే ప్రగతిశీల ప్రభుత్వం ఏర్పడుతుందని గట్టిగా నమ్ముతున్నాను. కాంగ్రెస్ పార్టీ బలోపేతమైనప్పుడే శాంతి, సహజీవనం సాధ్యమవుతాయి' అని ఆయన అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాన్ని, క్రమశిక్షణను పాటించడం అవసరమని కీషమ్ అన్నారు.

# శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్

## నాలుగేళ్ళలో సిద్ధం: ఇస్రో





**చెన్నై:** శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్ (ఉపగ్రహ ప్రయోగ వేదిక) రాబోయే నాలుగు సంవత్సరాలలో సిద్ధం అవుతుంది. ఇస్రోలోని ఉన్నత స్థాయి శాస్త్రవేత్త ఒకరు ఆదివారం ఈ విషయం చెప్పారు. ఈ విషయంలో సంబంధిత ఏర్పాట్లకు సరైన కంపెనీలు, విక్రేతలను గుర్తించే పనిలో ఉన్నట్లు చెప్పారు. 175 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో శ్రీహరికోట భవన సముదాయం ఉంది. చెన్నైకి 135 కి.మీ దూరంలో ఈ అంతరిక్ష కేంద్రం కొలువుతీరి ఉంది. వివిధ ప్రయోగ వేదికల ద్వారా అనేక ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా బెంగళూరులోని ఇస్రో ప్రధాన కేంద్ర కార్యాలయం లక్ష్యాలను నెరవేరుస్తోంది.12,000 కేజీల నుండి 14,000 కేజీలు బరువుగల ఉపగ్రహాలను రోదసీలోని వివిధ కక్ష్యలలోకి ప్రవేశపెట్టేందుకు వీలుగా ఈ మూడో ప్రయోగ వేదికను రూపొందించనున్నారు. ఇస్రో భవిష్యత్ లక్ష్యాలు సాధించాలంటే అతిపెద్ద వాహక నౌకలు అవసరం అవుతాయని, అందుకు అనుగుణంగా ఇస్రోను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని శ్రీహరికోటలోని సతీశ్ థావన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ప్రముఖ శాస్త్రవేత్త, డైరెక్టర్ ఇ.ఎస్.పద్మకుమార్ చెప్పారు. "మేం మరో శక్తిమంతమైన మూడో ప్రయోగ వేదికను నాలుగు సంవత్సరాలలో అభివృద్ధి చేసి ప్రారంభించాలనుకుంటున్నాం, అందుకు అనుగుణంగా క్రియాశీల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి' అని ఇటీవల పిటిఐ వార్తాసంస్థకు ఆయన చెప్పారు. "మేం దీనికి సంబంధించిన సామాగ్రిని సమకూర్చుకునే దశలో ఉన్నాం, సరైన, సక్రమమైన విక్రేతలను గుర్తించే పనిలో ఉన్నాం, ఇస్రో ప్రయోజనాలు కాపాడేందుకు వీలుగా బాధ్యతగా వ్యవహరించేవారు ఈ మెగా ప్రాజెక్టుకోసం చాలా అవసరం'' అని చెప్పారు. ఒక ప్రశ్నకు సమాధానంగా పద్మకుమార్ స్పందిస్తూ, ఒకసారి ఈ మూడో ప్రయోగ వేదిక పనిచేయడం ప్రారంభించిన తర్వాత 14000 కేసులు బరువుగల ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఈ వేదికను ఉపయోగించుకుంటాం, కొత్త తరం ఎన్‌జిఎల్‌వి (కొత్త తరం వాహక నౌకలు)లకోసం ఈ వేదికను ఉపయోగిస్తాం'' అని చెప్పారు. డిసెంబరు 23న ఇస్రో ఎంతో విజయవంతంగా 6000 కిలోలు బరువైన బ్లూబర్డ్ బ్లాక్–2 ఉపగ్రహాన్ని ప్రతిష్ఠాత్మకమైన భారత బాహుబలి వాహకనౌక ద్వారా ప్రయోగించింది. ఎవిఎం3–ఎం6 వాహకనౌక తక్కువ ఎత్తులో స్థిరకక్ష్యలోకి ఈ ఉపగ్రహాన్ని చొప్పించింది. భారతదేశ గడ్డపై నుండి ఎంతో బరువైన అమెరికా ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం ఇస్రో చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ ప్రయోగం భారతదేశానికి క్రిస్మస్, నూతన సంవత్సర కానుకగా ఇస్రో అభివర్ణించింది. ఈ విధంగా ఇస్రో రోజు రోజుకూ రోదసీరంగంలో కొత్త కొత్త విజయాలను తన ఖాతాలో నమోదు చేసుకుంటున్నది. ప్రస్తుతం ఇస్రో మూడు ఉపగ్రహ వాహక నౌకలను ఉపయోగించుకుంటున్నది. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (పిఎస్ఎల్‌వి), జియోషింకర్నస్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (జిఎస్ఎల్‌వి), లాంచ్ వెహికిల్ మార్క్ 3 (ఎల్‌విఎం3) లేదా అంతకుముందు పిలిచినట్లుగా జియోషింకర్నస్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ ఎంకె–3లను ఇస్రో ప్రస్తుతం ఉపయోగించుకుంటున్నది. 2002 సెప్టెంబరు ఐదో తేదీన ఇస్రో ఈ అంతరిక్ష కేంద్రానికి సతీశ్ థావన్ అంతరిక్ష కేంద్రం (ఎస్‌డిఎస్‌సి)గా పునర్నామకరణం చేసింది. ఇస్రో మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ సతీశ్ థావన్ స్మృత్యర్థం పేరు మార్పు చేశారు. 1971 అక్టోబరునెలలో ఈ అంతరిక్ష కేంద్రం పనిచేయడం ప్రారంభించింది. రోహిణి–125 ప్రయోగంతో మెల్లిగా ఈ కేంద్రం పనిచేయడం ప్రారంభించింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్రమంగా ఈ కేంద్రం తన పరిధిని విస్తరించుకుంటూ వెళుతున్నది.

## ఆరావళీ నిర్వచనం మారిస్తే...

# పర్వతశ్రేణి విచ్ఛిన్నం

- కేంద్ర మంత్రి భూపేందర్‌కు జైరామ్ రమేష్ నాలుగు ప్రశ్నలు



**న్యూఢిల్లీ :** ఆరావళీ పర్వతాల పునర్నిర్వచనంపై వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పర్వత శ్రేణిలో కొత్త మైనింగ్ లీజులను మంజూరు చేయడంపై పూర్తి నిషేధం విధించాలని కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్‌కు నాలుగు ప్రశ్నలు సంధించారు. ఈ చర్య మొత్తం పర్వత శ్రేణి భౌగోళిక, పర్యావరణ సమగ్రతను విచ్ఛిన్నం చేయడానికి, బలహీనపరచడానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. ఆరావళీ కొండలను 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భూభాగాలకు పరిమితం చేసే పునర్నిర్వచనంపై విస్తృత ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని యాదవ్‌కు రాసిన లేఖలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. ఈ విషయంలో పరిశీలన కోసం నాలుగు నిర్దిష్ట ప్రశ్నలను లేవనెత్తడానికి తనను అనుమతించాలన్నారు. రాజస్థాన్‌లో ఆరావళీ కొండలు, పర్వత శ్రేణుల నిర్వచనం, 2012 నుండి, ఆగస్టు 28, 2010 నాటి ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) నివేదికపై ఆధారపడి ఉంది అన్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆ నివేదికలో ఉన్న అంశాలను రమేష్ పేర్కొంటూ 'మూడు డిగ్రీలు లేదా అంతకంటే ఎక్కువ వాలు ఉన్న అన్ని ప్రాంతాలను కొండలుగా గుర్తించాలి. అలాగే 20 మీటర్ల కొండ ఎత్తుకు అనుగుణంగా సాధ్యమయ్యే విస్తరణను పరిగణనలోకి తీసుకోవడానికి, 20 మీటర్ల కాంటూర్ విరామానికి సమానంగా, కొండ కింది వైపున ఏకరీతిగా 100 మీటర్ల వెడల్పు గల బఫర్‌ను చేర్చాలి. 'ఈ గుర్తించబడిన ప్రాంతాల పరిధిలోకి వచ్చే సమతల ప్రాంతాలు, పీఠభూములు, లోయలు కూడా కొండలలో భాగంగా చేర్చబడతాయని అని రమేష్ అన్నారు. సెప్టెంబర్ 20, 2025న పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు పంపిన ఒక లేఖలో 'ఆరావళీలలోని చిన్న కొండల నిర్మాణాలు భారీ ఇసుక కణాలను ఆపడం ద్వారా ఎడారీకరణకు వ్యతిరేకంగా సహజ అడ్డంకులుగా పనిచేస్తాయి. తద్వారా ఢిల్లీ, పొరుగు మైదానాలను ఇసుక తుఫానుల నుండి రక్షిస్తాయని ఎఫ్ఎస్ఐ పేర్కొన్న విషయం వాస్తవం కాదా? అని కూడా ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సిఇసి) తన నవంబర్ 7, 2025 నాటి నివేదికలో, రాజస్థాన్‌లోని 164 మైనింగ్ లీజులు అప్పటికి అమల్లో ఉన్న ఎఫ్ఎస్ఐ నిర్వచనం ప్రకారం ఆరావళీ కొండలు, శ్రేణుల లోపల ఉన్నాయని నిర్ధారించిన విషయం వాస్తవం కాదా? అని రమేష్ నిలదీశారు. ఈ పునర్నిర్వచనం వల్ల అనేక చిన్న గుట్టలు, ఇతర భూస్వరూపాలు కోల్పోవడమే కాకుండా, నాలుగు రాష్ట్రాలలో విస్తరించి ఉన్న మొత్తం ఆరావళీ కొండలు, శ్రేణుల భౌగోళిక, పర్యావరణ సమగ్రతకు విచ్ఛిన్నం, నష్టం వాటిల్లుతుంది అన్నది నిజం కాదా? అని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించారు.కొండల పునర్నిర్వచనం కింద ఆరావళీలలో 90 శాతానికి పైగా రక్షణ పొందవని, వాటిని మైనింగ్, ఇతర కార్యకలాపాల కోసం తెరిచి ఉంచుతారని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించింది.

## బెంగళూరులో ఇళ్ల కూల్చివేత

# యుపి ఘటనలతో పోల్చొద్దు

- ఐయుఎంఎల్ నాయకుడు పికె కున్హాలికుట్టి

**కోజికోడ్ :** బెంగళూరులో ప్రభుత్వ సంస్థ ఇళ్లను కూల్చివేయడం ఉత్తరప్రదేశ్‌లో జరిగిన దానికి ఏమాత్రం పోల్చదగినది కాదని ఐయుఎంఎల్ నాయకుడు పికె కున్హాలికుట్టి చెప్పారు. ఆదివారం ఆయన కేరళ కోజికోడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) జాతీయ కార్యదర్శి పికె కున్హాలికుట్టి, మంత్రులు, ముఖ్యమంత్రితో సహా కర్ణాటకలోని నాయకులతో తాను మాట్లాడినట్లు తెలిపారు. 'కర్ణాటకలో జరిగిన కూల్చివేత ఉత్తరప్రదేశ్‌లో జరిగిన దానికి పోల్చదగినది కాదని, బెంగళూరులో అన్ని వర్గాల ప్రజలు ప్రభావితమయ్యారని వారు చెప్పారు'ఆయన అన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పిస్తారని కున్హాలికుట్టి తెలిపారు. 'ప్రభుత్వం ఆకర్షణీయమైన పునరావాస ప్యాకేజీలను అందిస్తుంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని తెలిసి ఈ సమస్యను ఆసరాగా చేసుకోవడం చౌకబారు రాజకీయాలు' అని ఆయన అన్నారు. శుక్రవారం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక రాజధానిలో ముస్లింల ఇళ్లను కూల్చివేసినట్లు వచ్చిన వార్తలను తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యను దిగ్భ్రాంతికరం, బాధాకరమైనదిగా అభివర్ణించారు. మీడియా నివేదికల ప్రకారం, గత వారం యలహంకలోని కోగిలు గ్రామంలో చేపట్టిన కూల్చివేత డ్రైవ్‌లో వసీం లేఅవుట్, ఫకీర్ కాలనీలలో 200కి పైగా ఇళ్లను కూల్చివేశారు. ఇదిలా ఉండగా, కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)లో సీట్ల పంపకంపై ఎలాంటి చర్చలు ప్రారంభం కాలేదని కున్హాలికుట్టి అన్నారు. సీట్ల పంపకం చర్చల సమయంలో అనవసరమైన డిమాండ్లు ఏవీ లేవనెత్తబోమని ఆయన స్పష్టం చేశారు.'మేము అనవసరమైన రాజకీయ ప్రయోజనం పొందబోము. మాకు దక్కాల్సినవి మాకు దక్కుతాయి' అని ఆయన అన్నారు. యుడిఎఫ్ సీట్ల పంపకం చర్చలను పూర్తి చేసి, జనవరి నెలాఖరులోగా లేదా ఫిబ్రవరి ప్రారంభంలో అభ్యర్థులను ఖరారు చేయాలని నిర్ణయించింది. కేరళ అసెంబ్లీ ఎన్నికలు మార్చిఏప్రిల్ 2026లో జరిగే అవకాశం ఉంది.

## నాథూరామ్ గాడ్సే మద్దతుదారుల నుంచి

# నేర్చుకోవాల్సింది ఏమీ లేదు

- కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్



**న్యూఢిల్లీ :** ఆర్‌ఎస్ఎస్, జన సంఘ్, బిజెపిలను కొనియాడుతూ శనివారం తాను చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ప్రతీ సంస్థ క్రమశిక్షణాయుతంగా బలోపేతం కావాలనే కోణంలోనే తాను వ్యాఖ్యానించినట్లు ఆయన ఆదివారం స్పష్టం చేశారు. నాథూరామ్ గాడ్సే మద్దతుదారుల నుంచి నేర్చుకోవాల్సింది ఏమీ లేదని దిగ్విజయ్ తేల్చిచెప్పారు. గత 50 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ మతతత్వ శక్తులపై పోరాడుతున్న తాను, ఇకపైనా ఆర్‌ఎస్ఎస్ సైద్ధాంతిక భావజాలాన్ని వ్యతిరేకించి తీరుతానని వెల్లడించారు. ఆర్‌ఎస్ఎస్, జన సంఘ్‌ల బలమైన వ్యవస్థాగత నిర్మాణాన్ని మాత్రమే తాను ప్రశంసించానని ఆయన పేర్కొన్నారు. సైద్ధాంతికపరంగా సదా బిజెపి, ఆర్‌ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగానే నిలబడతానన్నారు. ఆర్‌ఎస్ఎస్‌ను దిగ్విజయ్ సింగ్ కొనియాడటంపై కాంగ్రెస్ నేతల్లో భిన్న, విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆదివారం ఆయన తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. 'ఆర్‌ఎస్ఎస్‌లో క్రమశిక్షణకు ఉండే ప్రాముఖ్యత గురించి ఏమంటారు?' అని విలేకరులు ప్రశ్నించగా, 'నాథూరాం గాడ్సే లాంటి హంతకుల నుంచి నేర్చుకోవాల్సిన అవసరం లేదు' అని దిగ్విజయ్ బదులిచ్చారు.

**గాంధీజీ కాంగ్రెస్‌కు, గాడ్సే ఆర్‌ఎస్ఎస్ ఏం నేర్పగలదు ? : పవన్ ఖేడా**

దిగ్విజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం ఛైర్మన్ పవన్ ఖేడా ఆదివారం ఘాటుగా స్పందించారు. ఆయన కూడా ఆర్‌ఎస్ఎస్‌కు, నాథూరాం గాడ్సేతో లింకు పెడుతూ మాట్లాడారు. గాంధీజీ స్థాపించిన కాంగ్రెస్‌కు, గాడ్సే భావజాలంతో ఏర్పడిన ఆర్‌ఎస్ఎస్ ఏం నేర్పగలదు అని పవన్ ఖేడా ప్రశ్నించారు. ఆర్‌ఎస్ఎస్ నుంచి నేర్చుకోదగిన అంశమేదీ లేదన్నారు.

**కాంగ్రెస్ వ్యవస్థాగత బలోపేతం అత్యవసరం :శశి థరూర్**

మరోవైపు దిగ్విజయ్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాగత బలోపేతాన్ని ఆశిస్తూ దిగ్విజయ్ చేసిన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదన్నారు. వాస్తవానికి కాంగ్రెస్‌ను వ్యవస్థాగతంగా బలోపేతం చేయాల్సిన అత్యవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ 140వ వ్యవస్థాపక దినోత్సవానికి థరూర్ హాజరయ్యారు. ఈసందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. 'దిగ్విజయ్‌తో మాట్లాడారా' అని విలేకరులు ప్రశ్నించగా, 'దిగ్విజయ్, నేను మంచి స్నేహితులం. మేం మాట్లాడుకుంటూనే ఉంటాం. కాంగ్రెస్ వ్యవస్థాగతంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. అందులో సందేహమేం లేదు' అని థరూర్ చెప్పారు. ఈ వ్యవస్థాపక దినోత్సవం కాంగ్రెస్‌కు చాలా ముఖ్యమైందని, గత 140 ఏళ్ల కాంగ్రెస్ చరిత్ర నుంచి పార్టీ చాలా నేర్చుకోవచ్చన్నారు. పార్టీలో అంతర్గత క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, సొంత అనుభవాల నుంచి నేర్చుకోవడంపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టాలని సూచించారు.

# ఇక నా జీవితం అభిమానులకే అంకితం

- రాబోయే 33 ఏళ్లు వాళ్ల కోసమే
- సినిమాలు వదిలేస్తున్నా : విజయ్ దళపతి



**చెన్నై:** ఇకపై తన జీవితమంతా అభిమానులకే అంకితమని ప్రముఖ హీరో, తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ అధినేత విజయ్ ప్రకటించారు. గత 33 ఏళ్లుగా అభిమానులు తనతో ఉన్నారని, రాబోయే 33 ఏళ్లపాటు తాను వారి కోసమే జీవిస్తానని ఆయన భావోద్వేగంగా వెల్లడించారు. శనివారం రాత్రి మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లోని బుకిట్ జలీల్ మల్టీ పర్పస్ స్టేడియంలో జరిగిన 'జన నాయకుడు' ఆడియో విడుదల కార్యక్రమంలో ప్రసంగిస్తూ విజయ్ ఎమోషనల్ అయ్యారు. వేలాది మంది అభిమానులు గుమిగూడిన ఈ స్టేడియంలో, కేరింతల మధ్య ఆయన మాట్లాడారు. ఇదే తన చివరి సినిమా అని విజయ్ ప్రకటించారు. 'నా చివరి సినిమా ఆడియో లాంచ్, మ్యూజిక్ ఈవెంట్‌కు హాజరవడం నిజంగా నాకు ప్రత్యేకంగా అనిపిస్తోంది. విశాలమైన సముద్రంలో ఒక చిన్న ఇసుక కోటను నిర్మించాలనే కలతో నేను సినిమాల్లోకి ప్రవేశించాను. కానీ నా అభిమానులు దాన్ని ఒక అద్భుతమైన కోటగా మార్చారు. థియేటర్లలో, నా ప్రతీ అడుగులో నా వెంట నిలబడిన అభిమానులే నాకు ముఖ్యం. నా ఫ్యాన్స్ ఎప్పుడైనా ఏదైనా సమస్యను ఎదుర్కొంటే, వారి ఇళ్ల ఎదుటకు వెళ్లి నిలబడే మనిషిని నేను. నా కోసం ప్రతీదీ త్యాగం చేసిన అభిమానుల కోసం నేను సినిమాలను వదులుకోవడానికి సిద్ధపడ్డాను' అని విజయ్ వెల్లడించారు.

## సెంగార్ జీవిత ఖైదు నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ...

# సిబిఐ పిటిషన్‌పై 'నేడు సుప్రీం' విచారణ



**న్యూఢిల్లీ:** ఉన్నావ్ అత్యాచారం కేసులో బహిష్కృత బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్ జీవిత ఖైదును నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనున్నది. కాజ్ లిస్ట్ ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జె.కె.మహేశ్వరి, ఆగస్టిన్ జారి మాసిహ్‌లతో కూడిన ముగ్గురు జడ్జిల వెకేషన్ బెంచ్ ఈ విషయాన్ని విచారించే అవకాశం ఉంది. కోర్టు ఉత్తర్వులను సవాల్‌చేస్తూ, దానిపై స్టే కోరుతూ న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్ప్‌కర్ దాఖలు చేసి ఒక ప్రత్యేక పిటిషన్‌ను కూడా అత్యున్నత న్యాయస్థానం విచారించనుంది. ప్రజా పదవులు నిర్వహిస్తున్న ఎవరైనా ఎంపీలు లేదా ఎమ్మెల్యేలు అయితే వారిని ప్రజాసేవకులుగా పరిగణిస్తారని, ఎల్.కె.అద్వానీ కేసులో ఇచ్చిన తీర్పును సిబిఐ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. నేరం జరిగినప్పుడు ఎమ్మెల్యే అయిన కుల్దీప్‌సింగ్ సెంగార్‌ను పోక్సో కింద విచారించాల్సి ఉండగా ప్రజాసేవకుడు కాదని హైకోర్టు తప్పు చేసిందని, బెయిల్ మంజూరు చేసిందని సిబిఐ వాదించింది. రాజ్యాంగబద్ధమైన పదవిని కలిగిఉండటం వల్ల సిట్టింగ్ ఎమ్మెల్యేకు ఓటర్లపై ప్రజా విశ్వాసం, అధికారం ఉందని, అలాంటి పదవి రాష్ట్రానికి, సమాజానికి బాధ్యత వహించాల్సిన విధుల నుండి ఉత్పన్నమయ్యే అధిక బాధ్యత కలిగి ఉంటుందని హైకోర్టు పరిగణించడంలో విఫలమైంది.పోక్సో చట్టం లక్ష్యం, ఉద్దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్దేశపూర్వకమైన వివరణను స్వీకరించడంలో విఫలమవడంద్వారా అది చట్టవిరుద్ధంగా ప్రవర్తించింది' అని సిబిఐ పేర్కొంది. ఉన్నావ్ అత్యాచారం కేసులో జీవిత ఖైదును అనుభవిస్తున్న కుల్దీప్ సింగ్ సెంగార్ జైలు శిక్షను డిసెంబరు 23న హైకోర్టు సస్పెండ్ చేసింది. ఆయన ఇప్పటికే ఏడు సంవత్సరాల 5నెలల జైలు శిక్షను అనుభవించారని చెప్పారు.రేప్ కేసులో తనను దోషిగా నిర్ధారించి శిక్షను విధించడాన్ని సవాల్ చేస్తూ కుల్దీప్ సింగ్ సెంగార్ దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉన్నంతవరకూ హైకోర్టు అతని శిక్షను నిలుపుదల చేసింది.ఈ కేసులో డిసెంబరు 2019న ట్రయల్ కోర్టు తీర్పును కుల్దీప్ సింగ్ సెంగార్ సవాల్ చేశాడు. అయితే బాధితురాలి తండి కస్టోడియన్ డెత్ కేసులో అతను 10సంత్సరాల జైలుశిక్ష అనుభవిస్తున్నందున ఆ కేసులో బెయిల్ మంజూరు చేయకపోవడంతో అతను జైలులోనే ఉంటాడు. మైనర్‌గా ఉన్నప్పుడు బాధితురాలిని కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కుల్దీప్ సింగ్ సెంగార్‌కు హైకోర్టు అనేక షరతులు విధిస్తూ రూ.15లక్షలు వ్యక్తిగత పూచీకత్తు, అంతే మొత్తానికి ముగ్గురు పూచీకత్తులు చెల్లించాలని ఆదేశించింది. ఢిల్లీలోని బాధితురాలి నివాసానికి 5 కి.మీ పరిధిలోకి సెంగార్ రాకూడదని, ఆమెను లేదా ఆమె తల్లిని బెదిరించవద్దని కూడా ఆదేశించింది. ఏదైనా షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుకు కారణం అవుతుందని హైకోర్టు తెలియజేసింది. 2019ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యాచారం కేసు, సంబంధిత ఇతర కేసులను ఉత్తర్‌ప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుండి ఢిల్లీకి బదిలీ చేశారు. బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన కేసులో తనును దోషిగా నిర్ధారించారని కుల్దీప్‌సింగ్ సెంగార్ చేసుకున్న అప్పీల్ కూడా పెండింగ్‌లో ఉంది. అతను ఇప్పటికే చాలా కాలం జైలులో గడిపాడనే కారణంతో అతని శిక్షను సస్పెండ్ చేశారు.

# గౌతమ్ అదానీ కష్టపడే యువతకు స్ఫూర్తి

- ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్



**బారామతి:** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ప్రస్థానం, పెద్ద కలలు కనే కష్టపడి పనిచేసే యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ అన్నారు. పుణె జిల్లాలోని బారామతిలో ఆదివారం జరిగిన శరద్‌చంద్ర పవార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అదానీ గ్రూప్ ఛైర్మన్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను, పవార్ కుటుంబం నిర్వహించే విద్యా సంస్థ అయిన విద్యా ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో స్థాపించారు. అదానీ గుజరాత్‌లోని కరువు పీడిత బనస్కాంత జిల్లా నుండి వచ్చారని, ముంబయికి వచ్చి సున్నా నుండి తన వ్యాపారాన్ని ప్రారంభించారని, నేడు ఆయన వ్యాపారం 23 రాష్ట్రాలకు విస్తరించిందని శరద్ పవార్ పేర్కొన్నారు. శరద్ పవార్‌ను అదానీ తన గురువుగా అభివర్ణిస్తూ, ఈ సీనియర్ రాజకీయ నాయకుడు క్షేత్రస్థాయి వాస్తవాలను జాతీయ ఎజెండాతో మిళితం చేశారని కొనియాడారు. 'మూడు దశాబ్దాలకు పైగా పవార్ సాహెబ్‌ను తెలుసుకునే అదృష్టం నాకు లభించింది. ఆయన నుండి నేను నేర్చుకున్న దానికి సాటి లేదు. కానీ జ్ఞానానికి మించి, ఆయన వివేకం, గాఢమైన సానుభూతి నాపై బలమైన ముద్ర వేస్తాయి' అని అదానీ అన్నారు. 'ఆయన దార్శనిక నాయకత్వం వల్ల సాధ్యమైన పరివర్తనకు, అపరిమితమైన సామర్థ్యానికి బారామతి ఒక చిహ్నం. ఇక్కడికి డజన్ల కొద్దీ సార్లు వచ్చిన తర్వాత, ఆయన ఇక్కడ సాధించినది స్థానిక అభివృద్ధికి అతీతమైనది' అని ఆ పారిశ్రామికవేత్త అన్నారు. పవార్ దృష్టిలో, భారతదేశం ఏ దిశలో పయనించాలో దానికి బారామతి ఒక ప్రతిబింబం అని ఆయన అన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా లేదా పార్టీలకు అతీతంగా అయినా, పవార్ దేశ వ్యవసాయ విధానం, సహకార సంస్థలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దారని అదానీ అన్నారు. 'ఆయన వంటి నాయకులు మంచి రాజకీయాలు కేవలం నినాదాల గురించి కాదని మనకు గుర్తు చేస్తారు. మన దేశం ఏకాంత విజయాల ద్వారా కాకుండా, ప్రజలు,దాని సంస్థల స్థిరమైన సమన్వయం ద్వారా అభివృద్ధి చెందుతుందని అర్థం చేసుకోవడమే మంచి రాజకీయాలు,' అని ఆయన అన్నారు. ఏఐ గురించి మాట్లాడుతూ, అది 'మనం పనిచేసే విధానాన్ని, మన వినియోగదారులకు సేవ చేసే విధానాన్ని' మారుస్తుందని అదానీ అన్నారు. ఈ కార్యక్రమంలో బారామతి ఎంపి సుప్రియా సూలే, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, రాజ్యసభ ఎంపి సునేత్ర పవార్, పవార్ కుటుంబంలోని ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో ఎన్‌సిపి (ఎస్‌పి) ఎమ్మెల్యే రోహిత్ పవార్, విద్యా ప్రతిష్ఠాన్ కోశాధికారి యుగేంద్ర పవార్ ఉన్నారు. సభను ఉద్దేశించి బారామతి ఎంపి సుప్రియా సూలే మాట్లాడుతూ, 'అదానీ కుటుంబంతో మాకు 30 ఏళ్ల అనుబంధం ఉంది. నేను మంచి లేదా చెడు వార్తను తెలియజేయాల్సి వస్తే, సోదరిగా గౌతమ్ భాయ్‌కి నిర్మొహమాటంగా చెబుతాను. ఆయన నా అన్నయ్య. సంబంధాలలోని ఆప్యాయత జిడిపి గణాంకాలలో కనిపించదన్నారు.

# బంగ్లా పోలీసుల ఆరోపణలు నిరాధారం

- విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ప్రధాన నిందితులు భారత్‌కు వచ్చినట్లు ఆధారాల్లేవ్ బిఎస్ఎఫ్ ప్రకటన

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ప్రధాన అనుమానితులుగా ఉన్న ఫైసల్ కరీం మసూద్, అలంగీర్ షేక్ భారత్‌కు పారిపోయినట్లు ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు ప్రకటించడాన్ని బిఎస్ఎఫ్ అధికారులు, మేఘాలయ పోలీసులు ఖండించారు. సరిహద్దు భద్రతా దళం (మేఘాలయ) స్పందిస్తూ.. అంతర్జాతీయ సరిహద్దును దాటి ఎవరూ భారత్‌లోకి వచ్చినట్లు ఆధారాలు లేవని వెల్లడించింది. సరిహద్దుల్లో తమ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు పొరుగుదేశం ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడింది. బంగ్లాదేశ్ పోలీసులు, అక్కడి మీడియా చేసిన ప్రకటనల్లో నిజం లేదని మేఘాలయ పోలీసులు స్పష్టం చేశారు. ఎవరూ రాష్ట్రంలోకి రాలేదని.. తాము ఎవరినీ అరెస్టు చేయలేదని వెల్లడించారు. ఇవన్నీ భారత్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలని కొట్టిపడేశారు. భారత ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేందుకు బంగ్లాదేశ్ మీడియా కల్పిత కథనాలను సృష్టిస్తోందన్నారు. కాగా, బంగ్లాదేశ్‌ను కుదిపేసిన విద్యార్థి ఉద్యమ నేత ఉస్మాన్ బిన్ హాదీ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు భారత్‌కు పారిపోయినట్లు బంగ్లాదేశ్ పోలీసులు ఆరోపించారు. ఈ మేరకు అధికారికంగా ఒక ప్రకటన చేశారు. ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు (డిఎంపి) ఆదివారం వివరాలను వెల్లడించారు.ప్రధాన నిందితులు ఫైసల్ కరీం మసూద్, అలంగీర్ షేక్‌లు మేఘాలయలోని తురా నగరంలో తలదాచుకున్నట్లు గుర్తించామని అదనపు పోలీస్ కమిషనర్ తెలిపారు.

# మేఘాలయకు హాదీ నిందితులు పరార్

- ఇద్దరు అనుమానితులను అరెస్టు చేసిన భారత్

**ఢాకా:** జులై ఉద్యమ నాయకుడు, ఇంక్విలాబ్ మంచో పార్టీ వ్యవస్థాపకుడు ఉస్మాన్ హాదీ (32) హత్యకేసు పురోగతి సాధించింది. నేరస్థులకు సహకరించిన ఇద్దరు నిందితులను భారత్‌లోని అధికారులు పట్టుకున్నారు. ఉస్మాన్ హాదీని హత్య చేసినట్లుగా భావిస్తున్న ఇద్దరు నేరస్థులు ఫైసల్ కరీమ్ మసూద్, అలమ్‌గిర్ షేక్ భారతదేశ రాష్ట్రం మేఘాలయకు పారిపోయారని, బంగ్లాదేశ్ పోలీసులు ఆదివారం ప్రకటించారు. ఐతే దీనిపై భారత ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందనా లేదు. మైమన్‌సింగ్‌లోని హలుయాఘాట్ సరిహద్దుల నుండి ఇద్దరు నిందితులు భారత్‌లోకి పారిపోయారని ఢాకా మెట్రోపాలిటన్ పోలీసు అదనపు కమీషనర్ (సెంట్రల్ క్రైమ్ ఆపరేషన్స్) ఎస్.ఎన్.మహ్మద్ నజ్రుల్ ఇస్లామ్ డిఎంపి మీడియా సెంటర్‌లో ఆదివారం పాత్రికేయులకు చెప్పారు. మొదట భారత సరిహద్దుల్లోకి వెళ్ళిపోయిన తర్వాత ఈ ఇద్దరు వ్యక్తులను పుర్తి అనే వ్యక్తి తన అధీనంలోకి తెచ్చుకున్నాడని, ఆ తర్వాత సమీ అనే టాక్సీ డ్రైవర్ వారిని మేఘాలయ లోని తురాసిటీలోకి తీసుకుపోయాడని చెప్పారు. హది హంతకులను దేశం వదిలి పారిపోయిన నేరస్థులుగా పోలీసులు ప్రకటించినట్లు ఇస్లామ్ చెప్పారు. పుర్తి, సమీ ఇద్దరని భారత అధికారులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఈ నిందితులు ఇద్దరినీ బంగ్లాదేశ్‌కు రప్పించేందుకు స్థానిక పోలీసులు ముమ్మరంగా కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. భారతదేశంలోని పోలీసు అధికారులతో తాము సంభాషణలు చేస్తున్నామని, వారిని దేశానికి రప్పిస్తామని అన్నారు. ఐతే హత్య కేసులో ప్రధాన నేరస్థులు ఇద్దరూ ఎప్పుడు భారత్‌కు పారిపోయారన్న విషయం ఆయన చెప్పలేదు. ఐతే హదీ కేసులో దర్యాప్తు దాదాపు ముగింపు దశకు వచ్చిందని ఆయన ప్రకటించారు. హదీ హత్య కేసులో ఇప్పటివరకూ బంగ్లాదేశ్‌లో 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సిఆర్‌పిసి సెక్షన్ 164 కింద వారి నుండి కోర్టులో అంగీకార ప్రకటనలు నమోదు చేశారు. రెండు పిస్టోళ్ళను స్వాధీన చేసుకున్నారు. దాడికోసం ఉపయోగించిన మోటారు బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు సందర్భంగా 218 కోట్ల టాకాల ఒక చెక్కును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఉస్మాన్ హాదీ డిసెంబరు 12వ తేదీన ఢాకాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఒక మసీదుకు వెళ్ళి బయటకు వస్తుండగా ఆయనపై కాల్పులు జరిగాయి. తలపై బలమైన గాయంతో హదీ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్సకోసం సింగపూర్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ డిసెంబరు 18న మరణించారు.



# సాహితీ విహారి

# సాహిత్యం.. మారుతున్న దృక్పథం

సాహిత్య దృక్పథం నిరంతరం మారుతునే ఉంటుందని 2025 సంవత్సరం మరోసారి రుజువు చేసింది. అంతేకాదు, గతంలో ఎన్నడూ లేనంతగా ప్రపంచ సాహిత్యం ఒక కీలక దశకు చేరుకుంది. ఇది కేవలం కొత్త పుస్తకాల సంవత్సరం మాత్రమే కాదు... సాహిత్యాన్ని చూసే విధానం, చదివే పద్ధతి, రాసే భావజాలం అన్నీ మారుతున్న దశ. ఈ ఏడాది ఎక్కువగా వచ్చింది సంక్షోభాల సాహిత్యం. వాతావరణ మార్పులు, యుద్ధాలు, శరణార్థుల సమస్య, ఆర్థిక అసమానతలు, డిజిటల్ ఒంటరితనం వంటివి సాహిత్యంలో ప్రధాన ఇతివృత్తాలుగా కనిపిస్తున్నాయి. రచయితలు వ్యక్తిగత బాధను సామాజిక నిర్మాణాల లోపాలతో కలిపి చూపిస్తున్నారు. ఈ ఏడాది, సాహిత్యం తటస్థంగా ఉండటం తగ్గింది. రాజకీయ, సామాజిక చైతన్యం పెరిగింది. అధికార వర్గాలు, ప్రజల సంబంధాలు, నిఘా, డేటా నియంత్రణ, ప్రజాస్వామ్యంపై ఒత్తిళ్లు వంటి పలు అంశాలను, కీలక సమస్యలను రచయితలు వివిధ సాహిత్య రూపాల్లో ప్రస్తావించడం ఆహ్వానించతగిన పరిణామం. ఇలాంటి సమస్యలను నవలలు, కవితలు, వ్యాసాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. ఫలితంగా, సాహిత్యం మళ్లీ ఒక ప్రతిఘటన సాధనంగా మారుతోంది. నేటి డిజిటల్ యుగంలో సాహిత్యం కూడా కృత్రిమ మేధ, అత్యాధునిక సాంకేతికతను వాడుకోవడం ఆరంభమైంది. ఇది డిజిటల్ సాహిత్యంగా రూపాంతరం చెందుతున్నది. ఈ తరుణంలోనే, సృజనాత్మకతకు భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న ఉదయిస్తుంది. రచయితలు రాసే తీరు మారుతున్న చందంగానే పాఠకులు చదువుతున్న తీరు కూడా మారుతున్నది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, ఇ–బుక్స్, ఆడియో బుక్స్, మినీ కథలు, మైక్రో ఫిక్షన్ రచనకు ఆదరణ పెరుగుతున్నది. దీంతో భాష మరింత సూటిగా, పదునుగా మారుతోంది. లోతైన ఆలోచనలకు కూడా కొత్త రూపాలు దొరుకుతున్నాయి. ఈ ఏడాది సాహిత్యంలో వచ్చిన ముఖ్యమైన మార్పుల్లో దళిత, ఆదివాసీ రచనలు, మహిళా, క్వీర్ వాదాలు, వలసదారుల కథలు పెరగడం ఒకటి. ఇవి ప్రత్యామ్నాయ సాహిత్య ప్రక్రియలు అనుకోవడానికి వీల్లేదు. కాకపోతే, ఇలాంటి రచనలు కూడా ప్రధాన సాహిత్య ప్రవాహంలోకి వచ్చాయి. ఈ ఏడాది ఎక్కువగా గమనించదగిన పరిణామాల్లో సాహిత్యం మార్క్సిజం ఆలోచనల చుట్టూ తిరగడం. ఇది కూడా కొత్తేమీ కాదు. కానీ, ఈ దృక్పథంలో సమాజాన్ని చూసి, స్పందిస్తున్న వారి సంఖ్య పెరిగింది. మార్క్సిజంతోపాటు, పోస్ట్‌కలోనియల్ ఆలోచనలు, పర్యావరణ తత్వం వంటి కొత్త కోణాలను కూడా స్పృశిస్తున్నారు. దీనితో, సాహిత్యం కేవలం ఒక విషయాన్ని లేదా సమస్యను ఏకరువు పెట్టే కేంద్రంగా కాకుండా, ఆలోచనలను నిర్మించే స్థలంగా మారుతోంది. ఈ ఏడాది ప్రపంచ సాహిత్య చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచింది. 2025లో వెలువడిన పుస్తకాలు కేవలం కథనాలుగా మాత్రమే కాకుండా, మానవ అనుభవాల లోతైన విశ్లేషణగా, సమకాలీన ప్రపంచ సంక్షోభాల ప్రతిబింబంగా, వ్యక్తిగత జీవితం–సామూహిక చైతన్యం మధ్య ఉన్న ఉద్రేకాలను వ్యక్తం చేసే సృజనాత్మక ప్రయత్నాలుగా కనిపించాయి. సాంకేతిక యుగంలో మానవత్వం, వలసల అనుభవం, యుద్ధాల ప్రభావం, గుర్తింపు సంక్షోభం, ప్రేమ–ఒంటరితనం వంటి అంశాలు సాహిత్యానికి కేంద్ర బిందువులుగా మారాయి.

ఈ ఏడాది అత్యంత ప్రాధాన్యత పొందిన రచనలలో ఫిలిప్ పుల్‌మన్ రచించిన 'ది రోజ్ ఫీల్డ్'ను ప్రత్యేకంగా పేర్కోవాలి. ఆయన ప్రసిద్ధ 'ది బుక్ ఆఫ్ డస్ట్' శ్రేణికి ఇది ముగింపు భాగం. ఫాంటసీ కథనాన్ని ఆధారంగా చేసుకొని మానవ స్వేచ్ఛ, అధికార వ్యవస్థలు, నైతిక బాధ్యత వంటి తాత్విక ప్రశ్నలను ఈ నవల లేవనెత్తుతుంది. ఇది కేవలం కల్పిత ప్రపంచం కాదు.. మన వాస్తవ ప్రపంచానికే ప్రతిరూపంగా నిలిచింది. నోబెల్ బహుమతి గ్రహీత అబ్దుల్‌రాజక్ గూర్నా రాసిన 'థెఫ్ట్' 2025లో వచ్చిన అత్యంత లోతైన సామాజిక నవలలలో ఒకటి. వలస జీవితం, వలస పాలన తర్వాతి సమాజాల్లో వ్యక్తి ఎదుర్కొనే ఆత్మవేదన, గుర్తింపు కోసం చేసే పోరాటం ఈ నవలలో ప్రధానంగా వ్యక్తమవుతాయి. నిశ్శబ్దమైన భాషలో తీవ్రమైన బాధను చెప్పగల గూర్నా రచనా శైలి ఈ పుస్తకాన్ని విశిష్టంగా నిలబెట్టింది. అదే విధంగా కవి–రచయిత ఓషన్ వుఒంగ్ రచించిన 'ది ఎంపెరర్ ఆఫ్ గ్లాడ్‌నెస్' ఈ ఏడు సాహిత్యంలో భావోద్వేగాల పరాకాష్టగా నిలిచింది. ప్రేమ, జ్ఞాపకాలు, వలస జీవితం, లైంగిక గుర్తింపు వంటి అంశాలను కవితాత్మక గద్యంతో మేళవిస్తూ ఈ నవల వ్యక్తిగత అనుభవాన్ని విశ్వానుభూతిగా మార్చుతుంది. ఆధునిక సాహిత్యం ఎంత సున్నితంగా, ఎంత లోతుగా మాట్లాడగలదో ఈ రచన స్పష్టంగా చూపిస్తుంది. కేటీ కిటామురా రచించిన 'ఆడిషన్' కూడా విశేష చర్చకు దారితీసిన నవల. న్యూయార్క్ నగర నేపథ్యంగా సాగిన ఈ కథలో సంబంధాలు, నటన, నిజం–అబద్ధం మధ్య ఉన్న సరిహద్దులు మసకబారుతాయి. మానవ జీవితం కూడా ఒక వేదికపై జరుగుతున్న ప్రదర్శనలా మారుతున్న సమకాలీన పరిస్థితిని ఈ నవల ప్రతిబింబిస్తుంది. ఈ ఏడాది అవార్డుల పరంగా కూడా ప్రపంచ సాహిత్యం గొప్ప కదలికను చూసింది. అంతర్జాతీయ బుకర్ బహుమతి అనువాద సాహిత్యానికి మరింత గౌరవాన్ని తీసుకొచ్చింది. ముఖ్యంగా దక్షిణాసియా సాహిత్యానికి వచ్చిన గుర్తింపు ప్రపంచ సాహిత్యంలో కొత్త స్వరాలు ఎంత కీలకమో నిరూపించింది. అదే సమయంలో గుడ్‌రీడ్స్ వంటి పాఠకుల ఆధారిత అవార్డులు ప్రజాదరణ పొందిన నవలలను ముందుకు తెచ్చాయి. ప్రేమకథలు, చారిత్రక కథనాలు, నాన్‌ఫిక్షన్ రచనలు ఈ ఏడాది విస్తృతంగా పాఠకులను ఆకర్షించాయి. ఈ ఏడు ప్రపంచ సాహిత్యం ఒక స్పష్టమైన లక్షణాన్ని చూపిస్తుంది. అది ఏకైక సిద్ధాంతానికి లేదా ఒకే శైలికి పరిమితం కాలేదు. భిన్న దేశాలు, భిన్న భాషలు, భిన్న అనుభవాలు ఒకే సాహిత్య ప్రవాహంలో కలిసాయి. అనువాదాలు కీలక పాత్ర పోషించాయి. స్థానిక కథలు గ్లోబల్ అనుభూతులుగా మారాయి. రచయితలు వినోదం కంటే బాధ్యతను, ఉపరితల కథల కంటే లోతైన ప్రశ్నలను ముందుకు తెచ్చారు. ఇటీవలి ప్రపంచ సాహిత్యం మన కాలాన్ని అర్థం చేసుకునే ఒక మేధో పత్రికలా నిలుస్తుంది. ఈ పుస్తకాలు మనలను ఆలోచింపజేస్తాయి, మన అనుభవాలను ప్రశ్నిస్తాయి, మన భవిష్యత్తుపై కొత్త దృష్టిని కలిగిస్తాయి. చదువుతున్న ప్రతి ఒక్కరికీ 2025 సాహిత్యం ఒక మేధస్సు ప్రయాణంగా నిలిచిందని చెప్పవచ్చు.



ఈ ఏడాది ప్రపంచ సాహిత్యాన్ని మార్క్సిస్టు దృక్పథంలో పరిశీలించినప్పుడు, అది కేవలం సృజనాత్మక రచనల సమాహారం మాత్రమే కాకుండా, నేటి గ్లోబల్ మూలధన వ్యవస్థకు అద్దం పట్టిన సాంస్కృతిక పత్రంగా కళ్ల ముందు నిలుస్తుంది. ఉత్పత్తి విధానాల్లో జరిగిన మార్పులు, కార్మిక జీవితం మీద పెరిగిన ఒత్తిడి, వలసలు, అసమానతలు, గుర్తింపు రాజకీయాలు వంటి ఎన్నో అంశాలు సాహిత్యంలో స్పష్టమైన వర్గ చైతన్య సంకేతాలుగా వ్యక్తమయ్యాయి. మార్క్స్ చెప్పినట్టు, సామాజిక స్థితి మానవ చైతన్యాన్ని నిర్ణయిస్తుంది అన్న భావన ఈ ఏడాది రచనల్లో కొత్త రూపంలో ప్రతిఫలించింది. ఈ ఏడాది వచ్చిన అనేక నవలలు వ్యక్తిగత జీవిత కథలుగా కనిపించినా, వాటి లోతుల్లో వర్గ సంబంధాలు, శ్రమ–మూలధనం మధ్య పెరుగుతున్న ఉద్రేకం బలంగా దర్శనమిస్తుంది. ఉదాహరణకు, అబ్దుల్‌రాజక్ గూర్నా రచించిన 'థెఫ్ట్' నవల వలస పాలన అనంతర సమాజంలో పేద ప్రజలు ఎదుర్కొనే దోపిడీని, ఆర్థిక అస్థిరతను చిత్రిస్తుంది. వ్యక్తిగత నష్టాలుగా కనిపించే సంఘటనలు వాస్తవానికి సామాజిక నిర్మాణాల ఫలితాలని ఈ రచన బలంగా సూచిస్తుంది. ఇది మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ముఖ్యమైన భావన అయిన 'వ్యక్తిగతం కూడా రాజకీయమే' అన్న సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. అదేవిధంగా ఓషన్ వుఒంగ్ రచించిన 'ది ఎంపెరర్ ఆఫ్ గ్లాడ్‌నెస్' వ్యక్తిగత జ్ఞాపకాలు, ప్రేమ, శోకాన్ని కేంద్రీకరించినప్పటికీ, దాని నేపథ్యం వలస కార్మిక వర్గ జీవితమే. అమెరికన్ మూలధన వ్యవస్థలో ఆసియా వలసదారులు అనుభవించే అస్థిర ఉపాధి, సాంస్కృతిక వేరుపాటు, భౌతిక భద్రత లేకపోవడం ఈ నవలలో అంతర్లీనంగా నడుస్తాయి. ఇది ఆధునిక సాహిత్యంలో ప్రబలమైన 'నియోలిబరల్ ఒంటరితనం' అనే అంశానికి ప్రతిబింబంగా నిలుస్తుంది. ఫిలిప్ పుల్‌మన్ రచించిన 'ది రోజ్ ఫీల్డ్' వంటి ఫాంటసీ రచనల్ని కూడా మార్క్సిస్టు కోణంలో చదవవచ్చు. అధికార వ్యవస్థలు, జ్ఞానంపై నియంత్రణ, ప్రజలపై సంస్థాగత ఆధిపత్యం వంటి అంశాలు ఈ నవలలో రూపకాలుగా కనిపిస్తాయి. ఇది గ్రామ్‌్సీ చెప్పిన 'సాంస్కృతిక హెగెమనీ' భావనకు దగ్గరగా ఉంటుంది. అధికార వర్గాలు ఎలా ఆలోచనల ద్వారా, నైతిక విలువల ద్వారా ప్రజలను నియంత్రిస్తాయో ఈ కథ ఊహాజనిత ప్రపంచంలో చూపిస్తుంది. ఈ ఏడాది ప్రపంచ సాహిత్యంలో మరో ముఖ్యమైన లక్షణంగా అనువాద సాహిత్యానికి పెరిగిన ప్రాధాన్యతను పేర్కోవచ్చు. పాశ్చాత్య కేంద్రిత సాహిత్య ఆధిపత్యానికి సవాళ్లు మొదలయ్యాయి. ఇది ప్రపంచ సాహిత్యంలో ఒక రకమైన ప్రజాస్వామ్య విస్తరణగా చూడవచ్చు. మార్క్సిస్టు దృష్టిలో ఇది సాంస్కృతిక ఉత్పత్తి సాధనాలపై ఉన్న ఏకపక్ష నియంత్రణకు వచ్చిన చిన్న పగుళ్లుగా భావించవచ్చు. అయితే ఈ గుర్తింపు కూడా అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఎంపిక ఉంటుందనే విమర్శ లేకపోలేదు. ఈ సంవత్సరంలో వచ్చిన అనేక రచనలు పని అనే భావనను కొత్తగా నిర్వచించాయి. గిగ్ ఎకానమీ, తాత్కాలిక ఉద్యోగాలు, డిజిటల్ శ్రమ, అల్గోరిథమ్ ఆధిపత్యం వంటి అంశాలు కథల రూపంలో వ్యక్తమయ్యాయి. శ్రమ అనేది ఫ్యాక్టరీ గోడల మధ్య మాత్రమే కాకుండా, మనసు, భావాలు, సృజనాత్మకత వరకు విస్తరించిందన్న భావన ఈ రచనల్లో కనిపిస్తుంది. ఇది మార్క్స్ పేర్కొన్న 'వస్తు పరమైన పరాయీకరణ' ఆధునిక రూపానికి సంకేతం. స్థూలంగా చెప్పాలంటే, ప్రపంచ సాహిత్యం విప్లవాత్మక నినాదాలతో కాకపోయినా, మౌనంగా మూలధన వ్యవస్థలోని విరోధాలను బయటపెట్టింది. ఇది ప్రత్యక్షంగా విప్లవాన్ని పిలుపునివ్వదు. కానీ, జీవన వాస్తవాలను నిజాయితీగా చూపిస్తూ పాఠకుడిలో ప్రశ్నలను రేపుతుంది. మార్క్సిస్టు దృక్పథంలో ఇది ఒక అంతర దశ సాహిత్యం. పూర్తిస్థాయి ప్రతిఘటన సాహిత్యం కాకపోయినా, వర్గ చైతన్యానికి బీజాలు వేసే సాహిత్యంగా దీన్ని చూడవచ్చు. అందువల్ల 2025 ప్రపంచ సాహిత్యం మార్క్సిస్టు విశ్లేషణలో ఒక ముఖ్యమైన దశగా నిలుస్తుంది. ఇది మూలధన వ్యవస్థ విజృంభిస్తున్న కాలంలో, మానవ అనుభవాన్ని వస్తువుగా మార్చుతున్న పరిస్థితుల్లో, సాహిత్యం ఇంకా ప్రతిఘటనకు అవకాశం ఉందని నెమ్మదిగా, లోతుగా చెప్పిన సంవత్సరం అని నిర్ధారించవచ్చు. ఇలా, ప్రపంచ సాహిత్యంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులు తెలుగు సాహిత్యంపైనా స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రత్యేకంగా సామాజిక అసమానతలు, రాజకీయ చైతన్యం, ఆధునికతపై ప్రశ్నలు తెలుగు రచనల్లో కూడా బలమైన ముద్ర వేస్తున్నాయి. సాహిత్యం అంటే ఒక అద్దం కాదు.. ఒక ప్రశ్న అనే భావన పెరిగింది. ఒక పోరాటం.. ఒక మేధో మధనం.. ఒక నిత్య ప్రయోగం అనే ఆలోచనలు పెరుగాయి. ప్రస్తుత కాలాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం జోరందుకుంది. భవిష్యత్తును ఊహించే ధైర్యం రచనల్లో మెరుస్తోంది.

– బిఎల్


## గ్లోబల్ క్యాపిటలిజం దృక్పథంలో...

ప్రపంచ సాహిత్యాన్ని గ్లోబల్ క్యాపిటలిజం దృక్పథంలో పరిశీలించినప్పుడు, అది మన కాలానికి చెందిన ఒక సామాజిక–ఆర్థిక పత్రంలా కనిపిస్తుంది. ఈ ఏడాది వెలువడిన నవలలు, కథలు, స్మృతిరచనలు ప్రపంచ మార్కెట్ ఆధిపత్యం, కార్పొరేట్ సంస్కృతి, అస్థిర ఉపాధి, వలస శ్రమ, డిజిటల్ జీవితం వంటి అంశాలను ప్రత్యక్షంగా కాకపోయినా, అంతర్లీనంగా బలంగా ప్రతిబింబించాయి. సాహిత్యం ఇక కేవలం సౌందర్య అనుభూతి మాత్రమే కాకుండా, మూలధన వ్యవస్థ మానవ జీవితాన్ని ఎలా ఆక్రమిస్తుందో చూపించే ఒక విమర్శాత్మక సాధనంగా మారింది. గ్లోబల్ క్యాపిటలిజం యొక్క ముఖ్య లక్షణం ప్రపంచాన్ని ఒకే మార్కెట్‌గా మార్చడం. 2025 సాహిత్యంలో ఇది కథా నిర్మాణాల్లో, పాత్రల జీవితాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. రచయితల కథలు తరచుగా దేశ సరిహద్దులను దాటుతాయి. ఒక దేశంలో పుట్టిన పాత్ర మరొక దేశంలో పని చేస్తుంది.. మూడవ దేశ సంస్కృతిలో జీవిస్తుంది. ఈ అంతర్జాతీయ కదలిక స్వచ్ఛందం కాదు.. అది జీవన అవసరాల వల్ల, ఉపాధి ఒత్తిడుల వల్ల ఏర్పడిన వలస. ఈ వలస అనుభవం వ్యక్తిగత విషాదంగా కనిపించినా, దాని వెనుక ప్రపంచ కార్మిక విభజన వ్యవస్థ ఉందన్న సత్యాన్ని సాహిత్యం స్పష్టంగా సూచిస్తుంది. మరోవైపు నేటి సాహిత్యంలో 'పని' అనే పదానికి అర్థం క్రమంగా మారుతున్నది. గ్లోబల్ క్యాపిటలిజంలో శ్రమ స్థిరమైనది కాదు... అది తాత్కాలికం. ఒప్పందాలపై ఆధారపడినది. నిరంతర భద్రత లేనిది. 2025లో వచ్చిన అనేక నవలల్లో పాత్రలు స్థిర ఉద్యోగాలు కాకుండా, గిగ్ పనులు, ఫ్రీలాన్స్ పనులు, డిజిటల్ సేవలపై ఆధారపడతాయి. ఇది కార్మికుడిని వ్యక్తిగా కాకుండా, సేవల ప్యాకేజీగా మార్చే మూలధన తర్కానికి సంకేతం. ఈ పరిస్థితిలో శ్రమ విలువ కంటే వేగం, లాభం, అల్గోరిథమ్ నిర్ణయాలే ముఖ్యమవుతాయి. సోషల్ మీడియా, డేటా, ఆన్‌లైన్ గుర్తింపులు కథల నేపథ్యంగా మాత్రమే కాకుండా, పాత్రల అంతర్గత జీవితాన్ని నియంత్రించే శక్తులుగా కనిపిస్తాయి. వ్యక్తి భావాలు కూడా మార్కెట్‌కు అనుగుణంగా మారుతున్నాయనే భావన ఈ రచనల్లో వ్యక్తమవుతుంది. ప్రేమ, స్నేహం, ఒంటరితనం కూడా వినియోగ సంస్కృతిలో భాగమవుతున్నాయని ఈ సాహిత్యం సూచిస్తుంది. ఇది గ్లోబల్ క్యాపిటలిజం మానవ అనుభూతులను కూడా వస్తువులుగా మార్చే స్థాయికి చేరిందన్న వాస్తవాన్ని బయటపెడుతుంది. 2025 సాహిత్యంలో గమనించాల్సిన మరో ముఖ్యమైన కోణం అసమానత. ప్రపంచం అభివృద్ధి చెందుతున్నట్టు కనిపించినా, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతుందన్న నిజం కథల రూపంలో ప్రతిఫలించింది.


విలాస జీవితం గడి పే నగరాలు ఒకవైపు ఉంటే, అదే నగరాల్లో కనిపించని శ్రమజీవుల జీవితం మరోవైపు ఉంటుంది. ఈ విరుద్ధతలు కథలలో మౌనంగా ఉన్నా, తీవ్రంగా పనిచేస్తాయి. గ్లోబల్ క్యాపిటలిజం ఎలా అసమానతను సహజంగా మారుస్తుందో 2025 సాహిత్యం ప్రశ్నిస్తుంది. సాహిత్య ఉత్పత్తి కూడా గ్లోబల్ క్యాపిటలిజం ప్రభావం నుంచి త ప్పించుకోలేకపోతున్నదనే చేదు వాస్తవాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. 2025లో ఏ పుస్తకం అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందుతుందన్నది మార్కెట్ నిర్ణయాలపై ఎక్కువగా ఆధారపడింది. అనువాదాలు పెరిగినా, అవి కూడా ప్రపంచ పఠన మార్కెట్ అభిరుచులకు అనుగుణంగా ఎంపిక జరుగుతున్నదనే విమర్శ ఉంది. ఈ సందర్భంలో సాహిత్యం కూడా ఒక వస్తువు గా మారిన పరిస్థితిని ఈ ఏడాది స్పష్టంగా చూపిస్తుంది. అయితే అదే సమయంలో, ఈ వ్యవస్థలో నుంచే విమర్శాత్మక స్వరాలు పుట్టడం ఒక ముఖ్యమైన విరోధాభాసం. ఏది ఏమైనా, ఇప్పటి సాహిత్యం గ్లోబల్ క్యాపిటలిజాన్ని నేరుగా ఖండించకపోయినా, దాని ప్రభావాలను మానవ జీవితాల ద్వారా బహిర్గతం చేసింది. ఇది పెద్ద సిద్ధాంత నినాదాల కంటే, చిన్న జీవితాల కథల ద్వారా వ్యవస్థాత్మక అన్యాయాన్ని చూపించింది. ఈ విధంగా 2025 సాహిత్యం గ్లోబల్ క్యాపిటలిజం యు గంలో సాహిత్యం ఇంకా విమర్శాత్మక పాత్రను పోషించగలదన్న నమ్మకాన్ని బలపరుస్తుంది. కాబట్టి, సాహి త్యం, గ్లోబల్ క్యాపిటలిజం అనే కోణం మనకు ఒక ము ఖ్యమైన అవగాహనను కలిగిస్తుంది. అది ఏమిటంటే, ప్రపంచ మార్కెట్ ఎంత విస్తరించినా, మానవ అనుభవం ఇంకా పూర్తిగా వశం కాలేదన్న సత్యం. ఆ అనుభవాన్ని కథలుగా, భావాలుగా నిలబెట్టే ప్రయత్నమే నేటి సాహిత్యపు అసలైన విలువ.

## చదవాల్సిన పుస్తకం

# మానసిక సంఘర్షణల 'చరిత్రహీనులు'




శరత్ చంద్ర చటోపాధ్యాయుడు 1917లో రచించిన 'చరిత్రోహిన్' (తెలుగులో చరిత్రహీనులు పేరుతో బొందలపాటి శివరామకృష్ణ అనువదించారు) బెంగాలీ సమాజంలో స్త్రీలపై మోపబడే నైతిక ముద్రలపై గాఢమైన సామాజిక–మనో విశ్లేషణ. ఈ నవల వెలువడిన తర్వాత శరత్ చంద్రుడు స్త్రీ హక్కుల పక్షపాతిగా, సంప్రదాయాల పేరుతో జరిగే అన్యాయాల్ని ప్రశ్నించిన రచయితగా స్థిరపడ్డాడు. ఈ కథ 20వ శతాబ్దం ఆరంభంలోని బెంగాలీ హిందూ సమాజాన్ని నేపథ్యంగా తీసుకుని సాగుతుంది. ఇక్కడ సావిత్రి, కిరణ్మయి ప్రధాన పాత్రలు కాగా, సూరబాల, సరోజిని ఉప పాత్రలు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... నలుగురినీ సమాజం చరిత్రహీనం అని అనుమానిస్తే గానీ, వాస్తవంగా నలుగురి జీవనాలు, స్వభావాలు, పరిస్థితులు పూర్తిగా భిన్నమైనవి. సావిత్రి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన విధవ. బంధువుల మోసం వల్ల ఇంటి నుంచి వెళ్లగొట్టబడి, సమాజం తక్కువగా చూసే పనులు చేయాల్సి వస్తుంది. అయినా ఆమె వ్యక్తిత్వం పూర్తిగా పవిత్రమైనదిగా శరత్ చంద్రుడు స్పష్టం చేస్తాడు. సతీశ్‌పై ఆమెకు ఉన్న ప్రేమ మాటల్లో కాదు, త్యాగంలో వ్యక్తమవుతుంది. ఈ మౌన ప్రేమే చివరికి ఇద్దరినీ అశీలులు అన్న ఆరోపణల దాకా నెట్టేస్తుంది. సావిత్రి కాశీకి వెళ్లిపోవడం, సతీశ్ అంతర్గత వేదన— స్త్రీ గౌరవాన్ని కాపాడడంలో పురుషుడు ఎంత అశక్తుడో చూపిస్తాయి. కిరణ్మయి ఈ నవలలో అత్యంత సంక్లిష్టమైన పాత్ర. అపూర్వ సౌందర్యం, తర్కబుద్ధి, తిరుగుబాటు స్వభావం ఉన్న ఆమె, భర్త నిర్లక్ష్యం మరియు అత్త వేధింపుల వల్ల భావోద్వేగంగా నలిగిపోతుంది. అణచివేయబడిన కోరికలు, అతిశయమైన ఆత్మగౌరవం చివరికి ఆమెను మానసిక విపథం వైపు నడిపిస్తాయి. కిరణ్మయి పతనం వ్యక్తిగత దోషం కంటే, కుటుంబ–సమాజ వ్యవస్థల వైఫల్యంగా కనిపిస్తుంది. సూరబాల అంధ విశ్వాసంతో కూడిన పతివ్రత; సరోజిని పాశ్చాత్య విద్య పొందిన ఆధునిక యువతి. వీరిద్దరూ స్త్రీలపై ఉన్న రెండు విభిన్న సామాజిక అంచనాలను సూచిస్తారు. సరోజిని–సతీశ్ సంబంధం స్పష్టత లేనిదిగా మిగిలిపోవడం, ప్రేమ–వివాహాల విషయంలో అప్పటి సమాజపు అయోమయాన్ని ప్రతిబింబిస్తుంది. పురుష పాత్రలు.. సతీశ్, ఉపేంద్ర, దిబాకర్— స్త్రీల జీవితాలపై ప్రభావం చూపుతాయి గానీ, ఎక్కువ సందర్భాల్లో అవే వారికి హానికరం. స్త్రీ మనస్సు లోతును గ్రహించలేని, సంప్రదాయ బంధనాల్లో చిక్కుకున్న పురుషుల ప్రతిరూపాలుగా వీరు నిలుస్తారు. ముఖ్యంగా దిబాకర్–కిరణ్మయి సంబంధం, అపరిపక్వ భావోద్వేగాలు ఎలా విధ్వంసానికి దారితీస్తాయో చూపిస్తుంది. నవల ముగింపులో అన్ని స్త్రీలకూ ఒక విధమైన నైతిక విముక్తి లభిస్తుంది. సావిత్రి దేవీసమానంగా గుర్తింపు పొందుతుంది. కిరణ్మయి బాధలకు కనీస అవగాహన కలుగుతుంది. సరోజినికి వివాహ హామీ లభిస్తుంది; సూరబాల సతీశ్, ఉపేంద్రలకు కళ్లుతెరిపిస్తుంది. ఇది శిక్షకన్నా కరుణ, తీర్పుకన్నా అవగాహన ముఖ్యమని రచయిత చెబుతున్న సంకేతం. బ్రిటిష్ ప్రభావంతో వచ్చిన పాశ్చాత్య ఆలోచనలు.. సనాతన హిందూ సంప్రదాయాల మధ్య సంఘర్షణను శరత్ చంద్రుడు వాస్తవికంగా చిత్రించాడు. చరిత్ర అనేది స్త్రీకి మాత్రమే కొలమానం ఎందుకు అవుతుందన్న ప్రశ్న ఈ నవల అంతటా ప్రతిధ్వనిస్తుంది. ఈ రచన ఆధారంగా 1982లో దూరదర్శన్‌లో 'చరిత్రహీన్' టీవీ సీరియల్ ప్రసారమైంది. 2018లో స్వస్తిక ముఖర్జీ నటించిన బెంగాలీ వెబ్ సిరీస్ కూడా రూపొందింది. ఇవి ఈ నవల యొక్క కాలాతీత ప్రాసంగికతకు నిదర్శనాలు. మొత్తంగా, 'చరిత్రోహిన్' స్త్రీ పతనం కథ కాదు; సమాజపు ద్వంద్వ నైతికతపై వేసిన పదునైన ప్రశ్న. శరత్ చంద్రుడి మానవతావాద దృష్టి ఈ నవలను భారతీయ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిపింది.



### పుస్తకం పేరు

**చరిత్రహీనులు**

రచయిత: శరత్ చంద్ర చటోపాధ్యాయుడు
వెల: రూ. 350
అనువాదం: బొందలపాటి శివరామకృష్ణ

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

ఈ వారం కవితలు

## ఉద్యమాల ఉత్తుంగ తరంగం

ఉద్యమాల ఉత్తుంగ తరంగం,
ఉరాజ్యాన్ని గొంతెత్తి ప్రశ్నించిన
వీరంగం, పడకేసిన ప్రజా సంఘాలకు
నడక నేర్పిన కొదమసింహం,
'ఆయనే కామ్రేడ్ నరసింహారెడ్డి,
ఇక మరిచిపోదు నిన్ను, మన కామారెడ్డి.

కమ్యూనిస్టులకు ఆక్సిజన్‌గా..
ప్రాతినిధ్యాలతో ప్రజల్లో చైతన్యాన్ని
నింపిన, మడమ తిప్పని పోరాట
యోధునివి... లెఫ్ట్ ఉద్యమాల కథా
నాయకునివి. 'సలాం పేదల పెద్దన్నా,
లాల్ సలాం నరసన్నా'.

పేదల సమస్యలే కేంద్రంగా.. వాస్తవాలే
ప్రాతిపదికగా.. వ్యాపార వాదనలను
తిప్పికొడుతూ.. నిజాల నిగ్గు తేల్చిన
మానవతావాదివి...న్యాయవాదివి...
'సలాం...పేదల పెద్దన్నా..
లాల్ సలాం.. నర్సన్నా.'

ఆదమరిచి నిద్రిస్తున్న
కామ్రేడ్‌లను మేలుకొలిపి, ఫణిహారం
రంగాచారికి ప్రాణం పోశావు,
మరుగున పడ్డ చరిత్రను
తిరగరాశావు,'ఆయనే, కామ్రేడ్
నర్సింహా రెడ్డి, ఇక మరువదు నిన్ను
మన కామారెడ్డి'

ఆక్రమిత కామారెడ్డి క్లబ్, కాలేజీ స్థల
వివాదం, గోదావరి జలాల మళ్లింపు,
సారా నిషేధ పోరాటము, అశ్లీల పోస్టర్ల
నిషేధము, రైతుల ఆత్మహత్యలు,
విద్యారంగ సమస్యలు, తెలంగాణ
పోరాటము, వెరసి...

ఉవ్వెత్తున ఎగిసిపడే ఉద్యమాలకు
ఊపిరివై, ప్రజల్లో చైతన్యాన్ని నింపావు,
హక్కులకై కనబడుతూ...
బాధ్యతలకు నిలబడ్డావు, మీ అమరత్వం
ఇక వృథా కాదు.. 'ఆయనే కామ్రేడ్
నర్సింహా రెడ్డి.. ఇక మరువదు నిన్ను
మన కామారెడ్డి'. 'సలాం.. పేదల
పెద్దన్నా... లాల్ సలాం... నర్సన్నా.'

– కందుకూరి శ్రీనివాస్

## పోరాటలతోనే పురుడు పోసుకున్న పార్టీ

పోరాటలతోనే పురుడు పోసుకున్న పార్టీ రా
వంద ఏళ్ల చరిత ఉన్న పోరాట పార్టీ రా
జనం గుండెల్లో నిలిచి ఉన్న కమ్యూనిస్టు పార్టీ రా
సిపిఐ సిపిఐ సిపిఐ రా
అదే భారత కమ్యూనిస్టు పార్టీ రా

బాంచెను దొరా అన్న చేత బందూకును పట్టించి
దోపిడీల గురుతులైనా దొర గడులను కూల్చేసి
రజాకర్ నిజాం భారత సైన్యంకు కూడా
ఎదురొడ్డి నిలబడి లక్షల ఎకరాలు పంచిన
వీర తెలంగాణ పోరాటం నడిపిన
సిపిఐ సిపిఐ సిపిఐ రా అ
దే భారత కమ్యూనిస్టు పార్టీ రా

బొంబాయి అహ్మదాబాద్ పారిశ్రామిక నగరాలన్నింట
కార్మికులను కూడ గట్టి సమ్మెలెన్నో నిర్వహించి
హక్కులను వసతులను కార్మికుల ఐక్యతను సాధించి
స్వాతంత్ర్య ఉద్యమానికి కార్మిక బాసటను
కల్పించిన పోరాట పార్టీ రా
సిపిఐ సిపిఐ సిపిఐ రా
అదే భారత కమ్యూనిస్టు పార్టీ రా

భూ పోరాట లెన్నో చేసి భూములెన్నో పంచింది.
నగరాల్లో పట్టణాల్లో నీడ లేని పేదలకై
పోరాట లెన్నో చేసి ఇళ్ల జాగలేన్నో పంచింది
పోరాటలతోనే పురుడు పోసుకున్న పార్టీ రా
పోరాటలే ఊపిరిగా బతుకుతున్న పార్టీ రా
సిపిఐ సిపిఐ సిపిఐరా
అదే భారత కమ్యూనిస్టు పార్టీ

హక్కులకు భంగమస్తే పక్షి లాగా వాలుతుంది
ప్రజల అక్కరలు తెలుసుకొని ఉద్యమాలు నిర్మిస్తుంది
ప్రగతి వాద శక్తులను ఒక్క తాటిపైకి తెచ్చి
దేశాన్ని పాసిజం నుంచి కాపాడగ పూనుకున్న పార్టీరా
సిపిఐ సిపిఐ సిపిఐరా అదే భారత కమ్యూనిస్టుపార్టీరా
పోరాటాలతోనే పురుడు పోసుకున్న పార్టీ రా
పోరాటలే ఊపిరిగా బతుకుతున్న పార్టీ రా

–'నిధి'



## ఎర్రకోటపై ఎగరాలి ఎర్రజెండా

ఎర్రకోటపై ఎగరాలి ఎర్రజెండా
ఎగరాలి ఎగరాలి మా ఎర్రజెండా
వందేళ్ళ త్యాగాల ఘనకీర్తి మా ఎర్రజెండా
॥ఎగరాలి॥

స్వాతంత్ర్య సంగ్రామ రణభేరి మా ఎర్రజెండా
నైజామ్ సర్కారునే మట్టికరిపించిన
సాయుధ సంగ్రామ ధీర నా ఎర్రజెండా
॥ఎగరాలి॥

దొరలు జమీందారులు భూస్వామ్య వర్గాలపై
పోరుచేసింది మా ఎర్ర జెండా
లక్షల ఎకరాల భూమి పేదలకు పంచింది నా ఎర్రజెండా
॥ఎగరాలి॥

గనులు కార్ఖానాలు కర్మాగారాల్లో
కార్మిక సంఘాల పెట్టింది మా ఎర్రజెండా
కార్మికులకు హక్కులు సాధించి పెట్టింది మా ఎర్రజెండా
॥ఎగరాలి॥

విద్యార్థి యువకుల వెన్నుతట్టింది నా ఎర్రజెండా
నిరుద్యోగ రక్కసిపై పోరుచేసింది నా ఎర్రజెండా
॥ఎగరాలి॥

సామ్రాజ్య వాదులు మతోన్మాదులు ఒక్కటై
వస్తున్నరమ్మ ఓ ఎర్రజెండా
వాళ్లకి ఎదురొడ్డి పోరాడి గెలవాలి మా ఎర్రజెండా
॥ఎగరాలి॥

ఎగరాలి ఎగరాలి మా ఎర్రజెండా
ఎర్రకోటపై నువ్వు ఎగరాలి మా ఎర్రజెండా
॥ఎగరాలి॥

ఎగరాలి ఎగరాలి మా ఎర్రజెండా
భరత ఖండంపై సమతారాజ్యంబు
సాధించుదాకా ఎగరాలి మా ఎర్రజెండా

– బొమ్మగాని నాగభూషణం
ఉపాధ్యక్షుడు తెలంగాణ అరసం

## ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం రోజున కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని వర్ధన్నపేట శాసన సభ్యులు కే.ఆర్ నాగరాజు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు ఆవిష్కరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏం.ఎల్.ఏ కె.ఆర్ నాగరాజు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎంతోమంది గొప్ప నాయకులను తయారు చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి బడుగుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచినా పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బొచ్చు చందర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల త్యాగాలను ఈ దేశ ప్రజలు ఎప్పుడు మరువరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బొచ్చు చందర్, సుధాకర్ రెడ్డి, ఈవి శ్రీనివాసరావు, యాదగిరి, బాలరాజ్, కృష్ణమూర్తి, సోమయ్య, రామస్వామి, కిషోర్, పాల్గొన్నారు.

## మేడారానికి పోటెత్తిన భక్తులు

**ప్రజాపక్షం/ములుగు:** ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తుల రద్దీ పోటెత్తింది. జాతరకు ఇంకా నెల రోజుల సమయం ఉన్నప్పటికి, వేలాదిగా భక్తులు ముందుగానే మేడారానికి తరలివచ్చి వనదేవతలను దర్శించుకన్నారు. మేడారం మహా జాతర 2026 జనవరి 28 నుండి 31 వరకు జరగనున్న నేపథ్యలో జాతరకు నెల రోజుల ముందే జాతర సందడి మొదలయ్యింది. ఉదయం నుండే మేడారం వెళ్లే ప్రధాన రహదారులపై వాహనాలు బారులు తీరాయి. ములుగు జిల్లా కేంద్రంలోని ఘట్టమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకున్న భక్తులు అక్కడి నుండి మేడారం బాట పట్టారు. కార్లు, ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలతో రహదారులు కిక్కిరిసిన దృశ్యం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్న క్రమంలో పనులు కొనసాగుతూనే ఉండగా భక్తుల రద్దీ మరింత పెరిగింది. గ్రామాల నుండి కుటుంబాలతో తరలివచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

## ఆర్టిజన్ కార్మికుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లండి

ఎమ్మెల్యే సాంబశివరావుకు ఆర్టిజన్‌ల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/గణపురం:** విద్యుత్ కేంద్రాలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువెళ్లాలని ఆదివారం కొత్త గూడెం, ఎమ్మెల్యే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ హెచ్64 యూనియన్ ఆర్టిజన్ కార్మికుల వినతి పత్రం అందించారు. గత 9 ఏళ్లుగా ఆర్టిజన్ కార్మికులు విద్యుత్ సంస్థ లలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారిని రెండో శ్రేణి కార్మికులు గా చూస్తున్నారన్నారు. వారిని రెగ్యులర్ పోస్ట్ లలో వారి వారి అర్హతల ఆధారంగా కన్వర్షన్ చేయాలని, విజ్ఞప్తి చేశారు. ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింప జేయాలనీ, గ్రేడ్ చేంజ్ చేయాలని, ఈపిఎఫ్ సీలింగ్ ఎత్తి వేయాలని, జెన్కో లో పనిచేస్తున్న వారికీ క్వార్టర్ సౌకర్యం కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానం గా లీవ్ బెనిఫిట్ ఇప్పించాలని, హెల్త్ కార్డు లో రోబోటిక్ ట్రీట్మెంట్ కు అవకాశం కల్పించాలని వినతి పత్రం అందించారు. ఈ సమావేశం లో ఏఐటీయూసీ హెచ్ 64 రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు అల్లం ఓదెలు, ఉపాధ్యక్షులు కుంట మహేందర్, రాష్ట్ర నాయకులు, యాదండ్ల దేవేందర్, రీజినల్ అధ్యక్షులు కోల శ్యామ్, రీజినల్ కార్యనిర్వాహక అధ్యక్షులు సిరిగినేని ధర్మారావు, రీజినల్ కార్యవర్గ సభ్యులు మేకల రాజ్ కుమార్, ఎండి సమీర్, చిట్టెపు అశోక్ రెడ్డి, బండారి నగేష్, అల్లం వేణు, బండి రాజు, సందీప్ గూడెపు సుధాకర్ పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో పెద్దపులి కలకలం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు సమాచారం అందిందని జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. జిల్లా లోని చిట్యాల మండలం జడలపేట శివారు భీష్మ నగర్ ప్రాంతంలో పెద్దపులి ఎద్దుపై దాడి చేసి చంపిన ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ ఘటన నేపథ్యంలో స్థానిక ప్రజలు భయాందోళన చెందవద్దని జిల్లా ఎస్పీ ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు రాత్రి సమయాల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఒంటరిగా అడవుల వైపు లేదా పొలాల వైపు వెళ్లవద్దని, పెద్దపులి కదలికలపై అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీసు శాఖ నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు లేదా అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల భద్రతకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని, పరిస్థితి పూర్తిగా నియంత్రణలోకి వచ్చే వరకు అవసరమైన పోలీస్ బందోబస్తు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

## రైల్వే భూనిర్వాసితులకు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



**ప్రజాపక్షం/కాజీపేట :** వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధి చెందడానికి కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ నుండి హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు బిఆర్ భగవాన్ దాస్ మడత కాళిదాస్ ఆశయాలను నెరవేర్చాలని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధించడం జరిగినా నేడు ఉద్యోగాలని గద్దల్లాగా ఇతరులు తన్నుకపోయే పరిస్థితి కాకుండా భూ నిర్వాసితులకు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రైల్వే జేఏసీ నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. జేఏసీ నాయకులు కొండ్ర నర్సింగరావు దేవులపల్లి రాఘవేందర్ నాయకత్వంలో ఆదివారం మెమోరాండం సమర్పించడం జరిగింది. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తూ భూ నిర్వాసితులకు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇతర రాష్ట్రాలలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినప్పుడు స్థానికులకు అవకాశం కల్పించారని, అదే తరహా ప్రత్యేక జీవో తీసుకొచ్చి స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవి, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బిజెపి నాయకులు రంజిత్ రావు, సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చుక్కయ్య, కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మాలోత్ శంకర్, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, భూ నిర్వాసితులు మామిళ్ల బిక్షపతి, ఇలా సాగరం ప్రదీప్, కాయిత కుమార్ రమేష్, దుప్పెల్లి రమేష్, ప్రవీణ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశం కోసం పుట్టిన పార్టీ కాంగ్రెస్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** దేశంలో 141 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ, దేశం కోసం దేశ స్వతంత్రం కోసం ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ కొనియాడారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని స్థానిక ఐఎన్‌టియుసి కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆవిర్భావ వేడుకల్లో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బట్టు కరుణాకర్ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ దేశం కోసం పుట్టిన పార్టీ అని, కాంగ్రెస్ పార్టీకి 141ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందని గుర్తు చేశారు. స్వాతంత్రం కోసం పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీ అంతకుముందే దేశం కోసం ఎంతో శ్రమించిందన్నారు. శాంతియుత పోరాటంతోనే ఏదైనా సాధించవచ్చునని ప్రపంచానికి గొప్ప మెసేజ్ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రాబోయే రోజుల్లో కేంద్రం లో పార్టీని అధికారంలోకి తెచ్చి ప్రజలకు అండదండలుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర కొమురయ్య, మహేష్ రెడ్డి, చల్లూరి సమ్మయ్య,పిప్పాల రాజేందర్, దాట్ల శీను,భువన సుందర్, సాంబమూర్తి, రజినీకాంత్, చల్లా రేణుక, ముంజల రవి, కడారి మాలతి, పద్మ, కురుమిళ్ళ శీను, భౌతి విజయ్, అంబాల శీను, నారాయణ, గురుజాల రవి, పోతర్ల ప్రేమ్ కుమార్, మాట్టేవాడ సురేష్, కిషోర్ రెడ్డి, సమ్మయ్య, రత్నాక, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, జిల్లా వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుండి అమలులోకి "యూరియా యాప్"

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ జిల్లాలో "యూరియా యాప్" సోమవారం నుండి అమలులోకి వస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం కలెక్టరేట్ నుండి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ జూమ్ మీటింగ్ లో జిల్లాలోని వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏలు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూరియా యాప్ నిర్వహణలో వ్యవసాయ శాఖ, ఎరువుల డీలర్ల పాత్రను కలెక్టర్ కూలంకుశంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆండ్రాయిడ్ వర్షన్ స్మార్ట్ ఫోన్ ఉన్న రైతులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో "Fertilizer Booking App" అని టైప్ చేసి యూరియా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సొంత భూమిలో సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు, నాన్‌డీఎస్ రైతులు తమ సెల్ ఫోన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్ ద్వారా లాగిన్ అయి, యాసంగి 202526లో సాగు చేయనున్న పంట వివరాలను నమోదు చేయాలన్నారు. పంట వివరాలు నమోదు చేసిన అనంతరం జిల్లాలోని ఎరువుల డీలర్ల జాబితా, వారి వద్ద అందుబాటులో ఉన్న యూరియా బస్తాల స్టాక్ వివరాలు యాప్‌లో కనిపిస్తాయని, సాగుకు అవసరమైన యూరియాను దఫాల వారీగా బుక్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. యూరియా బుకింగ్ అనంతరం రైతుకు ఒక బుకింగ్ ఐడి నెంబర్ లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఆ బుకింగ్ ఐడి నెంబర్‌తో పాటు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ తీసుకుని తాము యూరియా బుక్ చేసుకున్న డీలర్ వద్దకు వెళ్లి యూరియా పొందవచ్చనన్నారు. అయితే యూరియా స్లాట్ బుకింగ్‌కు సంబంధించిన బుకింగ్ ఐడి కేవలం 24 గంటలపాటు మాత్రమే చెల్లుబాటు అవుతుందని, ఆ తరువాత అది చెల్లదని తెలిపారు. ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఈ యూరియా యాప్‌ను విజయవంతం చేయడంలో రైతులు సహకరించాలని కలెక్టర్ కోరారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు , వాలంటీర్లు రేపటి నుండి క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి, యూరియా యాప్ ద్వారా బుకింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, స్లాట్ బుకింగ్‌లో సహాయకారిగా ఉండాలని ఆదేశించారు. యాప్ ద్వారా యూరియా స్లాట్ బుకింగ్ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అన్ని స్థాయిల అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు.

## ప్రజాదరణ ఆశ్రమాన్ని సందర్శించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల కేంద్రంలోని రేగడి తండా శివారులో ఉన్న ప్రజాదరణ ఆశ్రమాన్ని పంచాయితి రాజ్ శాఖ అండ చైల్డ్ వెల్ఫేర్ శాఖ మంత్రి సీత్క సందర్శించారు. ప్రజాదరణ ఆశ్రమ నిర్వాహకులు గాదె ఇన్నారెడ్డి ఇటీవల అధికారులు అరెస్టు చేయడంతో ప్రజాదరణ ఆశ్రమంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులతో కాసేపు మాట్లాడి మంత్రి భరోసా కల్పించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన పడొద్దని మీకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. మంచిగా చదువుకుని ఉన్నత స్థానంలో నిలవాలని అన్నారు. చైల్డ్ వెల్ఫేర్ శాఖ అధికారులు ఎప్పటికపుడు పర్యవేక్షణ చేస్తారని ఎలాంటి సమస్యలు ఉన్నా వారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఆశ్రమానికి వచ్చిన మంత్రి సీతక్కకు విద్యార్థులు మా డాడి ఎట్లున్నాడు, ఎప్పుడు వస్తున్నారు అని తొందరగా విడిపించాలని కోరడం జరిగింది.

## కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/ములుగు:** రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు ములుగు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎండి చాంద్ పాషా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి హాజరై కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం కొత్త భారతదేశ ఆవిష్కరణకు నాంది అని, పరాయి పాలన సంకెళ్ళ నుండి విముక్తి చేసిన పార్టీ దేశ ప్రజల కోసం పుట్టిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ తెచ్చి పార్టీ, తెలంగాణ ఇచ్చిన పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ములుగు జిల్లా ప్రజలందరికి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు, యూత్ నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ:** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హన్మకొండ డిసిసి భవన్ లో హన్మకొండ డిసిసి అధ్యక్షుడు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర దేశ స్వాతంత్ర్య సమరంలో మొదలై నేటి ప్రజాస్వామ్య పరిరక్షణ వరకు ప్రజల ఆశయాలతో ముడిపడి ఉందని అన్నారు.త్యాగాలు, బలిదానాలు, ప్రజా ఉద్యమాల పునాదులపై నిర్మితమైన కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగిందని స్పష్టం చేశారు.దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి మహానాయకుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు.సామ్యవాద భావజాలంతో ప్రజలకు విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి మౌలిక హక్కులను అందించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతు భరోసా, మహిళల సంక్షేమం, పేదల నివాసం, సామాజిక భద్రతా పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. క్రాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే 141వ ఆవిర్భావ దినోత్సవానికి నిజమైన నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ , హన్మకొండ జిల్లాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్, కొరివి పరమేష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సేవాదల్ నాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్యాగాల పునాది...ప్రజలే లక్ష్యం: ఎమ్మెల్యే



**ప్రనజాపక్షం/నెక్కొండ:** కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి చేసిన ప్రసంగం కార్యకర్తల్లో కొత్త స్ఫూర్తిని నింపింది. త్యాగం, పోరాటం, ప్రజాసేవ అనే మూడు మూల స్తంభాలపై నిలిచిన పార్టీ కాంగ్రెస్ అని ఆయన గర్వంగా పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణ త్యాగాలు చేసిన మహా నాయకుల రక్తసాక్షిగా కాంగ్రెస్ పార్టీ జన్మనిచ్చిందని, దేశానికి స్వేచ్ఛతో పాటు ప్రజాస్వామ్యాన్ని అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. రాజ్యాంగ విలువలు, లౌకికత, సామాజిక న్యాయం అనే ఆశయాలను గుండెల్లో పెట్టుకొని ప్రజల కోసం పోరాడిన చరిత్ర కాంగ్రెస్‌దని భావోద్వేగంగా గుర్తు చేశారు. పేదవాడి ఆకలి తీరాలనే ఆలోచనతో భూసంస్కరణలు, ఆహార భద్రత, ఉపాధిహామీ వంటి విప్లవాత్మక పథకాలను అమలు చేసిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. మహిళలకు గౌరవం, రైతుకు భరోసా, యువతకు అవకాశాలు కల్పించాలనే సంకల్పమే ప్రతి కాంగ్రెస్ ప్రభుత్వానికి మార్గదర్శకమైందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజల కళ్లలో నమ్మకం, హృదయాల్లో ధైర్యం కనిపిస్తోందని దొంతి మాధవరెడ్డి అన్నారు. రైతుకు నీరు, పేదవాడికి ఇల్లు, మహిళకు ఆత్మవిశ్వాసం అందించే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. దేశం ఎటు సాగాలి?ప్రజల భవిత ఎలా ఉండాలి? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పే సిద్ధాంతమే కాంగ్రెస్ అని ఆయన పేర్కొన్నారు. అధికారానికి కాదు..ప్రజల సేవకే కాంగ్రెస్ పుట్టిందని, ప్రతి కార్యకర్త గుండెల్లో ఈ స్ఫూర్తి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఒక వేడుక మాత్రమే కాదని, ప్రజల పక్షాన నిలబడే బాధ్యతను గుర్తు చేసే మహత్తర దినమని దొంతి మాధవ రెడ్డి భావోద్వేగంగా అన్నారు.

## ప్రజల కోసం ఉద్యమించిన ఉద్యమ నేత ధర్మన్న

నేడు ప్రజానేత అమరజీవి 25వ వర్ధంతి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** సిపిఐ ఉమ్మడి జిల్లా నేత, మాజీ సర్పంచ్ ఈ ప్రాంత ఉద్యమ నేత ప్రజా నాయకుడు అమరజీవి ధర్మన్న 25వ వర్ధంతి సభ సోమవారం ఉదయం 10గంటలకు మహబూబాబాద్ కొండపల్లి గోపాల్ రావు నగర్ కాలనీలోని ధర్మన్న స్తూపం వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పార్టీ శ్రేణులు అభిమానులు జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ సహాయ కార్య దర్శులు రేషపల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న పిలుపునిచ్చారు. వర్ధంతి ఏర్పాట్లు సందర్భంగా వారు మాట్లాడుతూ అమరజీవి ధర్మన్న మానుకోట ప్రాంతంలో ఉద్యమ నిర్మాతగా దొరల గఢీలు బద్దలు కొట్టి ప్రజల కోసం ఉద్యమించిన ఉద్యమ నేత అని, నాడు నిరంకుశంగా ప్రభుత్వాలు ప్రజలను ఇబ్బందులు పెడుతుంటే సుమారు 100 కేసులు తనపై పెట్టిన భయపడకుండా పేద ప్రజలకు అండగా నిలబడ్డ ప్రజల మనిషి ధర్మన్న అని ఈ ప్రాంతంలో భూ పోరాటాలు నిర్వహించి వేలాదిమంది బీసీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలకు ఇంటి స్థలాలు పంచిన చరిత్ర ధర్మన్నది అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా దొరలు ఈ ప్రాంతంలో అనగదొక్కాలని చూసినా భయపడకుండా ఈ ప్రాంతంలో దోపిడీ శక్తులకు ఎదురొడ్డి పోరాడిన గొప్ప నాయకుడని, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, కేసముద్రం మండలం కోరుకొండ పల్లి గ్రామ సర్పంచ్ గా అనునిత్యం ప్రజల కోసమే తన జీవితం అంకితం చేశాడని, క్రీడాకారుడిగా, పోరాట యోధునిగా ప్రజల గుండెల్లో ధర్మన్న స్థానం సంపాదించుకున్నాడని వారన్నారు. తన తుది శ్వాస విడిచే వరకు ప్రజల కోసం తపించే గొప్ప నాయకుడు ధర్మన్నని ఈ ప్రాంతంలో ఆ రోజుల్లో వివిధ గ్రామాల్లో సర్పంచులు గెలిపించడమే గాక అణగారిన వర్గాల కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి నేడు మన మధ్యల లేడని ఆయన యాదిలో 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నామని ఈ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్మన్న సోదరులు సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి , సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి పాల్గొంటారని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రను గ్రామీణ ప్రజలకు తెలియజేయాలని ఏఐసీసీ పిలుపుమేరకు రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల తో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని శ్రీనివాస్ టాకీస్ సెంటర్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు బీజేపీ ప్రభుత్వం వికసిత్ భారత్ జి. రామ్. జి పేరుతో కొత్త పథకాన్ని తీసుకోరావాలని కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు ఘనపురపు అంజయ్య, శ్రీధర్, రాజుయాదవ్, పోతురాజు, రవినాయక్, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# 'కళ్లెం లేని' బెల్లం వ్యాపారం!

### సమ్మక్క జాతర ముసుగులో విక్రయాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికారులు చోద్యం



**ప్రజాపక్షం/హనుమకొండ :** జవనరిలో మేడారం జాతర ఉన్న ప్రాముఖ్యత నేపథ్యంలో సమ్మక్కకు కానుకగా సమర్పించే నిలువెత్తు బంగారం (బెల్లం) వ్యాపారం జోరుగా సాగు తోంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా విక్రయాలు కనిపిస్తున్నాయి. బెల్లం వ్యాపారానికి ఉమ్మడి వరంగల్ లోని వరంగల్ అర్బన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలోని వరంగల్ బీట్ బజార్ పెట్టింది పేరు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాలకు ఇక్కడి నుంచే బెల్లం పెద్ద ఎత్తున తరలిస్తుంటారు. అయితే జాతర ముసుగులో తెల్లబెల్లంతో పాటు దాని చాటున నల్లబెల్లంను గుడుంబా విక్రేతలకు విక్రయించే ఆవకాశం కూడా ఉందని పలువురు చెబుతున్నారు. గుడుంబా మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గుడుంబా తయారీదారులపై ఉక్కుపాదం మోపింది. పీడీ యాక్టులు నమోదు చేసింది. గుడుంబా అమ్మ కాలపై ఆధారపడ్డ వ్యక్తులతో పూర్తిగా బంద్ చేయించి పునరావాసం కింద ఆర్థిక సహాయం అందజేసి షాపులు పెట్టించి, ఆటోలు కోనుగోలు చేయించి వారి కాళ్లపై వారు నిలబడే వి ధంగా మార్పు తీసుకొచ్చింది. అయినా కొంత మంది అక్కడక్కడా ఆ చందాను పూర్తిగా మాన లేక గృహావసరాలకు వినియోగించే తెల్లబెల్లం ను వినియోగిస్తూ సారా తయారీ చేస్తున్నారు. దీంతో తెల్లబెల్లం చాటున నల్ల బెల్లం విక్రయిం చే వ్యాపారులతో పాటు తెల్లబెల్లం విక్రయించే వ్యాపారులపై నిఘా పెట్టారు. ఎక్సైజ్ శాఖ స్టేట్ బాస్ అకున్ సభర్వాల్ ఉన్న సమయంలో లైసెన్స్ పొందిన బెల్లం వ్యాపారి అయినా రిజిస్టర్ తప్పనిసరిగా మెయింటెన్ చేయాలని, ప్రతీ కిలోకు లెక్క ఉండాలని ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ తీసుకొని బెల్లం విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్ పోలీసులతో ఎక్సైజ్ అధికారులు నిత్యం తనిఖీలు చేస్తూ అక్రమ వ్యాపారుల్లో వణుకు పుట్టించారు. ప్రస్తుతం తనిఖీ లు అటకెక్కడంతో లెక్కపత్రాలు లేకుం డా జోరుగా విక్రయాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

**జోరుగా గుడుంబా తయారీ**

కొద్దిరోజులుగా గుడుంబా విక్రయాలు ఉమ్మ డి జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. వరంగల్ నుంచి గుడుంబాను ప్రైవేట్ వాహనాల్లో తరలిస్తూ పట్టుబడ్డ దాఖలాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో మహబూబాబాద్ జిల్లాలో పెద్ద మొత్తంలో నల్ల బెల్లంను తరలిస్తూ స్థానిక పోలీసులకు లారీ పట్టుబడగా సీజ్ చేశారు. డోర్నకల్ సీఐ నల్లబెల్లం వ్యాపారి నుంచి డబ్బులు తీసుకొని ఏసీబీకి పట్టుబడటం తో తెరపైకి గుడుంబా విక్రయాలు రావడంతో పాటు బెల్లం వ్యాపారులకు పోలీసు అధికారు లు అండదండలు ఎట్లా ఉన్నాయో వెలుగులోకి వచ్చింది. గుడుంబా అమ్మకాలు పూర్తిగా నియంత్రణలోకి వచ్చాయని ఎక్సైజ్ అధికారులు చేప్తున్నప్పటికీ ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పోలీసుల తనిఖీల్లో వేల లీటర్ల గుడుంబా పట్టుబడటం గమనార్హం.

**తనిఖీల్లో పట్టుబడ్డ గుడుంబా విక్రేతలు**

ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ అధికారులు చేప ట్టిన తనిఖీల్లో పట్టుబడ్డ గుడుంబా విక్రేతలు వాంగ్మూలం ప్రకారం తెల్లబెల్లంతో పాటు చెక్కరను వినియోగిస్తూ గుడుంబాను తయారీ చేసినట్లుగా తెలుస్తోంది. తెల్లబెల్లం విక్రయాలు జోరుగా జరిగే ఈ సమయంలో ఎక్సైజ్, పోలీసులు అప్రమత్తం లేకపోతే పెద్ద మొత్తంలో తెల్ల బెల్లంను డంప్ చేసుకొని విచ్చలవిడిగా గుడుంబా తయారుచేసే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. లెసెన్స్ డ్ వ్యాపారి అయినప్పటికీ చూసీచూడనట్లుగా ఉండకుండా బెల్లం ఎవరికి విక్రయిస్తున్నారు..? ఎంత బెల్లంను దిగుమతి చేసుకున్నారు..? రిజిస్టర్ మె యింటైన్ చేస్తున్నారా..? హోల్సేల్ వ్యాపారుల నుంచి పె ద్ద మొత్తంలో కోనుగోలు చేసిన వ్యక్తు లు దేని కోసం కోనులుగోలు చేశారు..? అనే దాని పై పోలీసులు ఆరా తీస్తూ గోదాంల్లో తని ఖీలు పెంచితే గుడుంబా విక్రయాల రకు తావుం డదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## ఆశావహులను ఊరిస్తున్న మున్సిపల్, పరిషత్ ఎన్నికలు

**ప్రజాపక్షం/కల్లూరు:** మున్సిపాలిటీ పరిషత్ ఎన్నికలపై ఆశావహులు ఓ కన్నేసి ఉంచారు. మరి రెండు ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నట్లు చర్చలు కొనసాగుతున్నవి. మండలంలో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కొంచెం వెనకంజ ఈసారి మెలకువలతో పక్కా ప్రణాళికలతో పరిషత్, మునిసిపాలిటీని దక్కించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు, ప్రతిపక్షంకు మెరుగైన ఫలితాలు రావడంతో ఉత్సాహంగా ఉన్నా, అధికారి పార్టీ మాత్రం గట్టి పట్టుదలతో మండల పరిషత్ మున్సిపాలిటీని దక్కించుకునేందుకు అంతర్గత బహిర్గత ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు ప్రజల్లో చర్చలు కొనసాగుతున్నవి. ఆశావహులు పోరుకు సై అంటే సైకు అర్థికంగా తయారుగా ఉన్నవారిని బట్టి రంగంలో ఉండేందుకు ఇప్పటికే కదలికలు ప్రారంభించినట్లు అనుకుంటున్నారు. పార్టీల్లో నాయకులు చర్చలు కొనసాగుతున్నవి. ఆశావహులలో ఎప్పుడో ఎప్పుడా అని ఎదురుచూస్తున్నారు.

## ఎమ్మెల్యే పాయం చొరవతో రోడ్డు విస్తరణ పనులు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం ప్రధాన రహదారి పనుల విషయంలో కొన్ని సాంకేతిక కారణాల వలన ఆలస్యం జరిగిన విషయం తెలిసిందే. దీని వల్ల గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం పలువురు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఆదివారం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం అయ్యాయి. 3 లేదా 4 రోజుల్లో బీటీ లేయింగ్ పూర్తి అవుతుందని అధికారులు తెలిపారు. సత్వరమే స్పందించి పనులు చేపట్టినందుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, ఆర్అండ్‌బి అధికారులకు మండల కాంగ్రెస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన భట్టి



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యడవల్లి రాంరెడ్డి చిత్రపటానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం నాడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాంరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, జిల్లా నాయకులు బజ్జూరు వెంకటరెడ్డి, కూసుమంచి మండల నాయకులు, పాలేరు గ్రామ నాయకులు కొత్త విజయపాల్‌రెడ్డి, ఎడవల్లి పుల్లారెడ్డి, కొత్త పుల్లారెడ్డి, బత్తుల ఉప్పయ్య, దోమల ఎంకన్న, ఎడవల్లి ఉపేందర్‌రెడ్డి, తైదల వీరస్వామి, పుల్కారి వీరబాబు, కాంగ్రెస్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## జనవరి 4న అండర్-12 చెస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో ఖమ్మం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి నాలుగున ఖమ్మంలో ఓపెన్ అండర్ 12 చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు టి. వీరన్న తెలిపారు. ఖమ్మం ఇల్లందు రోడ్డులో గల హరిత గార్డెన్స్ కళ్యాణ మండపంలో ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి రూ. 33,100 నగదుతో పాటు ట్రోఫీలు, ప్రశంస పత్రాలతో పాటు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి మరిన్ని వివరాలకు 8328102378, 9491357631 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మాజీ శాసన సభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, ఇంటూరి శేఖర్, గద్దల నాగేశ్వరరావు, ప్రభాకర్, మేదరమెట్ల శ్రీనివాసరావు, తొండల సత్యనారాయణ పాల్గొన్నారు.

## మేడారం జాతరకు 244 ప్రత్యేక బస్సులు

### ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఖమ్మం రీజియన్ పరిధిలో 10 జాతర పాయింట్ల నుండి 244 ఆర్టిసి ప్ర త్యేక బస్సులను నడపనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ ఆదివారం తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు 2026 జనవరి 25 నుంచి 31 వర కు నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఆసియాలోనే అతి పెద్ద జాతరైన స మ్మక్క సారలమ్మ జాతర 2026 జనవరిలో జరగనుందని ఇందుకు సంబంధించి ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు, సూపర్ వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. 2024లో మేడారం జాతరకు మొత్తం 2,36,909 భక్తులు ఆర్టిసి సేవలను సద్వినియోగం చేసుకోవడం జరిగిందన్నారు. ఖమ్మం డిపో తరుపున ఖమ్మం పాయింట్ నుంచి 10 బస్సులు, ఇల్లందు పాయింట్ నుంచి 41 బస్సులు, సత్తుపల్లి డిపో తరుపున ఏటూరు నాగారం పాయింట్ నుంచి 17, చర్ల పాయింట్ నుంచి మూడు బస్సులు, వెంకటాపురం పాయింట్ నుంచి ఆరు బస్సులు, భద్రాచలం డిపో తరుపున భద్రాచలం పాయింట్ నుంచి21 బ స్సులు, పాల్వంచ పాయింట్ నుంచి15 బస్సులు, కొత్తగూడెం డిపో తరుపున కొత్తగూడెం పాయింట్ నుంచి110బస్సులు, మణుగూరు డిపో తరుపున మణుగూరు పాయింట్ నుంచి16 బస్సులు,మంగపేట పాయింట్ నుంచి ఐదు బస్సులు మొత్తం 244 బస్సులు మేడారం జాతరకు నడపనున్నట్లు ఆర్ఎం తెలిపారు. భక్తులు ఆర్టిసి బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం అశ్వాపురం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్ నందు మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్ష్మ య్య జెండా ఎగురవేసి భారత దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పాత్రను తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎందరో మహా నాయకులను తయారు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నా యకత్వంలో జవహర్లాల్ నెహ్రూ, శ్రీమతి ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ లాంటి ప్రధానుల సారథ్యంలో దేశ అభివృద్ధి గణనీయంగా దూసుకుపోయిందన్నారు.అనంతరం గొల్లగూడెం, సీతారామపురం, మల్లెలమడుగు గ్రామ పంచాయతీ కేంద్రాలలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. లంకమల్ల కొండలరావు, సర్పంచ్‌హర్షానాయక్, మట్టా వీరభద్రారెడ్డి, కందుల లక్ష్మ ణ్, కందుల వెంకన్న, భూతం వెంకన్న, గొల్లపల్లి నరేష్, రావులపల్లి నరసింహారావు, వేముల విజయ్, బట్టి వెంకన్న, ఎస్కే మోసీన్, కోలా శశికాంత్ పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాటం మాదిరి బిసి ఉద్యమం

**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ పోరాట మాదిరి బిసి ఉద్యమం నడిపేందుకు ఎస్సీ ఎస్టీ మైనార్టీ బిసి వర్గాలు అందరూ ఏకమై ఉద్యమాన్ని ముందుకు నడపాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మడత వెంకట్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఇల్లందు పట్టణంలోని ఎక్తహౌస్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో మడత వెంకటగౌడ్ మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్ సాధించడానికి రాష్ట్రంలోని అఖిల పక్ష నాయకులు, మేధావులు, డాక్టర్లు, లాయర్లు, విద్యార్థులు, కుల సంఘాలు నాయకులతో హైదరాబాద్‌లో డిసెంబర్ 31వ తారీఖున సమావేశంలో ఏర్పాటు చేయనున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంఎల్‌ఏలందరినీ ఢిల్లీకి తీసుకువెళ్లి పార్లమెంట్‌లో బిసిబిల్లు ప్రవేశపెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్రంలో బిసి రథ యాత్రను ప్రారంభించి రెండు నెలల పాటు ఈ రాష్ట్రంలోని పట్టణాలు, పల్లెలలోయాత్రను కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో పట్టణాలలో బిసిసంఘాలను ఏకం చేసి సభలను నిర్వహించి, విస్తృతంగా మీ డియా ద్వారా ప్రచారం చేసి బిసి కులాలలో చైతన్యం తీసుకువస్తామన్నా రు.భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కల్పిస్తామన్నారు. మామిడి శివ, మేకల మల్లేష్ యాదవ్, కోటగిరి రాజేందర్, కోడి రాజు, మునాఫ్, ఊట్ల రాజేష్, సదానందం, సతీష్ గౌడ్, ఏక్తా హౌస్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే దేశానికి రక్ష

### కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించిన డిప్యూటీ సిఎం మల్లు భట్టి





**ప్రజాపక్షం/ మధిర :** భారతదేశానికి స్వా తంత్ర్య తీసుకురావాడానికి పుట్టిన పార్టే కాంగ్రెస్ పార్టీ అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖమాత్యులు మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కాంగ్రెస్ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి మాట్లాడుతూ 1885లో ముంబైలో 86 మంది సభ్యులతో మొదలైన కాంగ్రెస్ ప్రస్థానం అద్వితీయమని, కాంగ్రెస్ జాతీయ పార్టీగా రూపాంతరం చెంది భారతదేశ అభివృద్ధికి కాం గ్రెస్ పార్టీ విశేష సేవలు అందించిందని కొనియాడారు. దేశస్వాతంత్ర్యం రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా నిల్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పోరాడిన అనేక యోధులకు మధిర ప్రాంతం ఆ శ్రయం కల్పించిందని అన్నారు. ఆనాడు వందేమాతరం గీతాన్ని బహిష్కరిస్తే సవాల్ విసిరి నిజాం పోలీసులకు ధీటుగా నిలబడి మధిర ప్రాంతంలో మూడు రంగుల జాతీయ జెండాను మహాయోధులు సర్దార్ జమలాపురం కేశవరావు ఎగురవేశారని డిప్యూటీసిఎం గుర్తు చేశారు. ఆనాడు వందేమాతరం గేయం పాడటంపై నిజాం ప్రభుత్వం నిషేదం విధించినప్పుడు ఆ గడ్డపై స్వతంత్ర కాంక్షను రగిలించిన ఘనత ఆయనదిన న్నారు. గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభల ఉద్యమానికి మధిర పట్టణం కేంద్రంగా నిలిచిందని గుర్తు చేశారు. హైద్రాబాద్ రాష్ట్రానికి జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని మంత్రిగా అప్పటి హోంమంత్రి సర్ధార్ వల్లభాయిపటేల్ ఆధ్వర్యంలో జరిగిన పోలీస్ యాక్షన్ ఫలితంగా సెప్టెంబర్ 17, 1984న స్వేచ్ఛా వాయువులు లభించాయని అన్నారు. అభివృద్ధిలో మధిర పట్టణం ఉరకలు పెట్టిస్తానని, మధిర ప్రాంతంలో ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, విద్య, టూరిజం హబ్, పరిశ్రమలు ఏర్పాటు లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మధిర పట్టణ ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణగుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, జిల్లా నాయకులు కొండబాల కోటేశ్వరరావు, మల్లాది వాసు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ శతాబ్ది సంబర సందేశం

### ప్రచార వాహనాన్ని ప్రారంభించిన బాగం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సంబురాల సందేశాన్ని ఇంటింటికి చేరవేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. జనవరి 18న జరిగే చారిత్రిక సభకు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలి శాఖ ఆధ్వర్యంలో సిపిఐ బహిరంగ సభ ప్రచార వాహనాన్ని హేమంతరావు ఆదివారం ప్రారంభించారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు వరదా నర్సింహారావు, జాకీర్, నాయకులు ఆముదాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**చారిత్రిక సభలో భాగస్వామ్యులుకండి : బాగం** జనవరి 18న జరగనున్న చారిత్రిక సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఈ సభ చిరస్థాయిగా నిలిచిపోతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సిపిఐ నగర కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక బోనకల్ రోడ్డులో వరదా నర్సింహారావు అధ్యక్షతన జరిగింది. జనవరి మూడు నుంచి తొమ్మిది వరకు నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లతో పాటు నగర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి చారిత్రిక సభను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, సాంబశివారెడ్డి, సైదా పాల్గొన్నారు.

## నేడు ఎల్ఐజి ఫ్లాట్లపై అవగాహన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలోని ఎల్ఐజి ఫ్లాట్ల విక్రయాలు, కేటాయింపు ప్రక్రియపై సోమవారం శ్రీరాం నగర్‌లోని హౌజింగ్ బోర్డు ప్రాజెక్టు సైట్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హౌజింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ వి. రమణారెడ్డి, బోర్డు కార్యదర్శి ఎస్. విమల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల బృందం ఈనెల 29న సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. శ్రీరాం నగర్‌లో హౌజింగ్ బోర్డు, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించిన అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లను అఫర్టబుల్ హౌజింగ్ క్రింద అల్పాదాయ వర్గాల ప్రజలకు విక్రయించాలని నిర్ణయించి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వారు తెలిపారు. మార్కెట్ కంటే తక్కువ ధరలో రూ.11.25 లక్షలకే అందుబాటులోకి వస్తున్న అవగాహన కల్పించడంతో పాటు సందేహాలను నివృత్తి చేసేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోర్డు కార్యదర్శి తెలిపారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఉపాధి హామీ పథకం చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని అందులో భాగంగానే మహత్మ గాంధీ పేరును తొలగించిందని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తెలిపారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని యాపిల్ సెంటర్ వద్ద ఉపాధి హామీ పథకానికి సంబంధించి మహత్మ గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్ అధ్యక్షతన జరిగిన ముఖ్య అతిథిగా మానుకొండ రాధాకిషోర్ పాల్గొన్నారు.రాధాకిషోర్ మాట్లాడుతూ మహత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. అందులో భాగంగా ప్రతి ఏడాది బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ వస్తుందని ఇప్పుడు గాంధీ పేరును తొలగించిందన్నారు. నాయకులు చెరుకూరి పూర్ణచందర్‌రావు, కోటేరు నర్సిరెడ్డి, మాధంశెట్టి హన్మంతరావు, బండి వెం కన్న, కొంటెముక్కుల నాగేశ్వరరావు, బాతుల సు ధాకర్, లాలసింగ్, బాలాజీ నాయక్, చిన్నా నా యక్, కోటేష్ నాయక్, బండి నాగేశ్వరరావు, సు ధీర్, రామ్మూర్తి నాయక్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి యాప్ ద్వారా యూరియా అమ్మకాలు

### జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో సోమవారం నుంచి యూరియా అమ్మకాలు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరుగుతాయని జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వానాకాలంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. అవసరమైన రైతులకు యూరియాను అందుబాటులో ఉంచడం, క్యూలో రైతులు నిలబడి ఆందోళన చెందడాన్ని నిరోధించడం, ఎవరి వద్ద ఎంత యూరియా అందుబాటులో ఉందో తెలుసుకోవడం ఈ యాప్ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. రైతులు ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి పంట సాగు చేస్తున్న రకం, విస్తీర్ణాన్ని బట్టి జిల్లాలో ఏ డీలర్, సొసైటీ నుంచైనా అందుబాటులో ఉన్న యూరియాను బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల్లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్, సొసైటీ వద్దకు వెళ్లి కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. 24 గంటల లోపు యూరియా తీసుకోని పక్షంలో ఆ బుకింగ్ రద్దవుతుందని మళ్లీ రైతు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పట్టాదారులు, పాస్‌పుస్తకాలు లేని వారు, కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. కౌలు దారులు ఎవరి వద్ద కౌలుకు తీసుకున్నారో వారి పట్టాదారు పాసుపుస్తకం నెంబర్ ద్వారా యూరియా బుక్ చేసుకోవచ్చునని అయితే సదరు పట్టాదారుడు ఓటిపి చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్‌కు సంబంధించి రైతులకు అవగాహన కల్పించడానికి ప్రతి విక్రయ కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ ద్వారా నియమించబడిన ఒక వ్యక్తి లేదా ఏఈవో సహాయం చేస్తారని తెలిపారు. రైతులందరూ ఈ యాప్‌ను వినియోగించుకుని యూరియా కొనుగోలు చేయాలని కోరారు. అదేవిధంగా డీలర్లు, సహకార సంఘాల వారు ఈ యాప్‌లో మాత్రమే యూరియా అమ్మకాలు చేపట్టాలని ఆదేశించారు.

### యాప్ ద్వారా యూరియా బుకింగ్

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి తెలిపా రు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం వివరాలతో యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాలని ఆ రైతుకు అర్హత ఉన్నటువంటి యూరియా బస్తాల సంఖ్యను చూపిస్తుందన్నారు. ఎకరం ఉన్న రైతులు వారి యొక్క యూరియా మొత్తాన్ని ఒకే దఫా కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. రెండు నుంచి ఐదు ఎకరాలు ఉన్న వారు రెండు దఫాలు 15 రోజుల వ్యవధిలో కొనుగోలు చేయవచ్చునని, ఐదు నుండి 20 ఎకరాలు ఉన్న వారు మూడు దఫాలుగా కొనుగోలు చేసుకోవచ్చునని 20 ఎకరాలు పైబడిన వారు వారికి కేటాయించిన యూరియాను నాలుగు దఫాలుగా కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. 15 రోజులు వి రామం ఉంటుందని తెలిపారు. రైతు బుక్ చేసుకు ంటే 24 గంటల వరకు బుకింగ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/పాల్వంచ :** పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచలోని రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 141వ, ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక మార్కెట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కొత్వాల కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్వాల మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. దేశాభివృద్ధికి పునాదులు వేసింది కాంగ్రెస్ అని తెలిపారు. మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ జాలె జానకీరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి సబ్యులు ఎర్రంశెట్టి ముత్తయ్య, జిల్లా ఐఎన్‌టియుసి అధ్యక్షులు ఎస్‌ఎ. జలీల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండం వెంకన్నగౌడ్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, నాయకులు మహిపతి రామలింగం, సాదం రామక్రిష్ణ, బద్ది కిషోర్, ఎస్‌వికె ఆచార్యులు, వై. వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, పాల్గొన్నారు.

## ‘జాబిశెట్టి’లో లైవ్ సర్జరీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇండియన్ ఆర్థోస్కోపి సొసైటీ 1 ఆధ్వర్యంలో ఖమ్మం జాబిశెట్టి ఆసుపత్రిలో లైవ్ సర్జరీ నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన 12 మంది సూపర్ స్పెషాలిటీ ఆర్థో వైద్యులచే లైవ్‌లో జాబిశెట్టి ఆసుపత్రిలో నాలుగు సర్జరీలను నిర్వహించారు. వీటిని ఖమ్మం జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన 150 మంది ఆర్థో వైద్యులు లైవ్ సర్జరీలను వీక్షించారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం తెలంగాణ రా ష్ట్రంలో ఖమ్మంలోనే మొదటిదన్నారు. లైవ్ సర్జరీ నిర్వహణ ద్వారా అత్యాధునీక వసతులతో సర్జరీలను ఎలా నిర్వహించవచ్చో వైద్యులు తెలుసుకునేవిధంగా ఏర్పాటు చేశామన్నారు. అత్యాధునీక సాంకేతికతను సర్జరీలలో పరిచయం చేయాలని ఉద్దేశంతో ప్రోగ్రాం నిర్వహించామన్నారు.బెంగుళూరు, హై దరాబాద్ వంటి నగరాలకు పోకుండానే జిల్లాలోనే అత్యాధునీక సౌకర్యాలతో సర్జరీలు నిర్వహి ంచే అవకాశాలు ఉంటాయన్నారు. ఈరోజు జరిగిన నాలుగు సర్జరీలను ఫ్రీగా చేసినట్లు నిర్వహకులు తెలిపారు.యశోద ఆసుపత్రి హైదరాబాద్ ప్రముఖ వైద్యులు పూర్ణచంద్ర తేజస్వి, సెక్రటరీ డాక్టర్ గౌతమ్ జాబిశెట్టి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఆరీఫ్, డాక్టర్ రాజ్‌కుమార్ వేముల, డాక్టర్ బొల్లికొండ శ్రీనివాస్, ఖమ్మం ఆర్థోపెడిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ పిఎస్ఎన్‌వి ప్రసాద్, పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఆటల పోటీలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్త్రీ శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఆదివారం ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆటల పోటీల్లో 250 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. అంధులు, బధిరిలు, మూగవారు, పోలియో, మానసిక వికలాంగులు తదితర విభాగాల దివ్యాంగులు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. వారికి రన్నింగ్, క్యారమ్స్, చెస్, జావలిన్ థ్రో, షాట్‌పుట్ తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారిణి వెల్పుల విజేత మాట్లాడుతూ గెలుపొందిన విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చిన దివ్యాంగ క్రీడాకారులను జనవరిలో జరిగే రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు జిల్లా నుంచి పంపించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది బిందు ప్రసాద్, వేణుగోపాల్, సునీత, రమేష్, చారి పాల్గొన్నారు.

## ముక్కోటికి సర్వం సిద్ధం

### జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** దక్షిణ అయోధ్య భద్రాద్రిలో మరో అతిపెద్ద ఉత్సవం ముక్కోటి ఏకాదశి. ఈ ఉత్సవానికి భద్రాద్రిపుణ్యక్షేత్రం సర్వం సిద్ధమైంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లుపూర్తి చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఉత్సవానికి తరలివచ్చే అవకాశం ఉండటంతో భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నేతృత్వంలో చర్యలు తీసుకున్నారు. ముక్కోటిని పురస్కరించుకుని రామాలయ పరిసర ప్రాంతాలు దేదీప్యమానంగా వెలుగులు జిమ్ముతున్నాయి. ఆలయ గాలిగోపురంతో పాటు చుట్టు ప్రాకారాలకు విద్యుత్ దీపాలను అలంకరించారు. గోదావరి నది పాత వంతెనపై కూడా సారపాక సరిహద్దు వరకు రంగురంగుల లైట్లు అమర్చడంతో పట్టణంలో పండుగ శోభ ఉట్టి పడుతోంది. స్వామివారు 9వరోజు శ్రీ కృష్ణావతారంలో దర్శనమిచ్చారు.

**తెప్పోత్సవం :** గోదావరి తీరంలో సీతా సమేతుడైన రామయ్య జల విహారం చేస్తూ కనుల విందు కలగించే కార్యక్రమం తెప్పోత్సవం. ఇం దు కోసం ఇప్పటికే హంస వాహనాన్ని సిద్ధం చేసిన అధికారులు అధికారిక ంగా ట్రైల్ రన్ నిర్వహించారు. తొలినాళ్లలో ఇ క్కడ తెప్పలో స్వామివారికి తెప్పోత్సవం జరిపిం చే వారు. క్రమంగా 1971 నుండి లాంఛీని ఏ ర్పాటు చేసి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 19 95 సం.లో తొలిసారిగా శ్రీరాములు లాంచీలో తెప్పోత్సవం మొదలు పెట్టారు. అప్పటి నుండి ఇప్పటి వరకు అదే శ్రీరాములు లాంటీ స్వామివారి జల విహారానికి ముక్కోటికి ముందు రోజు హంస వాహనంగా మారుతుంది. నేడు జరిగే తెప్పోత్సవం కూడా శ్రీరాములు లాంచీలోనే జరగనుంది.పట్టణంతో పాటు పలు ప్రాంతాల నుండి స్వామివారి తెప్పోత్సవ వేడుకను తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకా శం ఉండటంతో అందుతగిన ఏర్పాట్లను చేశారు. వివిఐపి, విఐపి లతో పాటు ప్రముఖులు సైతం వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

**నేడు ఉత్తర ద్వారా దర్శనం :** భద్రాచలం రామాలయం వేదికగా స్వామివారు మంగళవారం ఉత్తర ద్వారం నుండి భక్తులకు దర్శనమివ్వనున్నారు. మంగళ హారతులు, మంత్రోశ్చరణలతో ఉత్తర ద్వారం భూ లోక వైకుంఠంగా మారనుంది. వీక్షిస్తుండగా స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చే తీరుని చూసి తరించిపోతుంటారు.

## గ్రామీణ పేదల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**ప్రజాపక్షం/ మధిర :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును విబిజి రామ్‌గా మార్చటం గ్రామీణ పేదల హక్కులను కాలరాయటమేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తాలు విమర్శించారు. ఆదివారం ఎఐసిసి, టిపిసిసి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు మధిర పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాయడమేనని, వారి జీవనోపాధిపై జరుగుతున్న దాడి అని అన్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హాయాంలో ఈ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే గత పదకొండు ఏళ్లుగా మోడీ ప్రభుత్వంఈ పథకాన్ని నీరు గార్చేందుకు అనేక ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు.

# క్రీడ

## హాకీ ఇండియా లీగ్‌కు వేళాయె



మహిళల హాకీ ఇండియా లీగ్ (2025–26) రెండో సీజన్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. మరికొన్ని నిమిషాల్లో రాంచీ వేదికగా ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. అయితే.. తొలి సీజన్ ఛాంపియన్ ఒడిశా వారియర్స్ ఈసారి బరిలోకి దిగడం లేదు. ఈ జట్టు స్థానంలో రాంచీ రాయల్స్ ఆడనుంది. దాంతో.. ఇప్పుడు కూడా నాలుగు జట్లు ట్రోఫీకోసం నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. రాంచీ రాయల్స్, ఎస్‌జీ పైపర్స్, జేఎస్ డబ్ల్యూ సూర్మ హాకీ క్లబ్, శ్రచి బెంగాల్ టైగర్స్ జట్లు టైటిల్ వేటకు సిద్ధంగా ఉన్నాయి. రాంచీ వేదికగా మహిళల హాకీ ఇండియా లీగ్ రెండో సీజన్ రోజు ఆదివారం (డిసెంబర్ 28) రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానుంది. ఆరంభ పోరులో రాంచీ రాయల్స్, ఎస్‌జీ పైపర్స్ జట్లు తలపడనున్నాయి. నాలుగు జట్లు ఒక్కోటి మరో జట్టుతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతాయి. అనంతరం టాప్–2 జట్ల మధ్య టైటిల్ పోరు జరుగుతుంది. జనవరి 10న జరిగే ఫైనల్‌తో ఈ టోర్నీ ముగుస్తుంది.

### మ్యాచ్ తేదీలు ఇవే..

- ❇డిసెంబర్ 28 – రాంచీ రాయల్స్ vs ఎస్‌జీ పైపర్స్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ❇డిసెంబర్ 29 – సూర్మ హాకీ క్లబ్ vs శ్రచి బెంగాల్ టైగర్స్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ❇డిసెంబర్ 30 – రాంచీ రాయల్స్ vs శ్రచి బెంగాల్ టైగర్స్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ❇డిసెంబర్ 31 – ఎస్‌జీ పైపర్స్ v s సూర్మ హాకీ క్లబ్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 1 – ఎస్‌జీ పైపర్స్ vs శ్రచి బెంగాల్ టైగర్స్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 2 – రాంచీ రాయల్స్ vs సూర్మ హాకీ క్లబ్, రాత్రి 7:30 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 3 – సూర్మ హాకీ క్లబ్ vs ఎస్‌జీ పైపర్స్, సాయంత్రం 5:30 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 4 – శ్రచి బెంగాల్ టైగర్స్ vs రాంచీ రాయల్స్, సాయంత్రం 4 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 5 – సుర్మ హాకీ క్లబ్ vs రాంచీ రాయల్స్, సాయంత్రం 6 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 6 –ఎస్‌జీ పైపర్స్ vs శ్రచి బెంగాల్ టైగర్స్, సాయంత్రం 6 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 7– శ్రచి బెంగాల్ టైగర్స్vs సుర్మ హాకీ క్లబ్, సాయంత్రం 4 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 8 – ఎస్‌జీ పైపర్స్ vs రాంచీ రాయల్స్, సాయంత్రం 6 గంటలకు రాంచీలో.
- ❇జనవరి 10 – ఫైనల్ – రాత్రి 8:15 గంటలకు, రాంచీలో.



## టీ20 ప్రపంచ కప్.. పాక్ జట్టు నుంచి సూపర్ స్టార్లు ఔట్

2026 టీ20 ప్రపంచ కప్‌నకు సన్నాహకంగా జనవరి 7 నుంచి శ్రీలంకతో పాక్ మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం పాక్ సీనియర్ సెలక్షన్ కమిటీ 15మందితో జట్టును ప్రకటించింది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లో ఆడుతున్న స్టార్ ఆటగాళ్లు బాబర్ అజామ్, షాహీన్ అఫ్రిది, హారిస్ రవూఫ్, మహ్మద్ రిజ్వాన్‌లను లంకతో సిరీస్‌కు ఎంపిక చేయలేదు. అన్‌క్యాప్‌డ్ వికెట్ కీపర్ ఖవాజా నఫేను తొలిసారి జాతీయ జట్టులోకి తీసుకున్నారు. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన నఫే ఇటీవల పాకిస్థాన్ షహీన్స్ జట్టులో భాగమయ్యాడు. ఈ కుర్రాడు ఇప్పటి వరకు 32 టీ20లు ఆడి 132.81 స్ట్రైక్‌రేట్‌తో 688 పరుగులు చేశాడు. ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ తిరిగి టీ20 జట్టులోకి వచ్చాడు. సల్మాన్ అఘా కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ ఆడే జట్టు ప్రదర్శన ఆధారంగా ప్రపంచ కప్‌నకు పాకిస్థాన్ టీమ్‌ను ఖరారు చేసుకునేందుకు అవకాశం దొరుకుతుంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభంకానున్న టీ20 ప్రపంచ కప్‌లో గ్రూప్ బిలో భారత్, పాక్, నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ ఉన్నాయి. పాకిస్థాన్ మ్యాచ్‌లు కొలంబోలో జరుగుతాయి.

### శ్రీలంకతో సిరీస్‌కు పాక్ జట్టు:

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫకార్ జమాన్, ఖవాజా నఫే, మహ్మద్ నవాజ్, మహ్మద్ సల్మాన్ మీర్జా, మహ్మద్ వసీం జూనియర్, నసీమ్ షా, సాహిబ్‌జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తరీక్.

## ఈ వార్తలు ఎలా వస్తాయో?

### గంభీర్ 'టెస్టు' కోచింగ్ మార్పుపై బిసిసిఐ



గత కొద్ది రోజులుగా భారత క్రికెట్‌లో ఒకటే చర్చ. అన్ని ఫార్మాట్లకు కోచ్‌గా ఉన్న గౌతమ్ గంభీర్‌ను పరిమిత ఓవర్ల క్రికెట్‌కే పరిమితం చేస్తారంటూ వార్తలు హల్‌చల్ చేశాయి. టెస్టుల్లో అతడి పని తీరు సరిగా లేదనేది చాలా మంది చేస్తోన్న ఆరోపణలు. దీంతో బిసిసిఐ కొత్త కోచ్‌పై దృష్టి పెడుతుందని.. రెండు నెలల తర్వాత మార్పులు చేసే అవకాశం ఉందంటూ కథనాలు వచ్చాయి. గంభీర్ ప్రధాన కోచ్ అయ్యాక టీమ్‌ఇండియా టెస్టు సిరీస్‌లను కోల్పోయింది. దీంతో ఈ వార్తలకు బలం చేకూరింది. కానీ, బిసిసిఐ మాత్రం వాటిని కొట్టిపారేసింది. జాతీయ ఛానల్‌తో ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రత్యేకంగా మాట్లాడారు. వీవీఎస్ లక్ష్మణ్‌తో చర్చలు జరిపినట్లు వచ్చిన వార్తలనూ ఖండించారు. 'గౌతమ్ గంభీర్‌ను మారుస్తారని వస్తోన్న వార్తల్లో నిజం లేదు. అవన్నీ రూమర్లే. ఇప్పటి వరకు ఎలాంటి చర్చ జరగలేదు. కాంట్రాక్ట్ ప్రకారం గౌతమ్ గంభీర్ కొనసాగుతాడు. మేం ఎవరినీ సంప్రదించలేదు. గంభీర్‌తో కాంట్రాక్ట్ 2027 వన్డే ప్రపంచ కప్ వరకూ ఉంది. కోచింగ్ వ్యవస్థలో ఎలాంటి మార్పులు ఉండవు.

## ఫోకస్




### ఎఐ సేవలు



ఆరోగ్య సేవలలో కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆధునిక టెక్నాలజీ వినియోగం ఇటీవలి కాలంలో వేగంగా పెరిగింది. ఎఐ ఆధారిత వ్యవస్థలు రోగ లక్షణాలను త్వరగా విశ్లేషించి వ్యాధులను ముందుగానే గుర్తించడంలో వైద్యులకు సహాయపడుతున్నాయి. ఎక్స్‌రే, స్కాన్‌లు, రక్త పరీక్షల వంటి నివేదికలను ఎఐ వేగంగా చదివి ఖచ్చితమైన నిర్ధారణకు దోహదపడుతుంది. టెలిమెడిసిన్, డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా దూర ప్రాంతాల ప్రజలకు కూడా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే రోగి ఆరోగ్య డేటాను విశ్లేషించి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స సూచించే విధానాలు అభివృద్ధి చెందుతున్నాయి. మొత్తం మీద ఎఐ మరియు టెక్నాలజీ ఆరోగ్య సేవలను మరింత వేగవంతం, ఖచ్చితమైనవి మరియు అందరికీ చేరువయ్యేలా చేస్తున్నాయి.

### మెడిసిన్ అండ్ జెనోమిక్స్



మెడిసిన్ అండ్ జెనోమిక్స్ అనేది అధునాతన వైద్యశాస్త్రం. మనుషుల జన్యువుల (డిఎన్ఎ) అధ్యయనాన్ని కలిపి ఉపయోగించే ఆధునిక రంగం. ప్రతి వ్యక్తి జన్యువుల నిర్మాణం భిన్నంగా ఉండడం వల్ల, ఒకే వ్యాధి ఉన్నా చికిత్స ప్రభావం వ్యక్తివ్యక్తికి మారుతుంది. జెనోమిక్స్ సహాయంతో రోగి జన్యు సమాచారాన్ని విశ్లేషించి, అతనికి ఏ మందులు సరిపోతాయో, ఏ చికిత్స ఎక్కువ ప్రయోజనం ఇస్తుందో ముందుగానే నిర్ణయించవచ్చు. ముఖ్యంగా కేన్సర్, గుండె జబ్బులు, అరుదైన జన్యు వ్యాధుల చికిత్సలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. అలాగే కొన్ని వ్యాధులు భవిష్యత్తులో వచ్చే అవకాశాన్ని ముందే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడానికి కూడా జెనోమిక్స్ ఉపయోగపడుతుంది. మొత్తంగా మెడిసిన్ అండ్ జెనోమిక్స్ వైద్యాన్ని సాధారణ చికిత్స నుంచి వ్యక్తిగత, ఖచ్చితమైన చికిత్స దిశగా తీసుకెళ్తున్నాయి.



### మహమ్మారి వ్యాధులపై మరింత అవగాహన

మహమ్మారి వ్యాధులు అనేవి ఒక దేశం లేదా ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రభావితం చేసే అంటువ్యాధులు. కోవిడ్–19 వంటి అనుభవాల వల్ల మహమ్మారి నివారణ, చికిత్స ఎంత కీలకమో ప్రపంచం స్పష్టంగా గ్రహించింది. ఈ వ్యాధులపై సమర్థవంతమైన పోరాటం ముందస్తు నివారణతోనే ప్రారంభమవుతుంది. టీకాలు మహమ్మారి వ్యాధుల నివారణలో అత్యంత ముఖ్యమైన సాధనం. టీకాలు శరీరానికి ముందే రోగనిరోధక శక్తిని అందించి వ్యాధి తీవ్రతను తగ్గిస్తాయి లేదా పూర్తిగా నివారిస్తాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు టీకాలు తీసుకుంటే సామూహిక రోగనిరోధక శక్తి ఏర్పడి వ్యాధి వ్యాప్తి తీవ్రత తగ్గుతుంది లేదా ఆగిపోతుంది. మహమ్మారులను నియంత్రించడంలో ముందస్తు గుర్తింపు కీలక పాత్ర పోషిస్తుంది. కొత్త వైరస్ లేదా బాక్టీరియా ఉద్భవించిన వెంటనే దానిని గుర్తించి, దాని స్వభావాన్ని అధ్యయనం చేయడం వల్ల వ్యాప్తిని అడ్డుకోవచ్చు. ఇందుకోసం ప్రయోగశాల పరీక్షలు, జెనోమ్ సీక్వెన్సింగ్, డిజిటల్ నిఘా వ్యవస్థలను ఉపయోగించుకుంటున్నారు. ప్రజా ఆరోగ్య చర్యలు కూడా నివారణలో ముఖ్యమైనవి. చేతులు శుభ్రంగా కడగడం, మాస్క్ ధరించడం, పరిశుభ్రత పాటించడం, శుభ్రమైన నీరు మరియు పారిశుధ్య సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు మహమ్మారి వ్యాప్తిని గణనీయంగా తగ్గిస్తాయి. అలాగే మహమ్మారి దేశాల సరిహద్దులను గుర్తించదని తెలిసిన కారణంగా అంతర్జాతీయ సహకారం అవసరం. దేశాల మధ్య సమాచారం పంచుకోవడం, చికిత్సా మార్గదర్శకాలను సమన్వయం చేయడం, టీకాలు, మందులను సమానంగా అందించడం వల్ల ప్రపంచ స్థాయిలో మహమ్మారులను నియంత్రించవచ్చు. మహమ్మారి వ్యాధులు సోకిన తర్వాత సరైన చికిత్స ఎంతో అవసరం. వైరస్‌ల వల్ల వచ్చే వ్యాధులకు యాంటీవైరల్ మందులు, బాక్టీరియా వల్ల కలిగే వ్యాధులకు యాంటీబయోటిక్స్ ఉపయోగిస్తారు. అయితే అవసరం లేకుండా మందులను వాడటం వల్ల ఔషధ నిరోధకత పెరిగే ప్రమాదం ఉంటుంది. తీవ్రమైన సందర్భాల్లో రోగికి ఆక్సిజన్ సరఫరా, ద్రవాలు, జ్వరం మరియు నొప్పి నియంత్రణ వంటి సహాయక చికిత్సలు ప్రాణాలను కాపాడతాయి. కొవిడ్ 19 మహమ్మారి సమయంలో ఈ సహాయక చికిత్సలు ఎంత ముఖ్యమో స్పష్టమైంది. ఇటీవలి కాలంలో మహమ్మారి చికిత్సలో ఆధునిక సాంకేతికతలు ప్రవేశించాయి. మోనోక్లోనల్ యాంటీబాడీలు, జెనోమ్ ఆధారిత మందులు, కృత్రిమ మేధస్సు సహాయంతో వేగవంతమైన నిర్ధారణ వంటి పద్ధతులు చికిత్సను మరింత ప్రభావవంతంగా మారుస్తున్నాయి. అదే సమయంలో మహమ్మారులు ప్రజల మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. భయం, ఒత్తిడి, ఒంటరితనం వంటి సమస్యలను ఎదుర్కొనడానికి మానసిక ఆరోగ్య సహాయం, కౌన్సెలింగ్ మరియు సామాజిక మద్దతు అవసరం. భారతదేశంలో మహమ్మారి నివారణ, చికిత్సకు ప్రభుత్వం పెద్ద స్థాయిలో చర్యలు చేపట్టింది. దేశీయంగా టీకాలు మరియు మందుల ఉత్పత్తి, విస్తృత టీకాకరణ కార్యక్రమాలు, డిజిటల్ హెల్త్ వ్యవస్థలు మరియు టెలిమెడిసిన్ సేవలు ప్రజలకు వైద్యం చేరువ చేశాయి. ఆయుష్, ఆధునిక వైద్య విధానాల సమన్వయం కూడా ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఒక భాగంగా మారింది. మొత్తం మీద మహమ్మారి వ్యాధుల విషయంలో నివారణే ఉత్తమ మార్గం. శాస్త్రీయ అవగాహన, ప్రజల బాధ్యతాయుత ప్రవర్తన మరియు ప్రభుత్వాల సమన్వయ చర్యల ద్వారానే మహమ్మారులను సమర్థవంతంగా ఎదుర్కొనడం సాధ్యమవుతుంది.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి


## సింగరేణి భవన్‌లో ఐఎన్‌టియుసి సమావేశాలు దుర్మార్గం

### ఎఐటియుసి కార్మిక సంఘాల ధ్వజం



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి భవన్‌లో ఐఎన్‌టియుసి యూనియన్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం దుర్మార్గమైన చర్య అని, సమావేశం ఏర్పాటుకు సింగరేణి భవన్‌ను అనుమతి ఇచ్చిన అధికారులపై యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి సమావేశంలో వారు మాట్లాడుతూ 135 ఏండ్ల సింగరేణి చరిత్రలో ఏ యూనియన్ సింగరేణి భవన్‌లో సమావేశాలు పెట్టిన సందర్భాలు లేవన్నారు. కార్మికుల సమస్యలపై సమీక్ష నిర్వహించేందుకు సింగరేణి భవన్‌లో జరిగిన ఐఎన్‌టియుసి కార్యకర్తల సమావేశంలో సిఎండి కుర్చీలో జనక్ ప్రసాద్ కూర్చొని సమీక్ష నిర్వహించడాన్ని సింగరేణి కంపెనీని, కార్మికులను మరియు సిఎండిని అగౌరవపర్చడమేనని వారు పేర్కొన్నారు. ఐఎన్‌టియుసి సమావేశం కొరకు సింగరేణి భవన్ ను అనుమతి ఇచ్చిన అధికారులపై యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, అర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను,ఉపాధ్యక్షులు మాదన మహేష్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్, నాయకులు బోగ సతీష్ బాబు, దొంత సాయన్న, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, బలుసు రవి, చెప్యాల భాస్కర్, నాయిని శంకర్, గుర్రం ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయిఆజాద్, ప్రీతం



ప్రజాపక్షం/పెద్దపల్లి : ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభలను పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈనెల 23,24,25 తేదీలలో ఆర్నకొండ సాయి ఆజాద్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ మహాసభలకు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్ హాజరై అనేక విషయాలపై ప్రసంగించారు. మహాసభలలో పలు తీర్మానాలను చేశారు. పెద్దపల్లి జిల్లాకు న్యాయవిద్య కళాశాల, ప్రభుత్వ డిప్లమా (మైనింగ్), ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, నవోదయ పాఠశాల ను కేటాయించడంతోపాటు సిబిఎస్ఇ పాఠశాలలను స్థాపించాలనీ తీర్మానాలు చేశారు. అవి సాధించేంతవరకు ఏఐఎస్‌ఎఫ్‌గా పోరాటం చేస్తామని నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు తెలిపారు. మహాసభల ముగింపు రోజు జిల్లాకు నూతన ఎఐఎస్‌ఎఫ్ కమిటీని రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రకటించాడు. కమిటీలో 23మంది కౌన్సిల్ సభ్యులను, 9మంది కార్యవర్గం సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఆర్నకొండ సాయిఆజాద్, ప్రధాన కార్యదర్శిగా రేణుకుంట్ల ప్రీతం, ఉపాధ్యక్షులుగా మొలుగూరి నితిలేష్, పల్లె హర్ష, మంథని యశ్వంత్, సహాయకార్యదర్శులుగా ఎల్కపల్లి సురేష్, గుండ్ల లక్ష్మి ప్రసన్న, శ్రీవర్ధన్, కోశాధికారిగా కల్వల శ్రీకాంత్, స్టాలిన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందనీ ఎఐఎస్‌ఎఫ్ నాయకులు తెలిపారు.

## జనసేవాదళ్‌తో నాయకత్వ లక్షణాలు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : జనసేవాదళ్‌తో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, రాజకీయ సైద్ధాంతిక శిక్షణతో పాటు జీవిత భరోసాకు దిక్సూచి జనసేవాదళ్ అని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్ రావు అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఓ వెంచర్‌లో జనసేవాదళ్ మూడవ దశ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. తొలుత అరుణ పతాకాన్ని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ జనసేవాదళ్ శిక్షణతో సమాజానికి సేవ చేయాలనే భావన బలపడుతుందన్నారు. బృందాన్ని నడిపించే బాధ్యత వస్తుందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రయోజనకర నిర్ణయాలు తీసుకోవడంలో దృఢ సంకల్పం కలుగుతుందన్నారు. జీవిత ఎదుగుదులకు సోపానాలైన క్రమశిక్షణ, సమయపాలన, నియమాలు పాటించడం సమయానికి పనిచేయడం అలవాటు అవుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాలు, రక్తదానం సహాయక చర్యలలో ఎలా స్పందించాలో తెలుస్తుందన్నారు. శారీరక మానసిక బలం, వ్యాయామాలు, ఆటలు, ఆరోగ్యం మెరుగువుతుందన్నారు. సమాజంపై అవగాహణ ప్రజా సమస్యలు హక్కులు, బాధ్యతలపై అవగాహణ కలుగుతుందన్నారు. ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు మాట్లాడే నైపుణ్యం ప్రజల ముందు చర్చించే ధైర్యం వస్తుందన్నారు. అలాగే మంచి పౌరులుగా మారే అవకాశం దేశభక్తి సామాజిక బాధ్యత పెరుగుతుందన్నారు. జనసేవాదళ్ శిక్షణ శిబిరం వ్యక్తిని క్రమశిక్షణ గల సేవల భావంతో కూడిన మంచి పౌరుడిగా తయారు చేస్తుందన్నారు. యువత పాలకవర్గాల తీరుతో నైరాశ్యానికి గురవుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో పాలకులు విఫలం కావడంతో యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో యువత చైన్యవంతమైన ఆలోచనలతో రాజకీయాల్లోకి రావాలని వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక శక్తులకు మద్దతుగా నిలవాల్సి ఉందన్నారు. పాలకులు కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తూ యువత ను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సుదీర్ఘ కాలం పోరాటాలతో అనేక హక్కులను, సంక్షేమ పథకాలను సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జనవరి 18న ఖమ్మంలో జరగనున్నాయన్నారు. ఈ సందర్భంగా 5వేల మంది యువకులకు జన సేవాదళ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ సమస్యలపై జరిగే పోరాటాలకు సంబంధించి కార్యోన్ముఖులను చేయడమే లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల ఐలయ్య ఇన్స్పెక్టర్‌గా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, ఐఎఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, సిపిఐ జిల్లా నాయకులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, దండి రంగారావు, వెన్నం భాస్కర్, మున్సిపాలిటీ సిపిఐ డివిజన్ సెక్రటరీలు వెంపటి రాము, లగిశెట్టి రమేష్, బియ్యాల రాజు, యువజన సంఘం సభ్యులు గణపారపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదులకు వ్యతిరేకంగా యువత పోరాటం

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా

ప్రజాపక్షం/ఖమ్మం : మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నేటి యువత పోరాటాలు చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. సిపిఐ ఖమ్మం రూరల్ మండల సమితి సమావేశం ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మౌలానా మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, ఆ తర్వాత స్వతంత్ర భారతదేశంలోనూ అనేక నిర్బంధాలను ఎదుర్కొని అనేక త్యాగాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ఏ రాజకీయ పార్టీకి లేని గొప్ప చారిత్రిక పోరాట నేపథ్యం సిపిఐకి ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారని ఆ పోరాటం తెలంగాణ ప్రజల జీవనగతిని మార్చివేసిందన్నారు. నేటి యువతకు గత పోరాట నేపథ్యాన్ని వివరించి మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు కార్యోన్ముఖులను చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ జనవరి 18న జరిగే సిపిఐ శతవసంతాల సభకు భారీ జనసమీకరణ చేయాలని కోరారు. సమావేశం సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, కమలాకర్, ఉన్నం రంగారావు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐది నిత్యజ్వలిత పోరాటాల చరిత్ర

### పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : నాటి నుంచి నేటి వరకు నిత్యజ్వలిత పోరాటాల చరిత్ర గల పార్టీ సిపిఐ అని పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసి జైలు జీవితాలు గడిపి చిత్రహింసలకు గురై పోరాడిన పార్టీ సిపిఐ అన్నారు. అనేక ప్రజాసంఘాలు నిర్మించి వారి హక్కుల సాధన కోసం అగ్రభాగాన ప్రజాఉద్యమాలు నిర్వహించి పోరాడిన ఘనమైన చరిత్ర సిపిఐది అని గుర్తు చేశారు. నిజాం నిరంకుశ పాలనను అంతమొందించి, దొరలను దోపిడీదారుల గడీలను కూల్చి, భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి 4500మంది ప్రాణాలు అర్పించి, 10లక్షల ఎకరాల భూములు పంచి, 3000 గ్రామాలను విముక్తి చేసి గ్రామ స్వరాజ్యం స్థాపించిన పార్టీ సిపిఐ అని కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీర్యాలీ, బహిరంగ సభ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 30న సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం సూర్యాపేటలోని కిరాణ అండ్ ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్‌లో జరుగుతుందని, సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ నుండి విజయం సాధించిన ఆరుగురు సర్పంచ్‌లు, ఇద్దరు ఉపసర్పంచ్‌లు, 40 మంది వార్డు సభ్యులను సమావేశంలో సన్మానించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, నాయకులు చామల అశోక్ కుమార్, పెంద్ర కృష్ణ, దేశగాని హేమలత, విజయ్‌కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## వార్డులు కావవి.. డంపింగ్ యార్డులు




### ఇంటింటికీ సిపిఐ పాదయాత్రలో గోదా శ్రీరాములు

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపల్‌లో వార్డులు డంపింగ్ యార్డులా దర్శనమిస్తున్నాయని, అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని వార్డుల పరిస్థితి మరి అధ్వానంగా తయారయ్యాయని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోదా శ్రీరాములు విమర్శించారు. ఇంటింటికీ సిపిఐ' పాదయాత్రలో భాగంగా ఆదివారం మూడవరోజు 9,10,11,12 వార్డులలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ఖాళీ ప్లాట్లల్లో, లోటస్ టెంపుల్ ఏరియాలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. మురుగు కాల్వల్లో చెత్త చెదారం పేరుకుపోయి ఈగలు, దోమలతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అమృత్ 2.0 పథకం కింద పట్టణంలోని సీసీ రోడ్లను తవ్వి వదిలేయడంతో గల్లీలలో ప్రజలు నడవలేని దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు. 29న సోమవారం మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టి మూడు రోజుల పాదయాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారించేందుకు ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ జిల్లా నాయకులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ముత్తారం :** కాంగ్రెస్ పార్టీ జాతీయ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో ఆదివారం మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గాదం శ్రీనివాస్ జెండా ఎగురవేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోల్నేని బుచ్చం రావు, ముత్తారం గ్రామ వార్డ్ మెంబర్లు కుక్కల చంద్రమౌళి, మేదరి శేఖర్, మాజీ సర్పంచులు తూటి రజితరఫీ, తాటిపాముల వకులరాణి శంకర్, రాపేల్లి రామన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోల విజయ్ గౌడ్, డాక్టర్ కేవీ చారి, గుడి కొండల్ రెడ్డి,బాలసాని రాజు, అనుము గోపి, నూనేటి కృష్ణతో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డా.బంగారి స్వామి పుట్టిన రోజును పురస్కరించుకుని రెనే హాస్పిటల్, స్థానిక మాతా శిశు కేంద్రంలో సుమారు 250 మంది రోగులకు నిర్వాహకులు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా రెనే హాస్పిటల్‌లో అతి త్వరలో రోబోటిక్, కీలు మార్పిడి చికిత్సను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గుండె వ్యాధి నిపుణులు డా.సురేష్ కుమార్, క్రిటికల్ కేర్ వైద్యులు డా.కృష్ణారెడ్డి, పీస్ కమిటీ సభ్యులు ఎం.ఏ గఫార్ లయన్, ఫహాద్ సిద్దికి, కాంగ్రెస్ నాయకులు అస్గర్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ తాజ్, నాగరాజులతో పాటు రెనే హాస్పిటల్ నాన్ క్లినికల్ డైరెక్టర్ మేకల అరవింద్ బాబు, లీగల్ అడ్వైజర్స్ సంతోష్ కుమార్, రాజేష్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్‌లకు ఎంపి అరవింద్ ఘన సన్మానం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఇటీవలే జరిగినా గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన పలువురిని ఇందూర్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు నిజామాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మల్లాపూర్ మండల వేంపల్లి గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన గుగ్లావత్ రాజేందర్, వెంకట్రావుపేట ఉప సర్పంచ్ గా ఎన్నికైన తోట గంగారెడ్డి లను శాలువాలతో సన్మానించి అభినందించారు. ప్రతి ఒక్కరికి అండగా ఉండాలని గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ రఘు, బిజెపి మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యక్షుడు లవంగ శివ, వాకిటి తిరుపతిరెడ్డి,తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి యథావిధిగా ప్రజావాణి

### కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్:**ప్రజల సమస్యల సత్వరపరిష్కారం కోసం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా సోమవారం నుంచి కొనసాగించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలోతెలిపారు.ప్రజలుసద్వినియోగంచేసుకోవాలనిఆమెసూచించారు.

## సొంత జిల్లాలోనే టెట్ పరీక్షలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** సొంత జిల్లాలోనే టెట్ పరీక్ష వ్రాసే అవకాశాన్ని కల్పించాలని, అదే విధంగా టెట్ రాస్తున్నటువంటి ప్రభుత్వ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి రొట్టె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ధర్మపురి పట్టణంలో ఆదివారం రొట్టె శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పంచాయతీ ఎన్నికల విధులలో పాల్గొన్న ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు సబ్జెక్టు పట్ల ప్రీపరేషన్‌కు సమయం తప్పనిసరిగా ఇవ్వాలని పేర్కొన్నారు. సమయాభావంతో తీవ్ర ఆందోళనలోనున్న టెట్ అభ్యర్థులకు సుదూర ప్రాంతాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయకుండా వారి స్వంత జిల్లాలోనే టెట్ పరీక్షలు రాసే విధంగా అవకాశాన్ని కల్పించాలని రొట్టే శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## 'మాదిగ జాగృతి' జిల్లా అధ్యక్షుడిగా శంకరయ్య నియామకం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి జిల్లా మాదిగ జాగృతి జిల్లా అధ్యక్షుడుగా ఏదుల శంకరయ్య ఉపాధ్యక్షులుగా ఆవు నూరి సతీష్ లను నియమిస్తున్నట్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ మహారాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం డిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ మహారాజ్ మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర నాయకులకు దిశా నిర్దేశాన్నిస్తూ. మార్గదర్శకాలు,సంఘ అవశ్యకతను వివరిస్తూ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేయవలసిందిగా కోరారు. మాదిగ జాగృతి సంఘం జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసారు. జిల్లా అధ్యక్షులు ఏదుల్లా శంకరయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఆవునూరి సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మాతంగి రేవంత్,కార్యదర్శి, బూడిద మహేందర్, జైకర్ బాబు ఆరేపల్లి,కోశాధికారి,మంతెన రమాకాంత్, సభ్యులు రామంచ సతీష్,ఆషాడం ముఖేష్,కుక్క అవినాష్ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి





**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో ఆదివారం ఉదయం విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. స్థానిక ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన రెడపాక లింగయ్య లచ్చవ్వ దంపతులు ద్విచక్ర వాహనంపై ఆదివారం ఉదయం గొల్లపల్లి మీదుగా జగిత్యాలకు వెళుతున్న క్రమంలో నల్లగుట్ట ప్రాంతానికి రాగానే జగిత్యాల నుండి ఎదురుగా వస్తున్న టవేరా వాహనం (కారు) ఢీ కొట్టడంతో లచ్చవ్వ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన లింగయ్యను జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంలో దంపతులిద్దరూ ఒకేసారి మరణించడంతో వారి కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న ధర్మపురి సిఐ రామ్ నర్సింహారెడ్డి ,స్థానిక ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి ఘటన స్థలాని చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుల కోడలు రెడపాక లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

# ఎన్నికలు ఏవైనా ఎగిరేది కాంగ్రెస్ జెండానే

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్






**ప్రజాపక్షం/ధర్మపురి :** నిన్నటి పంచాయతీ ఎన్నికలు మొదలుకుని రాబోవు ప్రాదేశిక ,మున్సిపల్, కార్పొరేషన్ ఏ ఎన్నికలైనా గెలిచేది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులేనని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,వికలాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని 149 గ్రామ పంచాయితీ లలో 108 మంది కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు గెలవగా ఆయా గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులను ఆదివారం పట్టణంలోని శ్రీ లక్ష్మి నరసింహ ఫంక్షన్ హాల్లో మంత్రి అడ్లూరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన రెండేళ్ళలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందించడంతో మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టంకట్టారని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ లలో 4 ఇప్పటికే ఇచ్చామని మిగతా రెండింటితోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించనున్నామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో 80 శాతం మంది కాంగ్రెస్ సర్పంచులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞుడినై ఉంటానని పేర్కొన్నారు. మంచిమాటలతో ఓట్లు వేయరని చేసిన మంచిపనులకే ఓట్లు పడతాయని ఆపని కాంగ్రెస్ చేస్తున్నదని అడ్లూరి చెప్పారు. అందుకే ఏ ఎన్నికలైన కాంగ్రెస్ పార్టీ వెంటే తెలంగాణ ప్రజలు ఉండనున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి జెండా మోసిన ప్రతీ కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు.రెండేళ్ళలో ఏం చేసావని సోయితప్పిన బిఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారని గెలిచినప్పటి నుంచి నిత్యం స్థానికంగా వుండి ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాని అదేవిధంగా సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతీ ఒక్కరి అభివృద్ధి నికాంక్షిస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మేమే రాజులం.. మేమే మంత్రులం అంటూ విర్రవీగారని విజ్ఞులైన ఓటర్లు కర్రుకాల్చి వాత పెట్టడంతో దిక్కుతోచక నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని అడ్లూరి ఎద్దేవాచేశారు. ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలినా బిఆర్ఎస్ నేతలు బుద్ధి మార్చుకోవడం లేదని ధ్వజమెత్తారు. ధర్మపురికి రూ.500 కోట్లు కేటాయిస్తానని క్షేత్రాన్ని గొప్ప టెంపుల్ సిటీగా మార్చుతానన్న కెసిఆర్ మొండిచేయి ఇచ్చిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుని ఖజానా ఖాళీచేసి అప్పగించినప్పటికీ మూడేళ్ళలో ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చాకే ప్రజలను ఓటు అడుగుతామని తెలిపారు. అంతకుముందు పట్టణంలో కాంగ్రెస్ నూతన సర్పంచ్‌ల విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నందయ్య, కోరుట్ల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ఎఎంసి చైర్ పర్సన్ చిలుముల లావణ్య, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు ఎస్.దినేష్ ,శైలేందర్ రెడ్డి,సుభాష్,నిశాంత్ రెడ్డి,నాయకులు వేముల రాజేష్, చీపిరిశెట్టి రాజేష్, చిలుముల లక్ష్మ ణ్,జక్కు రవీందర్,సింహరాజు ప్రసాద్,కుంట సుధాకర్, సంగ నర్సింహులు, సొల్ల భీమయ్య, భాస్కర్ రెడ్డి 108 గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

### నియోజకవర్గంలో ప్రతి పల్లెనూ అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌నే సాధ్యమని, చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం మంగపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లింగాల లింగయ్య, ఉపసర్పంచ్ నల్ల హన్మంతు, వార్డు మెంబర్లు ఆదివారం ఎమ్మెల్యే సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గంగాధర ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువాలుకప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, తోట సంధ్య, కరీం, మ్యాక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పేద ఇంటికీ సంక్షేమ పథకాలు

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామంలోని ప్రతి పేద ఇంటికి సంక్షేమ పథకాలు కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మాత్రమే అందాయని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 140వ కాంగ్రెస్ పా ర్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించా రు. జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ జెండా ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అ ధ్యక్షులు సంగీతం శ్రీనివాస్‌లు మాట్లాడారు. భా రత దేశ ప్రజలకు అండగా 140 సంవత్సరాల క్రి తం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి పార్టీ ఆధ్వర్యం లో అనేక ఉద్యమాలు జరిగాయన్నారు. గాంధీ నేతృత్వంలో స్వంతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ,రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ భారత ప్రధానిగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. పది సంవత్సరాల బిజెపి పాలనలో దేశంలో కు లాల మతల ప్రాతిపదికన పాలన కొనసాగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశంలోని పే ద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందనీ ప్రపంచంలో భారత దేశాన్ని అగ్రగామిగా నిలిపిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. నాలుగు కోట్ల ప్రజల కోరిక మేరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగిన వారికి అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియ ర్ నాయకులు మృత్యుంజయం, వెలుముల స్వ రూప తిరుపతి రెడ్డి, చొప్పదండి ప్రకాష్, గడ్డం నరసయ్య, కాముని వనిత నలినీకాంత్, సూర దేవరాజు, ఆకునూరి బాలరాజు, గొప్ప దేవయ్య, వెంగళ లక్ష్మి నరసయ్య, శ్రీకాంత్, శివప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలకు త్వరలోనే పరిష్కారం

### జగిత్యాల శాసనసభ్యుడు డాక్టర్ సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఉపాధ్యాయ సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం టీచర్స్ భవన్ లో పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనందరావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పిఆర్‌టియు టిఎస్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి కూడా వారే కాబట్టి ముఖ్యమంత్రి వారి విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే జరిగింది కాబట్టి ప్రభుత్వ పాఠశాల స్థితిగతులు ఉపాధ్యాయుల సమస్యల పై వారికి అవగాహన ఉందని , ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో టీచర్ ఎమ్మెల్సీ లతోని మాట్లాడుతున్నారని అన్నారు. త్వరలోనే హెల్త్ కార్డులు ఉద్యోగ ఉపాధ్యాయులకు మంజూరు కాబోతున్నాయని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల్లో పెద్ద సంఘమైన పిఆర్‌టియు టిఎస్ ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతుందని టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పుడు రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో సంప్రదిస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 20,000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయని, టెట్ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. జిల్లా అధ్యక్షులు ఆనంద్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం పైలెట్ గా మండలనికి ఒక పాఠశాలలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ2020 ప్రవేశపెట్టబోతుందని అన్నారు. ప్రతి విద్య సంవత్సరం ఆరంభంలోనే ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ బదిలీలు పదోన్నతులు జరిపించాలని వాటి వలన జీరో స్కూల్స్ బెడద తప్పుతుందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు చాలా కాలం బిల్లులు పెండింగ్లో ఉన్నాయని పిఆర్సి, డిఏ పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారి కోరారు. అనంతరం 2026 , వాల్ కేలండర్లను శాసనసభ్యులు ఆవిష్కరించారు. ఈ మాసంలో పదవి విరమణ పొందుతున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రముఖ విద్యావేత్త సరస్వతి శిశు మందిర్ వాణి సహకార జూనియర్ కాలేజ్ వ్యవస్థాపకులు కాసుగంటి సుధాకర్ రావు మృతికి సంతాపంగా ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ సంఘం మాస పత్రిక సభ్యులు అబ్దుల్ జమీల్ , ఏవియన్, రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జమున ,కాంగ్రెస్ నాయకులు పెండం రాములు, ఒద్ది రామ్మోహన్ రావు , శ్రీరామ్ బిక్షపతి, దాసరి ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## 29న తెలుగు అమెరికా సంఘం ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** మన అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న సిద్దిపేట జిల్లా కేంద్రంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు 34వ వార్డు కౌన్సిలర్ గుడాల సంధ్య శ్రీకాంత్ తెలిపారు. స్థానిక పారుపల్లి వీ ధిలోని మమ్మాయమ్మ ఆలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు మెగ వైద్య శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. మెగ వైద్య శిబిరంలో ఆరోగ్య భద్రత కార్డుల పంపిణీ, ఎల్వి కంటి ఆసుపత్రి వారిచే కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సాధరణ వ్యాధులు, గుండెకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా చికిత్సలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఉచితంగా బిపి, జిఆర్‌బిఎస్. ఈసిజి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
పూర్తి వివరాలకు 9063126571, 9063473167 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## 'రామగుండం'లో ప్రధాన నేరాలు తగ్గాయి!



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సిపి. అంబర్ కిషోర్ ఝా 2025 వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపి. మాట్లాడుతూ, 2024 సంవత్సరంతో పోల్చితే 2025లో కమిషనరేట్ పరిధిలో ఆర్థిక లాభం కోసం చేసిన హత్యలు, దోపిడీలు, పగలు, రాత్రి గృహాల్లో చోరీలు, అల్లర్లు, అత్యాచారం, మోసం, హత్యాయత్నం వంటి ప్రధాన నేరాలు తగ్గాయని తెలిపారు. పటిష్ట నిఘా చర్యలు, వివిధ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం, మెరుగైన పోలీసింగ్ విధి నిర్వహణ వల్ల సాధ్యమైందన్నారు. కిడ్నాపింగ్, తీవ్రంగా గాయపర్చడం, దొంగతనాలు వంటి నేరాలు పెరిగాయన్నారు. ప్రధానంగా నిరంతర పర్యవేక్షణ, దృశ్యమానత పెంపు, ప్రజల భాగస్వామ్యం, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ చర్యలు, నేరాల గుర్తింపు వల్ల ప్రతిస్పందన బలపడిందన్నారు. ప్రజా భద్రత మరింత మెరుగు పడిందన్నారు. పోలీసులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగిందని సిపి. అన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఆస్తి నష్టం రికవరీ 22 శాతం పెరిగిందన్నారు. ఇది సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, పటిష్టమైన నిఘా, ఇన్ఫర్మేషన్ వ్యవస్థ వల్ల సాధ్యమైందన్నారు. రానున్న నూతన సంవత్సరంలో నేర నియంత్రణ, ప్రజా భద్రత, మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి, గంజాయి, మత్తు పదార్థాల రహిత కమిషనరేట్ నిర్మాణానికి కృషి చేస్తామని, పోలీసుల పనితీరుపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం మరింత పెంచేలా ప్రయత్నిస్తామని సి.పి. తెలిపారు. ప్రజలు, పోలీసులతో కలిసి పనిచేసినప్పుడే శాంతియుత, సురక్షిత సమాజం సాధ్యమౌతుందని, ఏ చిన్న సమాచారమైన పోలీసులకు వెంటనే అందించాలని ప్రజలను సి.పి. కోరారు.

## సింగరేణి బాధితులకు త్వరలోనే న్యాయం చేస్తాం

### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి బాధితులకు త్వరలోనే న్యాయం చేస్తామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆదివారం రోజున సింగరేణిలో మారుపేరు, విజిలెన్స్ పేరిట పెండింగ్‌లో ఉన్న కేసుల బాధితులు హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. గత అనేక ఏళ్లుగా సింగరేణి యాజమాన్యం విజిలెన్స్ విచారణల పేరుతో తమ ఉద్యోగాలను పెండింగ్‌లో పెట్టిందని, దీనివల్ల తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తమ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు.దీనిపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి, కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, కార్మికుల పక్షపాతి అయిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ విషయమై రాబోయే రెండు రోజుల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, ఐఎన్‌టియుసి యూనియన్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ప్రత్యేకంగా చర్చించనున్నట్లు మంత్రి తెలిపారు. భూపాలపల్లి సభ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని త్వరలోనే నెరవేరుస్తామని, బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ధనాడ రాజు, పార్థపల్లి హరీష్, రామిళ్ళ సందీప్, ఇంజపల్లి ఓం ప్రకాష్, వెంపటి సతీష్, కొమురమ్మ, సాయి కుమార్ మరియు మారుపేర్ల కార్మికుల పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## సాగు నీళ్లు ఇవ్వకపోతే పోరాటమే..!

### పెద్దగుండవెల్లి గ్రామ రైతులు



**ప్రజాపక్షం/దుబ్బాక:** మల్లన్నసాగర్ ద్వారా రైతులకు సాగు నీళ్లు ఇవ్వకపోతే ఉద్యమానికి సిద్ధమని పెద్దగుండవెల్లి గ్రామ రైతులు స్పష్టం చేశారు. ఆదివారం దుబ్బాక మండలం పెద్దగుండవెళ్ళి గ్రామంలో జలసాధన సమితి, గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో రైతులు, గ్రామ పెద్దలు అన్ని పార్టీల నాయకులు సమావేశమయ్యారు. గత యాసంగి కాలంలో సాగునీరు లేక భూర్భ జలాలు తగ్గి బోర్లు ఎండిపోవడంతో దాదాపు 2వేల ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశామని తమకు ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరుకోడ్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 21 గ్రామాలకు 17, 377 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు గత ప్రభుత్వం రూ. 111 కోట్లతో మల్లన్న సాగర్ నిర్మించారు. కానీ సుమారు 90 శాతం పనులు మాత్రమే పనులు పూర్తి కావడంతో మిగిలిన 10 శాతం పనులు పెండింగ్‌లో ఉండడంతో 21 గ్రామాల రైతులకు పంటలకు సాగు నీరు అందక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల నుండి పనులు చేపట్టకపోవడంతో పంటలకు నీరు అందక రైతులకు ప్రతిసారి పెట్టుబడి కూడా రావడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం, గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## మిషన్ భగీరథ నీరు కాలుష్యం



**ప్రజాపక్షం/రేగోడ్ :** మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలో ని మోడల్ స్కూల్ వెళ్లే పైప్ లైన్ లీకేజీ కావడంతో మిషన్ భగీరథ నీరు కాలుష్యం అవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గత వారం రోజులుగా నీరు కాలుష్యం అవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతా అధికారులు స్పందించి పైప్ లైన్ మరమతలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతూన్నారు

## ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో 141వ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా సేవదళ్ జిల్లా అధ్యక్షుడు వైసాక్షి సంతోష్ పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిసిసిఅధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ చేతుల మీదుగా పార్టీ జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ వెంకట్, జితేందర్, వైశాక్షి, సంతోష్, అప్సర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పకడ్బందీగా జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లు




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**నిర్మల్ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్,ఇన్స్‌పైర్ కార్యక్రమ నిర్వహణను విజయవంతం చేసేందుకు కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న ఆదేశించారు.ఈ నెల 29,30 తేదీల్లో నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఈ వేదుకల ఏర్పాట్లపై ఆయన అదివారం కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించి,క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కార్యక్రమ నిర్వహణ కోసం కేటాయించిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో నిర్వర్తించాలని,విద్యార్థులకు,ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన వసతులు కల్పించాలని సూచించారు.అందరూ కలిసికట్టుగా కృషి చేసి ఈ ప్రదర్శనను జిల్లాలోనే ఆదర్శవంతంగా నిలపాలని ఆయన కోరారు.అనంతరం జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ,కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీల విధివిధానాలను వివరించారు.ప్రదర్శనకు వచ్చే విద్యార్థులకు అవసరమైన స్టాళ్ల ఏర్పాటు,భోజన వసతి,ఇతర మౌలిక సదుపాయాల గురించి సభ్యులకు దిశానిర్దేశం చేశారు.వివిధ విభాగాల కమిటీ సభ్యులు,పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సాంగ్వి వాసి సుధాకర్‌కు కాంస్యం



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:**కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించిన 12వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన ఈసారి సుధాకర్ మెరిశారు.అత్యంత ఉత్సాహంగా సాగిన 400 మీటర్ల పరుగు పందెంలో సుధాకర్ తన ప్రతిభను చాటి కాంస్య పతకాన్ని (బ్రోంజ్ మెడల్)కైవసం చేసుకున్నారు.రాష్ట్రస్థాయిలో గట్టి పోటీని ఎదుర్కొని పతకాన్ని సాధించడం పట్లసర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.క్రీడల పట్ల ఆయన చూపిస్తున్న ఆసక్తిని,పట్టుదలను గుర్తించిన పలువురు ప్రముఖులు,గ్రామస్తులు ఆయనను అభినందనలతో ముంచెత్తారు.గ్రామీణ ప్రాంతం క్రీడాకారులకు సుధాకర్ సాధించిన ఈ విజయం ఎంతో స్ఫూర్తినిస్తుందని స్థానికులు కొనియాడారు.

## మాదాసు శ్రీనివాస్‌కు మంచి రాజకీయ భవిష్యత్తు: హరీష్ రావు



**ప్రజాపక్షం/గజ్వేల్:**గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ కు మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు. ఆదివారం తన జన్మదినాన్ని పురస్కరించుకొని మాదాసు శ్రీనివాస్ మాజీ మంత్రి హరీష్ రావును మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. గజ్వేల్ మండలంలో బిఆర్ఎస్ పార్టీ పటిష్టత, అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలకు నిరంతర అందుబాటులో ఉంటున్న మాదాసు శ్రీనివాస్ కు తన ప్రోత్సాహం, సహకారం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు అన్నపూర్ణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, సర్పంచ్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా జిల్లా కార్పోరేషన్ పరిధిలోని డివిజన్‌లో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ అధ్యక్షతన డివిజన్ నాయకులు షాదాబ్ ఆధ్వర్యంలో సుమారు 150బిజెపి, బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నగేష్‌రెడ్డి, రాంభూపాల్, చరణ్,

# తాగునీటి వృథా..అరికట్టరాదా?

ఎడపల్లి మండలంలో యథేచ్ఛగా నీటి వృథా..
పట్టించుకోని పంచాయతీ అధికారులు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఒకవైపు ప్రభుత్వం ప్రతి చుక్కను పొదుపు చేయాలని ప్రచారం చేస్తున్నా.. ఎడపల్లి మండలంలో మాత్రం క్షేత్రస్థాయి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీరు వృధాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారుల నిర్లక్ష్యంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండలంలోని బ్రహ్మణ పల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై ఉన్న నీటి ట్యాంక్ నిండిపోయి, పై నుంచి నీరు వెల్లువలా కిందకు పారుతోంది. ట్యాంక్ నిండిన వెంటనే మోటార్ ఆపాల్సిన పంచాయతీ సిబ్బంది గంటల తరబడి అటువైపు చూడకపోవడంతో వేల లీటర్ల నీరు రోడ్లపాలవుతోంది. అదేవిధంగా దుబ్బాతండాలో శనివారం మధ్యాహ్నం సైతం రోడ్డు పక్కన ఉన్న బహిరంగ కుళాయిల నుంచి నీరు నిరంతరాయంగా వృధా అవుతూనే ఉంది. కుళాయిలకు కనీసం నల్లాలు కూడా లేకపోవడంతో నీటిని అరికట్టడం సాధ్యం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం చలికాలంలోనే ఇలా నీటిని వృధా చేస్తే, రానున్న వేసవి కాలంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు నీటిని కాపాడుకోకపోతే, ఎండలు ముదిరినప్పుడు తాగడానికి చుక్క నీరు దొరకక అల్లాడాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వృధా కేవలం బ్రహ్మణపల్లి, దుబ్బా తండాలే కాకుండా మండలంలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు. పంచాయతీ సిబ్బంది నీటి సరఫరా సమయాల్లో నిరంతరం పర్యవేక్షించాలని, లీకేజీలు ఉన్న చోట, నల్లాలు లేని కుళాయిలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, నీటిని వృధా చేస్తున్న సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే మండల పరిషత్ అధికారులు, నూతన సర్పంచులు స్పందించి నీటి వృధాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## గాంధీ పేరు తొలగింపు హేయం





**ప్రజాపక్షం/ఖానాపూర్ :**ఖానాపూర్ పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీనాయకులు,తదనంతరం నాయకులు మాట్లాడుతూ డిసిసిఅధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశానుసారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పేరును మారుస్తూ బిజెపి కేంద్ర ప్రభుత్వం మహాత్ముడి పేరుపై చేస్తున్న కుట్రలకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద గల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేశారు.ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ అబ్దుల్ మజాద్,ఆత్మకమిటీ అధ్యక్షుడు తోట సత్యం,మేడం పెల్లి సర్పంచ్ రాజేందర్,మాజీ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్,కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్,మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షౌకత్ పాషా,జన్నారపు శంకర్,గంగనర్సయ్య,గోపినాయక్,నేత శ్యామ్,రాజేశ్వర్,శ ంకర్,రాజ్ కుమార్,శ్రీను,జహీర్ భాయ్ నయిమ్,జూలి,నజీర్,తదితరులు పాల్గొన్నారు.


**గాంధీ పేరు తొలగించడంపై అనేక అనుమానాలు..**

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్..**

జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మారుస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ ను రద్దు చేయాలనీ అమలు చేసిన జిఒను ఖండిస్తూ ఖానాపూర్ మండల మస్కాపూర్ గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద అబ్దుల్ మజీద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించిన నాయకులు.ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి కొనసాగుతున్న గాంధీ పేరును తొలగించడంపై అనేకమైన అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేసే ధోరణి కొనసాగుతుందని,ఈ పథకంలో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని చెప్పడంపై బిజెపి కుట్రకు నీదర్శనమని,గాంధీ పేరును తొలగించిన ఉపాధి హామీ పని ఆపేసిన ఊరుకునేది లేదని,బిజెపి మోసాలను ఎండగడుతూ ప్రజలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించా రు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొరికకెని లక్ష్మి కాంగ్రెస్ నాయకులు శంకర్, నర్స య్య ,రాజు ,ఉషన్న, అశోక్, నజీర్ ,జహీర్, గణేష్ ,శారీష్,షకీల్,షమీం,వెంకట్ రాములు,పాల్గొన్నారు.

## పిజెఆర్ సేవలు చిరస్మరణీయం

ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం / పటాన్‌చెరు :**కార్మిక రంగానికి బడుగు బలహీన వర్గాలకు మాజీ మంత్రి కార్మిక నాయకులు పి. జనార్ధన్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పిజేఆర్ 18వ వర్ధంతి పురస్కరించుకుని పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యేక్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని పీజేఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కార్మిక రంగ సంక్షేమం కోసం వారి హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి పిజేఆర్ అని కొనియాడారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలోని కార్మికుల హక్కుల సంరక్షణలో పిజేఆర్ పాత్ర మరువలేనిదని అన్నారు. నిరంతరం బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం తపించిన పిజి ఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.అపంతరం బిర్టియు కిర్బియూనియన్ ఆద్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి కీర్బీ కార్మిక సంఘం నాయకులు మాదవరావు యాదగిరి వెంకటేష్ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్రం తీరుకు వ్యతిరేకంగా నిరసనలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడాన్ని నిరసిస్తూ ఎడపల్లి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు తరలివచ్చి కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతిపిత మహాత్మ గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం ఆయన ఆశయాలను అవమానించడమేనని వారు మండిపడ్డారు. కేవలం పేరు మార్చడమే కాకుండా నిధుల కోత విధిస్తూ గ్రామీణ పేదల జీవనాధారమైన ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. చారిత్రక నేపథ్యం ఉన్న పథకాల పేర్లను మార్చడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, వెంటనే పాత పేరునే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొని, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి తమ నిరసనను శాంతియుతంగా తెలియచేశారు.

## పేరు తొలగించడంలో ఆంతర్యం ఏమిటి ?

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆగ్రహం



**ప్రజాపక్షం/గజ్వేల్:**గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద రైతులు, కూలీలకు కడుపునిండా అన్నం పెడుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ నీరుగార్చుతోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గజ్వేల్ లో ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాలలోని కూలీలు నిరుపేద రైతులకు పట్టెడన్నం పెడుతూ భరోసాగా నిలుస్తున్న ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచే చర్యలను ఎంత మాత్రం సహించేది లేదని హెచ్చరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి పేదల నుండి తగిన గుణపాఠం తప్పదని తెలిపారు. ముఖ్యంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహాత్మా గాంధీ పేరు చెప్పుకొని ఓట్లు పొందుతున్న బిజెపి అందుకు భిన్నంగా ఉపాధి హామీ పథకానికి ఆయన పేరును తొలగించడంలో అంతర్యం ఏమిటని నిలదీస్తూ కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రజలు గమనించాలని సూచించారు. కేంద్రం లోని బిజెపి సర్కార్ గొప్పలు చెప్పుకోవడమే తప్ప పేదలకు ప్రయోజనం చేసిందేమీ లేదని పేర్కొంటూ సరిహద్దు దేశాల ముప్పును ఎదుర్కోలేకపోతుందని నిలదీశారు. దేశ దుస్థితిపై వాస్తవాలు మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేతలపై దుమ్మెత్తి పోయడమే బిజెపి నేతలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు విమర్శించారు. రోజురోజుకు పేదల బతుకులు చిద్రం అవుతుండగా, బిజెపి హయాంలో అంబానీ, ఆదానిలా కొమ్ముకాస్తూ రూ లక్షల కోట్లు కట్టబెడుతున్నట్లు వివరించారు.

## గాంధీ కుటుంబాన్ని విమర్శించే హక్కు మోదీకి లేదు

కాంగ్రెస్ ఆవిర్భావ సభలో రాష్ట్ర పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** గాంధీకుటుంబాన్ని విమర్శించే హక్కు మోథీకి లేదని ,141వ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సభలో పిసిపి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. దేశానికి స్వాతంత్రం తెచ్చింది గాంధీ కుటుంభం అటు వంటి కుటుంబాన్ని ప్రతి రోజు విమర్శించడమే పనిగా పెట్టుకొన్నారన్నారు. ప్రధాన నరేంద్రమోదీ ,అమీత్ షా, ఇద్దరు స్వాతంత్రం వచ్చే సరికి పుట్టలేదన్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తుంటారని జగారెడ్డి మండిపడ్డారు. ఆదివారం సంగారెడ్డిలోని కాంగ్రెస్ కార్యాలయంలో 141వ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ గాంధీ కుటుంబం దేశానికి చేసిన సేవలను కార్యకర్తలకు, నాయకులకు వివరించారు. కాంగ్రెస్ నాయకుల ఆస్తులు ,ప్రాణాలు సైతం లేక్క చేయకుండా దేశం కోసం పోరాటం చేశారన్నారు. నరేంద్రమోదీ ,అమీథ్‌షాలు స్వాతంత్రం కోసం పోరాటం చేశారా అని మండిపడ్డారు. గాంధీ కుటుంబ చరిత్ర లేకుండా చేయాలని బిజెపి నాయకులను తంత్రాలు చేస్తున్నారన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం పేరు మార్చడం ఇందులోభాగమన్నారు. బిజేపి పార్టీ ఓట్లు తొలగించడం , మతాల మధ్య చిచ్చు పెట్టడం, తప్ప దేశానికి చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వస్తే అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు. ఈ సమావేశంలో టీజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, అంజనేయులు, తోపాటి అనంత్‌కిషన్, కూన సంతోష్, పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తీసేయడం సిగ్గుచేటు



**ప్రజాపక్షం/బోధన్:**బిజెపి ప్రభుత్వం చేపడుతున్న చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఉపాధి హామీ పథకంలో మ హాత్మగాంధీ పేరును తీసివేయడం సిగ్గుచేటని వర్ని మ ండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆ దివారం వర్ని మండల కేంద్రంలోని మహాత్మ గాంధీ వి గ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మా ర్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, పిసిసి డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి మాట్లాడుతూ.. 1885లో భారతీయులందరూ ఒకటేనని వెంకటేష్ కి వ్యతిరేకంగా కాంగ్రెస్ పా ర్టీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దీనిలో మ హా త్మ గాంధీ అంబేద్కర్ సభ్యులుగా ఉన్నారని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం మహాత్మ గాంధీ పేరును ఉపాధి హామీ ప థ కంలో తీసివేసే నిర్ణయాన్ని ఉపేక్షించేది లేదని, చిల్లర రా జకీయాలు మానుకోవాలని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం ఒంటిగ వ్యవహరిస్తూ ఊరుకునేది లేదని మహాత్మ గాంధీ పేరును ఉంచే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోపాల్, మహమ్మద్ భారీ, గిరి, రవి, సాయిలు, ఆనంద్, లక్ష్మ ణ్, హరిసింగ్, అంబర్ సింగ్, శ్రీనివాస్ బాబు, లడ్డు, బాల గౌడ్, రాములు, శివ కుమార్, కరీం, కృష్ణారెడ్డి, హన్మంతరావు పాల్గొన్నారు.

## పార్టీ జెండా ఆవిష్కరించిన డిసిసి చైర్మన్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** డిసెంబర్ 28 కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ నిజాంసాగర్ మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు మరింత ఐక్యతతో ప్రజాసేవలో నిబద్ధత చూపాలని, కాంగ్రెస్ సిద్దాంతాలు గ్రామ స్థాయి వరకు బలంగా చేరేలా ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రీల్

## హుమా ఖురేషి పోస్టర్ విడుదల




కేజీఎఫ్ హీరో తాజాగా నటిస్తున్న టాక్సిక్ సినిమా నుంచి హుమా ఖురేషి పోస్టర్ విడుదల చేశారు. ఇందులో హుమా ఖురేషి వాలా కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి 2026 మార్చి 19న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. హుమా ఖురేషితో పాటు కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

## '45 ది మూవీ' ప్రీ రిలీజ్



కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్, రియల్ స్టార్ ఉపేంద్ర, రాజ్ బి శెట్టి వంటి స్టార్లతో అర్జున్ జన్య తెరకెక్కించిన చిత్రం '45 ది మూవీ'. ఈ చిత్రాన్ని సూరజ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద ఉమా రమేష్ రెడ్డి, ఎం రమేష్ రెడ్డి భారీ ఎత్తున నిర్మించారు. మైత్రి ద్వారా తెలుగులో జనవరి 1న ఈ సినిమాను గ రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా శివ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. 'వేద' తరువాత మళ్లీ '45' మూవీ కోసం హైదరాబాద్‌కు వచ్చాను. నాలుగైదు నిమిషాల్లోనే అర్జున్ జన్య అద్భుతంగా స్టోరీని నెరేట్ చేశారు. తెలుగులో మా మూవీని మైత్రి రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. కన్నడలో ఆల్రెడీ సక్సెస్ అయింది. ఈ మూవీని చూస్తే కచ్చితంగా ప్రతీ ఒక్క ప్రాణిని ప్రేమిస్తారు. జనవరి 1న మా మూవీని అందరూ చూడండి' అని అన్నారు. ఉపేంద్ర మాట్లాడుతూ 'అర్జున్ కథను నెరేట్ చేసిన విధానం నాకు చాలా నచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్గా ఆయన ఎంత సక్సెస్ అయ్యారో నాకు తెలుసు. ఈ కథను నెరేట్ చేసేటప్పుడు ప్రతీ పాత్రను యాక్ట్ చేసి మరీ చూపించారు. ముందుగా ఓ సీన్‌ను చిత్రీకరించాడు. ఈ మూవీ తరువాత అర్జున్ పెద్ద దర్శకుడిగా మారిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అర్జున్ జన్యా, నిర్మాత రమేష్ రెడ్డి, మైత్రి శశి పాల్గొన్నారు.

## విదేశాల్లో బుకింగ్స్ ప్రారంభం




చిరంజీవి నటించిన 'మన శంకర్ వర ప్రసాద్ గారు' సినిమా కోసం విదేశాల్లో బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. ఇందులో వెంకటేష్ మరో కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటించింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రీమియర్ షోస్ జనవరి 11న విదేశాల్లో జరుగనుంది. ఈ సినిమాను 12న థియేటర్లలో విడుదల కానుంది. ముఖ్యంగా అమెరికాలో చిరంజీవికి విపరీతంగా ఫాలోయింగ్ ఉంది. బుకింగ్స్ ప్రారంభం అయిన నేపథ్యంలో చాలా ఫాస్ట్‌గా బుకింగ్స్ జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. సుస్మిత కొణిదెల, సాహు నిర్మిస్తున్నారు.

## 'శంబాల'కు అద్భుతమైన స్పందన...

- యుగంధర్ ముని




ఆది సాయికుమార్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ నిర్మించిన చిత్రం'శంబాల'. ఇటీవల విడుదలై సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న నేపథ్యంలో దర్శకుడు యుగంధర్ ముని మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. శంబాల' ప్రయాణం మూడేళ్ల క్రితం ఈ పాయింట్ అనుకున్నాను. నాకు రాజశేఖర్‌తో ఐదేళ్ల నుంచి అనుబంధం ఉంది. ఈ పాయింట్‌ను ఆయనకు చెప్పాను. ఆ కథ నిర్మాతకి చాలా నచ్చింది. ఆ తరువాత మహిధర్ వచ్చారు. అలా మా ఈ జర్నీ మొదలైంది దర్శకుడిగా ఈ కథను ఎంతో బాధ్యతతో రాసుకున్నాను. నేను చెప్పే కథను చాలా మంది చూస్తారు. ఎంతో నేర్చుకుంటారు. ఏ ఒక్కరినీ బాధ పెట్టకూడదు. సైన్స్, శాస్త్రానికి మధ్య బాలెన్స్ చేయాలని, ఎవ్వరి మనోభావాల్ని దెబ్బ తీయకూడదని ముందే అనుకున్నాను. హౌస్ ఫుల్ బోర్డులు పడినా కూడా గేట్లు తన్నుకుంటూ వెళ్తున్నారు. ఇవన్నీ నేను చిన్నప్పుడు చిరంజీవి సినిమాలకు చూశాను. ఇండస్ట్రీ నుంచి చాలా మంది ఫోన్స్ చేశారు. హీరోలు, దర్శక, నిర్మాతలందరూ ఫోన్స్ చేసి అభినందిస్తున్నారు. ఆది ఈ మూవీ విజయం పట్ల ఆనందంగా ఉన్నారు. ఆయన ఇలాంటి ఓ సక్సెస్ కోసం చాలా కష్టపడుతూనే వచ్చారు. సెట్లో ఎన్ని గాయాలైనా కూడా ఆయన ఎక్కడా తగ్గకుండా వర్క్ చేశారు. ఆది స్క్రిప్ట్‌లో ఎక్కువగా ఇన్ పుట్స్ ఇవ్వలేదు. కథా చర్చల టైంలో ఆది సలహాలు ఇచ్చారు. కానీ ఒక్కసారి స్క్రిప్ట్ లాక్ అయిన తరువాత ఆయన మళ్లీ ఛేంజెస్ చెప్పలేదు. ఆయన చెప్పింది చెప్పినట్టుగా నటించుకుంటూ వెళ్లారు. ఉల్క పడిన ప్రాంతం ఎలా ఉంటుంది? అనే విషయంలో చాలా రీసెర్చ్ చేశాను. ఉల్క పడితే ఏం జరుగుతుంది? దాని చుట్టూ ప్రాంతం ఎలా ఉంటుంది? అని బ్రెజిల్లో జరిగిన ఘటనల మీద పరిశోధన చేశాం.

## స్టార్స్ ముచ్చట్లు...



స్టార్స్ కలిసి ఒక చోట కలిస్తే చూడముచ్చటగా ఉంటుంది కదు. ఈ ఫోటో అదే సూచిస్తోంది. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ స్టార్ రామ్ చరణ్, క్రికెట్ స్టార్ ఎంఎస్ ధోణి, విలన్ బాబీ డియోల్ ఒకే చోట కలసి ముచ్చట్లు పెట్టుకుంటున్నారు. సల్మాన్ ఖాన్ 60వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ స్టార్స్ అంతా కలిశారు.

## రోషన్‌తో అల్లు అరవింద్ సినిమా



'చాంపియన్' బ్లాక్‌బస్టర్ విజయంతో యంగ్ హీరో రోషన్ కెరీర్ కీలక మలుపు తిరిగింది. తాజాగా గీతా ఆర్ట్స్ అధినేత, అగ్ర నిర్మాత అల్లు అరవింద్ 'చాంపియన్' చిత్రాన్ని వీక్షించి, రోషన్ నటనకు ఎంతగానో ముగ్ధులయ్యారు. ఆయన వ్యక్తిగతంగా రోషన్‌ను అభినందించడమే కాకుండా, తన బ్యానర్‌లో రోషన్‌తో సినిమా చేయనున్నారు. ఈ విషయాన్ని అల్లు అరవింద్ ప్రకటించారు. టాలీవుడ్లో అగ్ర నిర్మాతల్లో ఒకరైన అల్లు అరవింద్ నుంచి వచ్చిన ఈ అవకాశం రోషన్ టాలెంట్‌కు గొప్ప గుర్తింపుగా నిలుస్తోంది. ఇప్పటికే ఇండస్ట్రీలో మోస్ట్ ప్రామెసింగ్ యంగ్ హీరోగా గుర్తింపు తెచ్చుకుంటున్న రోషన్, నాగ వంశీ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లో కూడా ఓ సినిమా చేయనున్నారు.

# 'రాజా సాబ్' బ్లాక్ బస్టర్ కావాలి

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రభాస్



రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'రాజా సాబ్'. దర్శకుడు మారుతి. 'రాజా సాబ్' సినిమాను టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న 'రాజా సాబ్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గేయ రచయిత కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ... 'రాజా సాబ్' చిత్రంతో ఫస్ట్ టైమ్ ప్రభాస్‌కి పాట రాశాను. ఆ పాటను సర్ ప్రైజ్ ప్యాకేజ్‌లా త్వరలో రిలీజ్ చేయబోతున్నారు. ముగ్గురు హీరోయిన్స్‌తో ప్రభాస్ ఈ పాటలో వేసే స్టెప్స్ స్క్రీన్ మీద చూసేందుకు నేను కూడా మీతో పాటు ఎదురుచూస్తున్నాన్నారు.

నటి జరీనా వాహాబ్ మాట్లాడుతూ... నేను 40 ఏళ్లుగా సినిమా ఇండస్ట్రీలో ఉన్నాను. రాజా సాబ్ వంటి మంచి సినిమాతో తెలుగులో నటించే అవకాశం కల్పించారు. నేను ఎంతోమంది నటులతో నటించాను గానీ ప్రభాస్ వంటి మంచి మనసున్న వ్యక్తిని చూడలేదు. అతనికి నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి అన్నారు.

హీరోయిన్ రిద్ధి కుమార్ మాట్లాడుతూ.. ఆయన ఎలా ఉంటారో అలాగే ఈ సినిమాలో మారుతి చూపించబోతున్నారు. ప్రభాస్‌లో ఉన్న మంచి క్వాలిటీస్ అన్నీ ఈ సినిమాలో మీరు చూడొచ్చు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రభాస్‌ని మరింత ఇష్టపడతారు. మీరంతా రాజా సాబ్‌ను జనవరి 9న థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేస్తారన్నారు.

హీరోయిన్ మాళవిక మోహనన్ మాట్లాడుతూ.. నాకు తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే ఇష్టం, గౌరవం. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ సరసన నటిస్తూ, రాజా సాబ్ లాంటి ప్రెస్టీజియస్ మూవీతో టాలీవుడ్‌లోకి అడుగుపెడతానని ఊహించలేదు. ప్రభాస్ ఫ్యాన్స్‌కు రెబల్ స్టార్, రెబల్ గాడ్. కానీ మా అందరికీ రాజా సాబ్.

హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. ఇండియా బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్‌తో కలిసి సినిమా చేయడం కల నిజమైన అనుభూతి కలిగిస్తోంది. ఆయన ఎంతమంచి వారో మాటల్లో చెప్పలేను. మీ అందరి అభిమానం, ప్రేమతో ఇంకా మరిన్ని విజయాలు ప్రభాస్ అందుకోవాలి. గల్లీలో సిక్స్ కొట్టడం కాదు స్టేడియంలో కొట్టేవాడికి ఒక రేంజ్ ఉంటుంది. ప్రభాస్ రేంజ్ అది. రాజా సాబ్‌లో నటించే అవకాశం కల్పించిన మారుతికి థ్యాంక్స్ అని అన్నారు.

డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. నేను ఈ వేదిక మీద నిలబడ్డాను అంటే అది మీరు ఇస్తున్న సపోర్ట్ వల్లే. రాజా సాబ్ వెనక బలంగా నిలబడింది ఇద్దరు. ప్రభాస్ ఆదిపురుష్ సినిమాలో రాముడిగా నటిస్తుండగా, ఈ మారుతి ఆయన దగ్గరకు వెళ్లాడు. రాజా సాబ్ కథ విని ప్రభాస్ చాలా నవ్వుకున్నారు. అయితే ఆయనకు ఈ సినిమా చేయాల్సిన అవసరం లేదు. బాహుబలి తర్వాత ప్రపంచమంతా ప్రభాస్ గుర్తింపు తెచ్చుకున్నారు. మేము సౌతాఫ్రికాలో ఒక చిన్న ఊరిలో షూటింగ్ చేస్తుంటే, అక్కడి వారికి కూడా ప్రభాస్ తెలియడం మమ్మల్ని సర్ ప్రైజ్ చేసింది అని అన్నారు.

రెబల్ స్టార్ ప్రభాస్ మాట్లాడుతూ... ఈ మధ్యే జపాన్ ఫ్యాన్స్‌ను కలిసినప్పుడు ఇలాగే హ్యాపీగా ఫీలయ్యా. మీ అందరి కోసం కొత్త హెయిర్ స్టైల్‌లో వచ్చా. అనిల్ తడానీ నా బ్రదర్ లాంటి వారు. ఆయన నా సినిమాలకు నార్త్‌లో సపోర్ట్ చేస్తుంటారు. సంజయ్ దత్ క్లోజ్ షాట్ పెడితే సీన్ మొత్తం తినేస్తారు, నాతో పాటు జరీనా కూడా రాజా సాబ్‌లో హీరోనే. రిద్ధి, మాళవిక, నిధి ముగ్గురూ బ్యూటిఫుల్ హీరోయిన్స్. ఈ సినిమాకు అనుకున్న బడ్జెట్ పెరిగింది. మూడేళ్ల 'రాజా సాబ్' స్ట్రెస్, బాధ్యత అన్నీ కలిసి మారుతికి కన్నీళ్లు వచ్చాయి. సంక్రాంతికి అన్ని సినిమాలతో పాటు మా రాజా సాబ్ కూడా బ్లాక్‌బస్టర్ కావాలి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్స్ టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ రచన, దర్శకత్వం మారుతి పాల్గొన్నారు.

## మూడు రోజుల్లో 'ఈషా'కు రూ.4 కోట్ల గ్రాస్




ఇటీవల విడుదలైన ఈషా సినిమా విడుదలైన మూడు రోజుల్లో 4 కోట్ల 80 లక్షల గ్రాస్‌ను వసూలు చేసిన బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందని సమర్పకులు దామోదర్ ప్రసాద్ అన్నారు. ఈషా చిత్రం నుంచి లాభాల బాటల్లో అడుగుపెట్టింది. పెయిడ్ ప్రీమియర్స్ దగ్గర నుంచే స్ట్రాంగ్ కలెక్షన్స్‌తో అద్భుతమైన ఓపెనింగ్స్‌తో ప్రారంభమైన 'ఈషా' బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకోవడంతో పాటు రోజు రోజుకు కలెక్షన్స్ పెంచుకుంటూ విజేతగా నిలిచింది.

## జనవరి 2న 'ఓ అందాల రాక్షసి'



దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, కథకుడిగా షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటూ ఉన్నారు. ప్రస్తుతం ఆయన 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రం జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కథ, మాటల రచయిత భాష్య శ్రీ, కృతి వర్మ, విహాన్షి హెగ్డే పాల్గొన్నారు.

# 1 నుంచి నుమాయిష్

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందన్నారు. ప్రవేశ టికెట్ ధర రూ.50, 5 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత ప్రవేశం ఉందని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు స్టాళ్ల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని ఎగ్జిబిషన్ సొసైటీ వెల్లడించింది.

### భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

ఎగ్జిబిషన్ నిర్వహణకు 34 ఉప కమిటీలను ఏర్పాటు చేశారు. భద్రత కోసం 106 మంది సెక్యూరిటీ సిబ్బంది, 138 మంది డే వాలంటీర్లు, 76 మంది నైట్ వాలంటీర్లు విధులు నిర్వహిస్తారు. మొత్తం 320 మంది వాలంటీర్లు ఎగ్జిబిషన్‌లో సందర్శకుల భద్రతను పర్యవేక్షించనున్నారు. ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేపడతారు. నిషేధిత వస్తువులకు అనుమతి ఉండదని నిర్వాహకులు స్పష్టం చేశారు.

### అగ్నిమాపక భద్రత

అగ్నిప్రమాదాలను నివారించేందుకు రెండు అండర్‌గ్రౌండ్ వాటర్ సంప్స్, 82 హైడ్రెంట్లు, నిరంతర నీటి ఒత్తిడి ఏర్పాటు చేశారు. 10 వేల లీటర్ల సామర్థ్యం గల రెండు ఫైర్ ఇంజిన్లు ప్రాంగణంలో అందుబాటులో ఉంటాయి.

### 1050 స్టాళ్లు – 20 ఫుడ్ స్టాళ్లు

ఈ ఏడాది స్టాళ్లకు భారీ డిమాండ్ నెలకొంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తయారీదారులు, కళాకారులతో కలిపి 1050 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిలో 20 ఫుడ్ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆర్‌బిఐ, ఖాదీ, అటవీ శాఖ, పోలీస్ శాఖ, ఎల్‌ఐసి, పర్యాటక శాఖ వంటి ప్రభుత్వ విభాగాలు కూడా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి.

### రవాణా – పార్కింగ్ సౌకర్యం

గాంధీభవన్, నాంపల్లి మెట్రో స్టేషన్ల నుంచి ఎగ్జిబిషన్‌కు నేరుగా మెట్రో సౌకర్యం ఉంది. ప్రత్యేకంగా రాత్రివేళల వరకు మెట్రో రైళ్లు నడపనున్నారు.

టిఎస్ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేయనుంది.

చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉచిత పార్కింగ్, హ్యాండ్లూమ్ హౌస్ సమీపంలో మల్టీ లెవల్ పేడ్ పార్కింగ్ అందుబాటులో ఉంటుంది.

### వైద్య సేవలు..

యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హెల్త్ చెకప్ సెంటర్, లయన్స్ ఇంటర్నేషనల్ సహకారంతో కంటి ఆస్పత్రి ఏర్పాటు చేశారు. 24x7 అంబులెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది.

### నగరానికి నుమాయిష్ గర్వకారణం..

గత 8 దశాబ్దాలుగా నుమాయిష్ హైదరాబాద్ సంస్కృతిలో భాగమైందని, అన్ని వర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చే వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది కూడా సురక్షితంగా, సంతోషకరంగా నుమాయిష్‌ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.



## ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడిగా సురేష్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రోగ్రెసివ్ ప్యానెల్ విజయ దుందుభి మోగించింది. ఫిలిమ్స్ ఛాంబర్ నూతన అధ్యక్షుడిగా దగ్గుబాటి సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సూర్యదేవర నాగవంశీ (లక్కి భాస్కర్ నిర్మాత), భరత్ చౌదరి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా అశోక్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా మోహన్ వడ్లపట్ల, విజయేందర్ రెడ్డి, కోశాధికారిగా ముత్యాల రాందాస్ విజయం సాధించారు. ప్రోగ్రెసివ్ ప్యానెల్ సహకారంతో సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ ప్యానెల్‌కు దిల్ రాజు, అల్లు అరవింద్ మద్దతు తెలిపారు. 31మంది ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి సభ్యులు గెలిచారు. 17 మంది మన ప్యానెల్ నుంచి సభ్యులుగా విజయం సాధించారు.

## ఆడంబరాలు వీడి.. అప్పులు లేని సమాజాన్ని నిర్మించండి

'ప్రభాత' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం

మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్: సమాజంలో ఆర్థిక అస్థిరతకు మనిషి ఆలోచనా విధానమే ప్రధాన కారణమని, ఆడంబరాలు, అనవసర ఖర్చులను వీడి అప్పులు లేని సమాజాన్ని నిర్మించుకోవాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో భాగంగా అనిశెట్టి రజిత వేదికపై ఆదివారం సాయంత్రం పుస్తక స్ఫూర్తి, పుస్తకం ఒక దారిదీపం చర్చా కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీనియర్ పాత్రికేయులు కే.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విజ్ఞానం పెరిగినా మనిషి ఇంకా అప్పుల ఊబిలోనే ఉండటం విచారకరమన్నారు. ప్రభుత్వాలు రూ.వేల కోట్లు సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తున్నా, ఆ సంపద పేదవాడి ఇంట నిలవకపోవడానికి కారణం కార్పొరేట్ విద్య, వైద్యం పేరిట జరుగుతున్న వృథా ఖర్చులేనని విశ్లేషించారు. వచ్చే ఐదేళ్లలో అప్పులు లేని సమాజాన్ని చూడాలన్న లక్ష్యంతో 'ప్రభాత' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. అధికారులు, కవులు, కళాకారులను ఏకం చేసి గ్రామ గ్రామాన నాటికలు, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. చిన్నప్పుడు పాఠశాలల్లో ఉండే ప్రభాత భేరి స్ఫూర్తిని మళ్ళీ తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

మహిళలు, యువతలో పఠనాశక్తిని పెంచేందుకు తమ శాఖ తరపున రూ.ఒక కోటి వ్యయంతో స్ఫూర్తిదాయక పుస్తకాలను కొనుగోలు చేస్తున్నట్లు జూపల్లి ప్రకటించారు. వీటిని గ్రామ పంచాయతీలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కేవలం పుస్తకాలు చదవడం ద్వారానే కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయని, అది సామాజిక మార్పుకు నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. అనంతరం ప్రసంగకర్తలు రమ మేల్కొటే, పాశం యాదగిరి, మాడభూషి శ్రీధర్, గోరటి వెంకన్నలను సన్మానించారు.





# రెట్టింపు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా సిపిఐ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 100 ఏళ్ల పైలాన్‌ను కూనంనేని ముఖ్యఅతిథిగా హాజరై సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి పైలాన్ ఆవిష్కరించారు. అంతకంటే ముందు సిపిఐ వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ముందుగా అరుణ పతాకాన్ని ఎగురవేసి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బిజెపి యుద్ధోన్మాదానికి కూడా తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. దేశభక్తి ముసుగులో బిజెపి కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతున్నదన్నారు. కోట్ల సంవత్సరాలు చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను ఆదాని మైనింగ్ కంపెనీకి కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వం చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో ఐదు లక్షల మంది ప్రజలతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు జిల్లా నుండి వేలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు.




జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. దున్నే వాడికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ, లౌకిక ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలకు అనేక హామీలు ఇచ్చిందని వాటిని వెంటనే నెరవేర్చాలని, భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న పేదలకు నాలుగు సంవత్సరాలు అయిన ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, వెంటనే ప్రభుత్వం గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శిలు గురుజపెల్లి సుధాకర్‌రెడ్డి, ఫైండ్ల శాంతికుమార్, పట్టణ కార్యదర్శి సతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా సమితి సభ్యులు క్యాథరాజు సతీష్, మాతంగి రామ్ చందర్, కొరిమి సుగుణ, నూకల చంద్రమౌళి, జి.శ్రీనివాస్, తాళ్ల పోశం, నేరెళ్ల జోసెఫ్, శ్రీకాంత్, గోలి లావణ్య యా కూబ్ పాషా, సుమారు 1000మంది పాల్గొన్నారు.

# మధిర అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి భూమి పూజ చేస్తామని డిప్యూటీ సిఎం వివరించారు. నూతన కోర్టు భవన పనుల శరవేగంగా సాగుతున్నాయన్నారు. మధిర పరిసర ప్రాంతాల్లోని రైతులు వారి ఉత్పత్తులను మధిర పట్టణంలో అమ్ముకునేందుకు మధిర పట్టణ వాసులకు తాజా కూరగాయలు అందుబాటులోకి తెచ్చేందుకు రైతు బజార్ ఏర్పాటు చేశానని తెలిపారు. మధిర పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలన్న ఆలోచనతో మనపిల్లలు చదువుకుంటేనే మధిర పట్టణానికి భవిష్యత్ ఉంటుందన్న దూర దృష్టితో డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు హైస్కూల్ భవనానికి కొత్త బిల్డింగ్‌లు నిర్మిస్తున్నట్లు, ఇప్పటికే సంబంధిత టెండర్లను పిలిచామని తెలిపారు. మధిరను విద్యా కేంద్రంగా మార్చాలని ఆలోచనతో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, రెగ్యులర్ పాలిటెక్నిక్ కళాశాల, ఐటిఐలను తీసుకువచ్చినట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని టెక్నాలజీ సెంటర్లుగా మార్చి యువతకు ఉపాధి కల్పించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. త్వరలో ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పనులకు భూమి పూజ చేస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చెందితే స్థానిక రైతులకు యువతకు మేలు చేకూరుతుందన్న ఆలోచనతో మధిర, ఎర్రుపాలెం ప్రాంతాల్లో ఆధునిక ఇండస్ట్రీయల్ పార్క్‌లు, పరిశ్రమలు పెట్టుకోవడానికి అవసరమైన కరెంట్, నీళ్లు, రోడ్లు, మార్కెట్ వంటి అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకుంటే పరిశ్రమలు పెట్టుకునేందుకు స్థలాలు కేటాయిస్తామన్నారు. మధిర పట్టణంలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మెప్మా ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తామన్నారు. రాజకీయాలకతీతంగా మధిర పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని, ఎవరికి ఏ ఆలోచన ఉన్నా తనతో పంచుకోవాలని డిప్యూటీ సిఎం పట్టణ మేధావులు, డాక్టర్లు, లాయర్లు, జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు. మధిర పట్టణంలో ఆర్టిసి బస్టాండ్ నిర్మాణం పెద్దఎత్తున జరుగుతోందని, ఐదు చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, జమలాపురం ఆలయాన్ని టెంపుల్ టూరిజం కింద అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, మధిర మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు, వివిధశాఖల అధికారులు, పార్టీల నాయకులు, అభిమానులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com